




ESTD: 1999

www.voodayam.com

# వుదయం

సంపుటి : 27 సంచిక : 222 | హైదరాబాద్ | 15-10-2026 గురువారం | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on







## రాజ్యాంగ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా నిరసనలు



**సీజేపీ నేతల అరెస్టును ఖండించిన రాహుల్ గాంధీ**

**శాంతియుత ఆందోళన హక్కును కాపాడుకుంటామని స్పష్టీకరణ**

**సీజేపీ నేతల అరెస్టు అన్యాయమంటూ కాంగ్రెస్ నేత ఖండన**

**జంతర్‌మంతర్ వేదికపై పోలీసుల చర్యల దుమారం**

న్యూఢిల్లీ : జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాల అరెస్టును ఖండిస్తూ, వారికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంఘీభావం ప్రకటించడాన్ని ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్వాగతించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ జెండాను చేతబూని శాంతియుతంగా నిరసన తెలపడం నేరం కాదని, అలా ఆందోళన చేస్తున్న యువకులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు తరలించడం అత్యంత దుర్మార్గమని రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా తీవ్ర స్థైర్యంతో విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జంతర్‌మంతర్‌ను మళ్లీ నిరసన వేదికగా సాధించుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు, ఢిల్లీలోని ప్రఖ్యాత జంతర్‌మంతర్ ప్రాంగణాన్ని ధర్నాలు, ఆందోళనల వేదికగా రద్దు చేస్తూ (డీనోటిఫై) ఢిల్లీ పోలీసులు ఇటీవల సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పోలీసుల ఈ నిబంధనను సీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు నిబంధనలను ధిక్కరించి జంతర్‌మంతర్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగడంతో, పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు.

## తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారుస్తాం



**సమాఖ్య గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో సీఎం రేవంత్**

**పారిశ్రామిక ప్రగతిలో యువత, మహిళలదే కీలక పాత్ర**

**పెరి అర్బన్ జోన్‌లో పెట్టుబడులకు ముఖ్యమంత్రి ఆహ్వానం**

**హైదరాబాద్, అక్టోబర్ 14 (వుదయం) :** తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ పురోగతిలో యువత, మహిళలు క్రియాశీలక భాగస్వాములు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ 2026' ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. నూతన తరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఈ చాంబర్ చూపుతున్న చొరవను అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆధునిక మార్పులు, చట్టాలు, నూతన విధానాలపై యువత పూర్తి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. వివిధ రంగాల అనుభవజ్ఞుల ఆలోచనలు, పాఠాల ద్వారా యువ పారిశ్రామికవేత్తలు కొత్త శిఖరాలను అధిరోహించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు పారిశ్రామిక, రాజకీయ, న్యాయ, చలనచిత్ర రంగాల్లో సాధించిన ఘనతలను నమోదు చేసి, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా అందించాలని సూచించారు.

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం:**

భారతదేశ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల (2047) నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చే 'వికసిత్ భారత్' లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని తెలిపారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్' ఆధారంగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు.

**మహిళా సాధికారత - పెట్టుబడులకు ఆహ్వానం:**

ప్రపంచవ్యాప్తంగా మహిళల భాగస్వామ్యం పెరిగిన దేశాలే వేగంగా పురోగమించాయని, రాష్ట్రంలో కూడా మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. కేవలం విదేశీ సంస్థల్లో ఉద్యోగాలు చేయడమే కాకుండా, మన యువత సొంతంగా స్టార్టప్‌లు ప్రారంభించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు పాల్గొన్నారు.

### రాజ్యాంగం ఇచ్చింది నిరసన హక్కు మాత్రమే..

## చట్టాన్ని ఉల్లంఘించేందుకు కాదు



న్యూఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాతో పాటు ప్రత్యేకాంశాల సవరణ (సర్) ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ నిరసనలు చేపడుతున్న సీజేపీ కార్యకర్తలకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండించింది. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానాలని ఆయనకు ఘాటుగా హితవు పలికింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడానికి రాజ్యాంగం హక్కు కల్పించిందని, అయితే చట్టాలను అతిక్రమించడానికి కాదని స్పష్టం చేసింది. ఈ అంశంపై భాజపా జాతీయ మీడియా కన్వీనర్ ఆశీష్ ఉషా అగర్వాల్ తీవ్రంగా ధ్వజమెత్తారు. "దేశ ప్రజలను భ్రమల్లోకి నెట్టవద్దు. రాజ్యాంగం నిరసన తెలిపే హక్కును మాత్రమే ఇచ్చింది కానీ చట్టాన్ని ఉల్లంఘించేందుకు అనుమతించలేదు. నిబంధనలు, చట్టబద్ధమైన విధానాల ప్రకారమే జంతర్ మంతర్ స్థలంలో నిర్ణయాలు తీసుకున్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారు. దశాబ్దాల పాటు మీ పార్టీ, మీ కుటుంబం ఆర్టికల్ 370కి అండగా నిలిచాయి. కానీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దానిని రద్దు చేస్తూ చారిత్రాత్మక నిర్ణయాన్ని అమలు చేశారు. కేవలం అధికారం దక్కించుకోవడానికి బహిరంగ ప్రాంతాలను అల్లర్లకు వేదికలుగా మార్చడం సాధ్యం కాదు. దేశం ఎప్పుడూ చట్టం వైపే నిలబడుతుంది తప్ప రాజకీయ ప్రయోజనాల వైపు కాదు" అని ఆయన స్పష్టం చేశారు.

## పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వరకు ప్రజా ప్రభుత్వమే అండ



**మన్ననూర్‌లో రూ.53.78 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి**

**అచ్చంపేట ప్రాంతాన్ని ప్రధాన రవాణా కూడలిగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం**

**తెలంగాణలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు: మంత్రి భట్టి విక్రమార్క**

**మన్ననూరు , అక్టోబర్ 14 (వుదయం)**

తెలంగాణలో ప్రతి ఒక్కరూ ఇక్కడ పుట్టడమే అదృష్టంగా భావించేలా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో రూ.53.78 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న 220/30 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వరకు పౌరులందరికీ ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు.

అచ్చంపేటతో 46 ఏండ్ల విడదీయలేని అనుబంధం:

తన సోదరుడు స్వర్గీయ మల్లు అనంత రాములు పార్లమెంటుకు పోటీ చేసిన నాటి నుంచి అచ్చంపేట ప్రాంతంతో తనకు 1980 నుంచి ఎంతో అవినాభావ సంబంధం ఉందని భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశలోనే ఈ ప్రాంతంలోని గ్రామాల్లో పర్యటించి ప్రజల కష్టాలను దగ్గరగా చూశానని చెప్పారు. తన పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు, విద్యుత్ శాఖ బాధ్యతలు తన వద్ద ఉండటంతో ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.75 కోట్లతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశామని, రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు.

సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగులు:

గత మూడేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజల ఖాతాల్లోకి రూ.1,64,431 కోట్లు జమ చేశామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ లెక్కలపై ఎవరితోనైనా చర్చించేందుకు, ఎలాంటి సవాల్‌నైనా స్వీకరించడానికి తాను సిద్ధమని ప్రకటించారు.

రాష్ట్రంలో అమలవుతున్న ప్రధాన సంక్షేమ పథకాల తీరును ఆయన వివరించారు:

సన్న బియ్యం పంపిణీ: రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున నాణ్యమైన సన్న బియ్యం ఉచితంగా అందిస్తున్నాం.

ఆరోగ్యశ్రీ: కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు కల్పిస్తున్నాం.

చేయూత పింఛన్లు: ఆర్థికంగా వెనుకబడిన 43 లక్షల మందికి ఆసరా పింఛన్ల ద్వారా భరోసా ఇస్తున్నాం.

రైతు భరోసా: 71.40 లక్షల మంది రైతన్నలకు ఎకరానికి ప్రతి సీజన్‌లో ఆర్థిక సాయం అందిస్తున్నాం.

ఉచిత విద్యుత్: 53 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

మహాలక్ష్మి పథకం: ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం.

ఇందిరమ్మ ఇళ్లు: సొంతింటి కల నెరవేర్చేందుకు ఒక్కో ఇస్సుకు రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తున్నామని, అచ్చంపేటలోనే 7,300 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు.

విద్యారంగం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అల్పాహారంతో పాటు పాలు, రాగిజావ అందిస్తున్నామని వెల్లడించారు.

**ఎకో టూరిజంతో ఉపాధి - రవాణా రంగ అభివృద్ధి:**

అచ్చంపేట ప్రాంతంలోని నల్లమల అటవీ ప్రాంతం, మన్ననూరు ప్రకృతి సౌందర్యాన్ని ఆధారంగా చేసుకుని సుమారు 500 ఎకరాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 'ఎకో టూరిజం' ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. దీని ద్వారా స్థానిక గిరిజనులు, యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని, అచ్చంపేటను ప్రధాన రవాణా కూడలిగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ కృతజ్ఞతలు:**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ... ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో అచ్చంపేటలో లోవోల్టేజీ, విద్యుత్ అంతరాయాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కృషి చేసినందుకు, డివిజన్ కార్యాలయం మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం, విద్యుత్ శాఖ డైరెక్టర్ ఆపరేషన్ నరసింహ, గ్రామ సర్పంచ్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీలో 16న 'ఇంటింటా బతుకమ్మ' వేడుకలు

**న్యూఢిల్లీ,అక్టోబర్14 వుదయం ప్రతినిధి):** తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశ రాజధాని న్యూఢిల్లీలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. 'ఇంటింటా బతుకమ్మ 2026' పేరుతో అక్టోబర్ 16వ తేదీ (శుక్రవారం) సాయంత్రం 5 గంటల నుంచి ఈ సంబరాలు జరగనున్నాయి. న్యూఢిల్లీలోని 1 అశోకా రోడ్డులో ఉన్న తెలంగాణ భవన్ ఈ వేడుకలకు వేదిక కానుంది. ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏ.పి. జితేందర్ రెడ్డి, రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ (ఐఏఎస్) ఓ అధికారిక ప్రకటనలో ఆహ్వానించారు.

## సింగరేణిని పట్టించుకోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**గోదావరిఖని , అక్టోబర్ 14 (వుదయం):**

ప్రభుత్వ నిర్లక్ష్యంతో సింగరేణి సంస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సంస్థపై కనీస శ్రద్ధ లేదని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. కేవలం వాటాలు కుదరకపోవడం వల్లే నైనీ బొగ్గు గనుల టెండర్లను రద్దు చేశారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... సింగరేణిలో నైనీ కుంభకోణాన్ని తామే అడ్డుకున్నామని, తద్వారా ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వయంగా చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. పరస్పరం వాటాలు సరిపోక ఈ కుంభకోణాలను వారే స్వయంగా బయటపెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు.






**స్టాక్ మార్కెట్ అప్‌డేట్**

**72,781 వద్ద స్థిరపడిన సెన్సెక్స్**

**251 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్**

**ఫైనాన్షియల్, హెల్త్‌కేర్ షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాలు**

## నవంబర్ నెలాఖరుకల్లా దాడుల ప్రతిపాదన?

**అమెరికా ఎన్నికల నేపథ్యంలో ఇరాన్ పై దాడుల ఆలస్యం?**

**ఇరాన్‌పై మరో భారీ సైనిక చర్యకు సిద్ధమవుతున్న అమెరికా-ఇజ్రాయెల్**

**వాషింగ్టన్ :** ఇరాన్‌పై పశ్చిమాసియా సమీకరణాలను మార్చే స్థాయిలో మరో భారీ సైనిక చర్యను పునఃప్రారంభించాలా వద్దా అనే తీవ్రమైన అంశంపై అగ్రరాజ్యం అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య అత్యంత రహస్యంగా వ్యూహాత్మక చర్చలు జరుగుతున్నట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలు పూర్తయ్యేలోపు, అంటే నవంబర్ నెలాఖరు నాటికి టెహ్రాన్‌లోని కీలక స్థావరాలే లక్ష్యంగా భారీ ఎత్తున వైమానిక, క్షిపణి దాడులు జరిపే అవకాశం ఉన్నట్లు సదరు ప్రచారాలు పేర్కొంటున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో జరిపిన సంభాషణలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇరాన్ అణు యత్నాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇరాన్ మళ్లీ రాత్రికి రాత్రే అణ్వాయుధ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి రహస్యంగా ప్రయత్నాలు సాగిస్తోందని, ఆ ప్రమాదాన్ని నొక్కిచెబుతూ అమెరికా సాయంతో ఆ అణు శక్తిని పూర్తిగా నిర్వీర్యం చేసేలా దాడులను పునరుద్ధరించాలని ట్రంప్‌ను ఒప్పించేందుకు నెతన్యాహు తీవ్రంగా యత్నిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా, ఇరాన్‌లోని పికాక్స్ పర్వత ప్రాంతంలో దాగి ఉన్న ఇంధన, చమురు శుద్ధి కేంద్రాలు, అణు సంబంధిత మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని విధ్వంసకర దాడులు జరపాలన్న నెతన్యాహు ప్రతిపాదనకు ట్రంప్ సానుకూలంగా స్పందించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ వ్యూహాత్మక దాడులకు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, యూఎస్ సెంట్రల్ కమాండ్ ఉన్నతాధికారులు కూడా తమ పూర్తి మద్దతును తెలిపారని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే, నవంబర్ మాసంలో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈ తరహా భారీ దాడుల నిర్ణయం ఓటర్ల నిర్ణయంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని ట్రంప్ రాజకీయ సలహాదారులు ఆయనకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో అమెరికా అధ్యక్షుడు ఈ విషయంలో కాస్త వేచిచూసే ధోరణి అవలంబిస్తూ వెనక్కి తగ్గినట్లు వార్తలు వస్తున్నాయి. అయినప్పటికీ, ఒకవేళ ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఏ క్షణంలోనైనా విరుచుకుపడేలా ఇజ్రాయెల్, అమెరికా సైనిక దళాలు తీవ్ర సన్నద్ధతతో అప్రమత్తంగా ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే పశ్చిమాసియా జలాల్లోకి అమెరికాకు చెందిన భారీ విమాన వాహక నౌకలు కూడా కదులుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, ఈ సైనిక ప్రణాళికలు మరియు రహస్య చర్చలపై అమెరికా, ఇజ్రాయెల్ ప్రభుత్వాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## ఇంతే కదా...!



# గద్వాలకు కుళ్లిన చికెన్ కంపు!

- వ్యర్థాల వాహనంతో ప్రజలకు నరకయాతన
- దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి.. పట్టించుకునే వారేరీ?
- మున్సిపల్ కమిషనర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తక్షణమే స్పందించాలి



గద్వాల
అక్టోబర్ 14 (వుదయం బ్యూరో)

గద్వాల పట్టణంలో కుళ్లిన చికెన్ వ్యర్థాల తరలింపు ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. వివిధ చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను తరలిస్తున్న వాహనం నుంచి వెలువడుతున్న దుర్వాసనతో వాహనదారులు, పాదచారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రహదారులపై ప్రయాణించాలంటేనే దుర్వాసన భరించలేని పరిస్థితి ఎదురవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డెక్కితే దుర్వాసనేనా?చికెన్ వ్యర్థాల తరలింపులో తగిన జాగ్రత్తలు పాటించకపోవడంతో దుర్వాసన సమస్య తలెత్తుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలను తరలించే వాహనం నుంచి వెలువడుతున్న దుర్వాసనతో రహదారులపై రాకపోకలు సాగించే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నా ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అధికారుల పర్యవేక్షణ ఏదీ? పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. చికెన్ వ్యర్థాలను ఎలా పడితే అలా తరలించకుండా, నిబంధనల ప్రకారం నిర్వహించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. రాత్రివేళల్లో తరలించేలా ఆదేశాలివ్వాలి! జనసంచారం అధికంగా ఉండే సమయాల్లో కాకుండా, రాత్రివేళల్లో వ్యర్థాలను తరలించేలా చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని వాహనదారులు, పాదచారులు విజ్ఞప్తి చేస్తున్నారు. వ్యర్థాలను మూసివేసిన వాహనాల్లో తరలించేలా చర్యలు తీసుకోవడంతోపాటు, దుర్వాసన వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు పాటించేలా చూడాలని కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులు పట్టవా? గద్వాల మున్సిపల్ కమిషనర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి, వ్యర్థాల తరలింపుపై పర్యవేక్షణ పెంచాలని కోరుతున్నారు. ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకుంటారా? లేక సమస్య ఇలాగే కొనసాగుతుందా? అని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు.

# 1996 బ్యాచ్‌కు పాత పెన్షన్ ఇవ్వాల్సిందే!

- ఎల్ఐసీ ఉద్యోగుల డిమాండ్.. గద్వాల బ్రాంచ్‌లో లంచ్ అవర్ నిరసన కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలి: ఐసీఈయూ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు

గద్వాల,
అక్టోబర్ 14 (వుదయం బ్యూరో)

ఎల్ఐసీలో 1996 రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం (ఓపీఎస్) అమలు చేయాలని ఐసీఈయూ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ డివిజన్ నాయకత్వం పిలుపు మేరకు బుధవారం గద్వాల ఎల్ఐసీ బ్రాంచ్ ఆవరణలో లంచ్ అవర్ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పెన్షన్ సమస్యను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు పెన్షన్ భద్రత కల్పించాలి ఈ కార్యక్రమంలో ఐసీఈయూ గద్వాల బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ.. 1996 రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు. కొత్త పెన్షన్ విధానం పరిధిలోకి ఈ ఉద్యోగులను తీసుకు రావడంపై తలెత్తిన వివాదానికి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితానికి భరోసా కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వినతిపత్రం 1996 బ్యాచ్ ఉద్యోగుల పెన్షన్ సమస్యను పరిష్కరిం చాలనే డిమాండ్‌తో హైదరాబాద్ డివిజన్ నాయకత్వం ఆధ్వర్యంలో మధ్యాహ్నం 1.30 గంటలకు సీనియర్ డివిజనల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో 1996 రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉద్యోగుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఐక్యంగా ఉద్యమం హైదరాబాద్ డివిజన్ నాయకత్వం పిలుపు మేరకు వివిధ ఎల్ఐసీ బ్రాంచ్‌లలో నిర్వహించిన లంచ్ అవర్ నిరసన కార్యక్రమాల్లో భాగంగా గద్వాల బ్రాంచ్‌లోనూ ఐసీఈయూ కామ్రేడ్స్ పాల్గొన్నారు. 1996 బ్యాచ్ ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం అమలు చేయాలనే డిమాండ్‌కు మద్దతుగా గేట్ మీటింగ్ నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు బంగి రంగారావు తెలిపారు.



# హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా హైదరాబాద్ లో హియ్యా స్పెస్ మండి రెస్టారెంట్ గ్రాండ్ లాంచ్




హైదరాబాద్

నగర వాసులకు రుచితో పాటు సరికొత్త వాతావరణంలో హియ్యా స్పెస్ మండి రెస్టారెంట్ గ్రాండ్ లాంచ్ గ్రాండ్ ఓపెనింగ్ జరిగింది. టాలీవుడ్ బ్యూటీ శ్రీలీల చేతుల మీదుగా హియ్యా వారి ఐదవ బ్రాంచ్ గా హియ్యా స్పెస్ మండి రెస్టారెంట్ హైదరాబాద్ లోని అమీర్ పేట్ లో ఘనంగా ప్రారంభం అయింది. పిల్లలు, పెద్దలతో పాటు అందరిని ఆకర్షించే అద్భుతమైన వాతావరణంతో ఈ రెస్టారెంట్ అందరిని ఆకర్షిస్తుంది. నింగిని తలపించే రెస్టారెంట్ చూడగానే ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ.. హియ్యా స్పెస్ మండి రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈవెంట్ కు ఆహ్వానించిన గౌతమి చౌదరి, గౌతమ్, విక్రంత్ లకు ధన్యవాదములు తెలిపారు. హైదరాబాద్ అంటేనే అనేక రకాల రుచులకు అడ్రస్ అని చెప్పారు. అలాంటిది హియాస్పేస్ మండితో మరొక కొత్త రుచి హైదరాబాద్ ఫుడ్ లిస్టులో ఆడ్ అయింది అన్నారు. గౌతమి చౌదరి తో మాట్లాడినప్పుడు ఫ్రెండ్స్ గా మొదలైన వీరి జర్నీ ఎలా విజయవంతంగా ముందుకు దూసుకెళ్తుందో తెలిసింది అన్నారు. ఇలా బ్రాంచెస్ పెంచుకుంటూ పోతూ ఆహార ప్రియులకు మంచి రుచులను అందించాలని కోరారు. రెస్టారెంట్ వాతావరణం చాలా ఆకట్టుకుందని, ఫ్యామిలీతో ఇక్కడికి వస్తే ప్రపంచాన్ని మర్చిపోవచ్చు అనే అంతలా చాలా ఆహ్లాదకరంగా ఉంది అని పేర్కొన్నారు. హియ్యా స్పేస్ మండిలో ప్రత్యేకత వెజ్ మండి అని చెప్పారు. అలాగే ఇక్కడ తయారుచేసే వెజ్ మండిని చాలా జాగ్రత్తగా, శుభ్రంగా చేస్తామని తెలిపారు. నాన్ వెజ్ కి సంబంధించి ఏ ఒక్క ఐటెం కూడా ఇందులో కలపకుండా జాగ్రత్త పాటిస్తున్నట్టు వెల్లడించారు. ఇక క్రాబ్ బండి కూడా చాలా బాగుందని, ఆహార ప్రియులకు మరింత నచ్చుతుందని వివరించారు. ఈనెల 22న మరొక కొత్త బ్రాంచ్ ఓపెన్ అవుతుందని అన్ని బ్రాంచ్ లను ఆదరించినట్టుగానే ఆ బ్రాంచ్ కూడా ప్రజల ఆదరణ దక్కుతుందని తెలిపారు. గౌతమ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ అంటేనే క్రియేటివిటీ అని అందుకే సరి కొత్త థీమ్స్ తో హైదరాబాదులో హియ్యా మండి బ్రాంచ్ లను ప్రారంభం చేస్తున్నట్టు తెలిపారు. ఈరోజు శ్రీలీల చేతుల మీదుగా ఈ మండి ప్రారంభం కావడం మా అదృష్టమని, కచ్చితంగా మా ఫుడ్ మీకు మరింత నచ్చుతుందని తెలిపారు. హియ్యా స్పేస్ మండి ప్రారంభోత్సవానికి వచ్చిన మీడియా మిత్రులకు, సహకరించిన పోలీస్ డిపార్ట్మెంట్ కు ధన్యవాదాలు తెలిపారు. భోజన ప్రియులు కచ్చితంగా అమీర్పేటలో ఉన్న హియ్యా స్పేస్ మండిని ఒక్కసారి సందర్శించి రుచి చూడాలని కోరారు. విక్రాంత్ మాట్లాడుతూ.. మండి అంటే కేవలం చికెన్, మటన్ మాత్రమే కాదు ఫిష్, క్రాబ్ ఇష్టపడే వారికి మా మండిని మరింత ప్రత్యేకత అని పేర్కొన్నారు. అలాగే శాకాహారుల కోసం గుత్తొంకాయ మండిని స్టార్ట్ చేసినట్టు వెల్లడించారు. చిన్న పెద్ద అందరికీ నచ్చేలా మంచి వాతావరణంలో హియ్యా స్పేస్ మండిని లాంచ్ చేయడం.. అది హీరోయిన్ శ్రీ లీల చేతుల మీదుగా లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# జుంటుపల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణాలకు నిధులు



- రూ. 5. కోట్ల71 లక్షలు
- ప్రాజెక్టు ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం
- కాంగ్రెస్ హయాంలోనే ప్రాజెక్టుల అభివృద్ధి
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

యాలాల
అక్టోబర్ 14 వుదయం ప్రతినిధి

: సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జుంటుపల్లి ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో జిల్లాలో ఉన్న అన్ని ప్రాజెక్టులు నిర్మాణం చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. ఆనాటి నుండి ప్రాజెక్టుల మరమ్మత్తులకు గత ప్రభుత్వాలు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని వివరించారు. ప్రాజెక్టులు అభివృద్ధి చెందాయంటే కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలోనే అభివృద్ధి జరిగిందని తెలిపారు. తాండూరు నియోజకవర్గంలో కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. జుంటుపల్లి ప్రాజెక్టు మరమతులకు ప్రస్తుతము ఐదు కోట్ల 71 లక్ష నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నిధులతో కుడి, ఎడమ కాలువల పూర్తి నిర్మాణాలు జరుగుతాయని వివరించారు. రైతులందరూ సహకరించి నిర్మాణాలు పూర్తిచే విధంగా చూడాలన్నారు. తూముల మరమ్మతులకు మరిన్ని నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారసింగ్, జిల్లా ఉపాధ్యక్షులు నర్సిరెడ్డి, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, తాండూర్ డివిజన్ సర్ కన్వీనర్ కర్ణం పురుషోత్తం రావు, యాలాల సహకార సంఘం చైర్మన్ అనిల్ కుమార్ గుప్తా, మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధ్యక్షులు శ్రీధర్ ముదిరాజ్, యాలాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్, మాజీ అధ్యక్షులు భీమయ్య, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరేశం, జుంటుపల్లి సర్పంచ్ శ్రీ వాణి రమేష్ గౌడ్, పగిడిపల్లి సర్పంచ్ శ్రీనివాస్, పెర్కంపల్లి తండా సర్పంచ్ గోవిందు నాయక్, ఇరిగేషన్ ఈ ఈ అశోక్ కుమార్, యాలాల ఎంపిడిఓ శ్రీనిజ తదితరులు పాల్గొన్నారు

# నారాయణఖేడ్ నియోజకవర్గంలో



- తహసీల్దార్- కార్యాలయంలో
- బతుకమ్మ సంబరాలు ఘనంగా
- నిర్వహించబడ్డాయి.

వుదయం మనూర్
అక్టోబర్: 14

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ మనూరు మండల్ లోమనూరు తహసీల్దార్ లో కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. మాన్సూర్ డిప్యూటీ కలెక్టర్ మరియు మండల ప్రత్యేక అధికారి ప్రతిభా శేఖర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని, వివిధ రంగుల పూలతో బతుకమ్మలను అందంగా అమర్చి, సాంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడాసారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన ఈ పూల పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతను చాటుతుంది

# శ్రీ గురుపీఠం చైర్మన్‌కు ఆహ్వానం



వుదయం న్యూస్
శివ్వంపేట అక్టోబర్ 13....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామ వాస్తవ్యులు ప్రముఖ సంఘ సేవకులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ వ్యవస్థాపకులు హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీ శ్రీ విశ్వ యోగి విశ్వం జి మహారాజ్ గారి ప్రియ శిష్యులు యగు పెద్దగౌని జిన్నారం శివకుమార్ గౌడ్ కు సీతారాం బాగ్ రామాలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా చండీయాగం నిర్వహించబడుతుంది. ఈ పూజా కార్యక్రమానికి రావలసిందిగా సిద్దేశ్వరనంద గిరి స్వామీజీ శివకుమార్ గౌడ్ స్వగృహము యగు విశ్వ శ్రీ నిలయమునకు విచ్చేసి శేష వస్త్రంతో ఆశీర్వదించి సాదర ఆహ్వానం అందజేశారు. అనంతరం శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ చండీయాగం హిందూ సంప్రదాయాల్లో అత్యంత శక్తివంతమైన మరియు పవిత్రమైన వేద యాగాలలో ఒకటి. ఇది దుర్గాదేవి యొక్క ఉగ్రమైన రక్షణ రూపమైన చండికాదేవికి అంకితం చేయబడినది. మార్కండేయ పురాణంలోని దేవి మహాత్యం దుర్గా సప్తశతి లోని 700 శ్లోకాలను మరియు నవక్షరి మంత్రాన్ని పటిస్తూ ఈ హోమం నిర్వహిస్తారు.

ఈ యాగం చేయడం వల్ల మహాకాళి మహాలక్ష్మి మహా సరస్వతి అనే ముగ్గురు అమ్మవార్ల అనుగ్రహం లభిస్తుంది. శత్రువులపై విజయం సాధించడానికి భయాలు తొలగిపోవడానికి మరియు ఆపదల నుంచి రక్షణ పొందడానికి పూర్వం రాజులు ఈ యాగం చేసేవారు. జీవితంలో ఎదురయ్యే మానసిక శరీరక కుటుంబంలో సుఖశాంతులు మంచి ఆరోగ్యం ఐశ్వర్యం మరియు మనోధైర్యం లభిస్తాయి. గ్రహాల అనుకూలత లేనివారికి మరియు జాతకపరమైన దోషాలకు ఇది మంచి పరిష్కారంగా భావిస్తారు అని ఆయన వివరిస్తూ స్వామివారి ఆశీర్వాదంతో తప్పకుండా యాగంకు వచ్చి ఆశీస్సులు తీసుకుంటామని చెప్పారు.

# మాజీ మంత్రి ఫరీరోద్దీన్ జయంతి.. రోగులకు పండ్ల పంపిణీ

- కోహీర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ నాయకుల సేవా కార్యక్రమం పేదలు, రోగులకు అండగా నిలవడమే నిజమైన సేవ: నాయకులు



కోహీర్,
అక్టోబరు 14 (వుదయం ప్రతినిధి):

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఫరీదుద్దీన్ జయంతిని పురస్కరించుకుని కోహీర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ నాయకులు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు అందజేసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మహమ్మద్ ఫరీరోద్దీన్ జయంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమం చేపట్టడం సంతోషకరమని నాయకులు పేర్కొన్నారు. సమాజంలో పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సహాయం చేయడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని తెలిపారు.సేవా కార్యక్రమాలతో జయంతి వేడుకలుప్రజాసేవే లక్ష్యంగా అవసరమైన వారికి అండగా నిలవాలని నాయకులు పిలుపునిచ్చారు. రాజకీయ నాయకుల జయంతులు, పేదలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. రోగులకు పండ్లు పంపిణీ చేయడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు టీ. సువర్ణ మల్లన్న పటేల్, మున్సిపల్ చైర్మన్ అశోక్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.ఎ. హన్నాన్ జావేద్, కోహీర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్, అహ్మద్ బలాలా, కౌన్సిలర్లు శ్రీకాంత్, అనసూయ, జగదీశ్, మాజీ వైస్ ఎంపీపీ షకీర్ అలీ, అజ్జు పటేల్, దిగ్వాల్ సర్పంచ్ అహ్మద్ అలీ, కవేలి మాజీ సర్పంచ్ జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు.

అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిలు, కవేలి కృష్ణ, అరుణ్, ఇషు పటేల్, పరమేశ్వర్, యూసుఫ్ పటేల్, అబ్దుల్ మతీన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఒగ్గు కళాకారులు సంఘటితం కావాలి

సంగారెడ్డి



జిల్లాలోని బీర్ల కళాకారులు, ఒగ్గు కళాకారులు సంఘటితం కావాలని కురుమజాతి సాంప్రదాయం సంస్కృతిని కాపాడుతూ తరతరాల చరిత్రను ఈ తరానికి అందిస్తూ కలను కాపాడుతున్న బీర్ల కళాకారులు ఒగ్గు కళాకారులు సంఘటితం కావలసిన అవసరం ఎంతైనా ఉందని సంగారెడ్డి జిల్లా కురుమ యువత నాయకులు బండారి పాండు కురుమ అన్నారు. ప్రముఖ ఒగ్గు కళాకారుడు సోలక్పల్లి రాములు కురుమ అన్నగారి నాయకత్వంలో ఒగ్గు కళాకారులు బీర్ల కళాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లాలోని అన్ని మండలాలలో కురుమ యువత నాయకులు కురుమ పెద్దలు సహకరించాలని కురుమ సంఘాలను కోరారు. ఒగ్గు కళాకారులు కలనే నమ్ముకొని జీవనాధారం కొనసాగిస్తున్నారని వారు అన్నారు. రాత్రి వేళలో ప్రోగ్రాములు చేసుకొని వస్తున్న ఒగ్గు కళాకారులకు తగిన గుర్తింపు కార్డు లేక పోలీసుల నుండి ఇబ్బందులు పడుతున్నారని ప్రతి ఒక్క ఒగ్గు కళాకారుడు గుర్తింపు కార్డు పొందాలని తెలిపారు. 50 సంవత్సరాలు నిండిన ఒగ్గు కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రిథిన్స్ అకాడమీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- ముఖ్య అతిథిగా నారీ శక్తి ఆర్గనైజర్ ఫౌండర్ జ్యోతి పండల్

అక్టోబరు 14 (వుదయం ప్రతినిధి):




జహీరాబాద్ పట్టణంలోని రిథిన్స్ అకాడమీ కోచింగ్ సెంటర్, స్టడీ హాల్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్, మోటివేషనల్ స్పీకర్ ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు విద్యార్థుల ఉత్సాహం, సందడితో పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమానికి నారీ శక్తి ఆర్గనైజర్ ఫౌండర్ జ్యోతి పండల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అకాడమీ ప్రాంగణంలో విద్యార్థులు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథి జ్యోతి పండల్‌తో కలిసి విద్యార్థులు బతుకమ్మ ఆడుతూ ఆనందోత్సాహాలతో వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులంతా కలిసికట్టుగా పాల్గొనడంతో అకాడమీ ప్రాంగణంలో పండుగ సందడి నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు మ్మ పండుగను విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు. సంప్రదాయ పండుగల ప్రాముఖ్యతను యువతకు తెలియజేయడంతో పాటు, తెలంగాణ సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించడమే ఇలాంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేసి, వాటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. ముఖ్య అతిథికి ఘన సన్మానంకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్యోతి పండల్‌ను అకాడమీ డైరెక్టర్ ప్రకాష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాసాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యత, సంప్రదాయాల పట్ల గౌరవం, సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.అనంతరం విద్యార్థులు, అకాడమీ నిర్వాహకులు కలిసి బతుకమ్మను తీసుకుని సమీపంలోని చెరువు వద్దకు చేరుకున్నారు. అక్కడ సంప్రదాయబద్ధంగా బతుకమ్మ నిమజ్జనం చేసి వేడుకలను ముగించారు. విద్యార్థులు, అకాడమీ నిర్వాహకులు ఉత్సాహంగా పాల్గొనడంతో రిథిన్స్ అకాడమీలో బతుకమ్మ సంబరాలు ఘనంగా విజయవంతమయ్యాయి.

# చైతన్యపురిలో పీఎంజే జ్యువెలర్స్ ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్




అద్భుతమైన హస్తకళా నైపుణ్యానికి, కాలాతీత అందాలకు ప్రసిద్ధి చెందిన దక్షిణ భారతదేశ ప్రజలకు అత్యంత ఇష్టమైన ఫైన్ జ్యువెలరీ బ్రాండ్ అయిన పీఎంజే జ్యువెలర్స్, హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురిలో కొత్త స్టోర్‌ను ఘనంగా ప్రారంభించినట్లు ఇవాళ ప్రకటించింది. పీఎంజే జ్యువెలర్స్ తెలంగాణ క్లస్టర్ హెడ్ దీపక్, చైతన్యపురి స్టోర్ మేనేజర్ మధన్ కుమార్ మరియు పీఎంజే జ్యువెలర్స్ కస్టమర్ల సమక్షంలో ఈ స్టోర్ ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవంతో పీఎంజే జ్యువెలర్స్ తన రిటైల్ ఉనికిని మరింత బలోపేతం చేసుకుంది. దీనితో భారతదేశంలోని నాలుగు రాష్ట్రాల్లో ఈ బ్రాండ్ స్టోర్ల సంఖ్య 47కి చేరింది.కొత్తగా డిజైన్ చేసిన ఈ స్టోర్, సాంప్రదాయ నైపుణ్యాన్ని ఆధునిక సౌందర్యంతో మిళితం చేసి, కస్టమర్లకు ఒక అద్భుతమైన ఆభరణాల కొనుగోలు అనుభవాన్ని అందిస్తోంది. ఇక్కడ హ్యాండ్‌క్రాఫ్టెడ్ జ్యువెలరీ భారీ కలెక్షన్ అందుబాటులో ఉంది. ఇందులో టెంపుల్ జ్యువెలరీ, యాంటిక్ గోల్డ్ నెక్లెస్‌లు, వడ్డాణాలు, బ్రైడల్ జ్యువెలరీ సెట్లు, హాఫ్‌చీర మరియు అకేషన్‌వేర్ ఆభరణాలు, డైమండ్ జ్యువెలరీతో పాటు రంగురంగుల రత్నాలతో తయారు చేసిన అలంకరణలు ఉన్నాయి. అంతేకాకుండా, కుందన్, పోల్కి, జడవు స్టైల్స్‌తో పాటు రోజువారీ ధరించే తేలికపాటి నెక్లెస్‌లు, ఇయర్‌రింగ్స్ మరియు రింగుల విస్తృత శ్రేణిని కూడా కస్టమర్‌లు పరిశీలించవచ్చు.ఈ కొత్త స్టోర్ ప్రారంభం గురించి పీఎంజే జ్యువెలర్స్ సీఈఓ కిరణ్ షిండే మాట్లాడుతూ, నాణ్యత, పారదర్శకత మరియు తరతరాలుగా కస్టమర్‌లు మా బ్రాండ్‌పై ఉంచిన నమ్మకానికి అద్దం పడుతోంది" అని తెలిపారు.ఈ సందర్భంగా పీఎంజే జ్యువెలర్స్ తెలంగాణ క్లస్టర్ హెడ్ శ్రీ దీపక్ మాట్లాడుతూ, "మా చైతన్యపురి స్టోర్ గ్రాండ్ లాంచ్‌ను ప్రకటించడం మాకు చాలా సంతోషంగా ఉంది. ప్రతి క్షణం అందాన్ని ప్రతిబింబించే కాలాతీత ఆభరణాలను రూపొందించడానికే పీఎంజే జ్యువెలర్స్ ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంది. మా కొత్త స్టోర్ ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. అసాధారణమైన హస్తకళా నైపుణ్యం, సమకాలీన డిజైన్‌లు మరియు తరతరాలుగా మా బ్రాండ్‌పై కస్టమర్లు ఉంచిన నమ్మకాన్ని ఇది ఒకచోట చేర్చుతుంది" అని తెలిపారు.చైతన్యపురి స్టోర్ మేనేజర్ శ్రీ మధన్ కుమార్ మాట్లాడుతూ, "మా తాజా క్రియేషన్స్‌ను కొత్త స్టోర్‌లో ఆవిష్కరిస్తున్న తరుణంలో, పీఎంజే జ్యువెలర్స్ ప్రత్యేకతను చాటే అద్భుతమైన డిజైన్‌లను పరిశీలించాల్సిందిగా మా కస్టమర్లను ఆహ్వానిస్తున్నాము. ప్రతి ఆభరణం వెనుక ఒక ప్రత్యేకమైన కథ ఉంటుంది. వివాహాలు,

నాణ్యత మరియు కస్టమర్ల నమ్మకానికి కట్టుబడి ఉన్న పీఎంజే జ్యువెలర్స్, తమ స్టోర్లలో డైమండ్ టెస్టింగ్ మెషీన్లను (DTMs) ఏర్పాటు చేయడం ద్వారా పారదర్శకతను మరింత పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల కస్టమర్లు డైమండ్ ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు సరైన అవగాహనతో స్పష్టమైన నిర్ణయం తీసుకోవచ్చు.ప్రతి ఆభరణం అనుభవజ్ఞులైన కారిగర్ల (చేతివృత్తి నిపుణుల) నైపుణ్యాన్ని, అంకిత భావాన్ని ప్రతిబింబిస్తుంది. ఇందులో సున్నితమైన హస్తకళా నైపుణ్యం, విశిష్టమైన డిజైన్ శైలి కలిసి ఉంటాయి. నాణ్యత, విలువ, హస్తకళా నైపుణ్యానికి సంబంధించి పీఎంజే భరోసా ప్రతి క్రియేషన్‌లోనూ కనిపిస్తుంది. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే మారుతున్న కస్టమర్ల అభిరుచులకు తగినట్లుగా ఆభరణాలను రూపొందించాలన్న బ్రాండ్ నిబద్ధతను ఇది మరింత బలపరుస్తోంది.చైతన్యపురిలో ప్రారంభమైన ఈ కొత్త స్టోర్ పీఎంజే జ్యువెలర్స్ ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది. దీనిద్వారా ఈ బ్రాండ్‌కు చెందిన ప్రసిద్ధ కలెక్షన్లు, పర్సనలైజ్డ్ షాపింగ్ అనుభూతి దిల్‌సుఖ్‌నగర్ మరియు చుట్టుపక్కల ప్రాంతాల కస్టమర్లకు మరింత చేరువయ్యాయి.



# గ్రేటర్ హైదరాబాద్



## శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో కనకాల కట్ట మైసమ్మ అమ్మవారు

- వైభవంగా రుద్ర సహిత చండీ హోమం భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు

**ముషీరాబాద్, అక్టోబర్ 14(వుదయం)**



శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శ్రీ కనకాల కట్ట మైసమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక రుద్ర సహిత చండీ హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాల కోసం ప్రార్థనలు చేశారు.వేద మంత్రోచ్చారణలు, హోమ పూజలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ ప్రత్యేక హోమం భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తింది. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీ గౌతమ్ కుమార్, ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీ పి.మహేందర్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలతో భక్తుల లో ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొంది. శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన కనకాల కట్ట మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

## తాళం వేసిన ఇళ్లే దొంగల టార్గెట్.. జాగ్రత్త!

- నగదు, బంగారం ఇంట్లో ఉంచి వెళ్లొద్దు
- అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి
- ఘట్‌కేసర్ సీఐ ఎం.బాలస్వామి సూచనలు

**వుదయం ప్రతినిధి ఘట్‌కేసర్ అక్టోబర్ 14**



దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్తున్నారా..? అయితే మీ ఇంటి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టండి. పండుగ ఆనందంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా దొంగలకు అవకాశం ఇచ్చినట్లేనని ఘట్‌కేసర్ సీఐ ఎం.బాలస్వామి ప్రజలను అప్రమత్తం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు సెలవులకు ఊళ్లకు వెళ్లే కుటుంబాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**తాళం వేసి వెళ్లే జాగ్రత్తలు తప్పనిసరి!**

పండుగ సెలవుల్లో తాళాలు వేసిన ఇళ్లను దొంగలు లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉందని, ఇంట్లో నగదు, వస్తువులు ఉంచకుండా భద్రపరచుకోవాలని సూచించారు. ఇంటి తలుపులు, కిటికీలు సరిచూసుకోవడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఊరికి వెళ్లే విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో వెల్లడించవద్దని సూచించారు.

**అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచాలి**

కాలనీల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇంటి భద్రత విషయంలో పొరుగువారి సహకారం తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

**చిన్న నిర్లక్ష్యం... భారీ నష్టం!**

పండుగ సంతోషం విషాదంగా మారకుండా ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండాలని సీఐ బాలస్వామి సూచించారు. ప్రజలు భద్రతకు పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కావాలని కోరారు. ముందస్తు జాగ్రత్తలతో దొంగతనాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు...

## పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుక

**జిన్నారం అక్టోబర్ 14(వుదయం ప్రతినిధి)**



గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులు నిర్వహిస్తూ పట్టణ పరిశుభ్రతకు నిరంతరం కృషి చేస్తున్న మున్సిపల్ కార్మికులకు ఒకటో వార్డు కౌన్సిలర్ బాలు గారి మాధవి శ్రీనివాస్ బుధవారం తన నివాసంలో కొత్త బట్టలు పంపిణీ చేశారు. దసరా పండుగను పురస్కరించుకుని కార్మికుల సేవలను గుర్తించి వారికి దుస్తులు అందజేసినట్లు తెలిపారు. ప్రజారోగ్య ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. పండుగ వేళ కార్మికులతో సంతోషాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొందుర్గులో ఎస్ఆర్ కన్వెన్షన్ ప్రారంభం



- రఘునాథ్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపి, వ్యాపారాభివృద్ధిని ఆకాంక్షించిన అంజయ్య యాదవ్

**కొందుర్గు:** షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్వెన్షన్ హాల్ అధినేత రఘునాథ్ గౌడ్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ప్రారంభించిన కన్వెన్షన్ హాల్ వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని, నిర్వాహకులకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్‌ను నిర్వాహకులు, స్థానిక నాయకులు ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమం స్థానికంగా సందడి వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, హఫీజ్, లక్ష్మణ్ నాయక్, మాజీ మార్కెట్ డైరెక్టర్ రాజా రామేశ్వర్ రెడ్డి, రెడ్డి, నర్సింలు, సున్నాల శ్రీనివాస్, దర్గా రామచంద్రయ్య, కృష్ణయ్య, మచ్చేందర్ గౌడ్, జాంగిర్, సాయి, చినరాజ్ గౌడ్, సచిన్, విజయ్, సత్యం, ముత్యాలు, కావాలి సత్యం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ లో ఘనంగా దేవి శర్నవరాత్రి వేడుకలు

**నిజాంపేట్, అక్టోబర్ 14,(వుదయం ప్రతినిధి ),**

ఆలయ ధర్మకర్త కోలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అమ్మ వారికీ ప్రత్యేక పూజలు, భక్తి శ్రద్ధలతో మహా చండీయాగం నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి, భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన, మహా చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కోలన్ శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణం, ప్రజల సుఖ సంతోషాలు,ఆయురారోగ్యాలు కోరుతూ అమ్మవారిని ప్రార్థించారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. వేద మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన మహా చండీయాగం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. అమ్మవారి అనుగ్రహం అందరిపై ఉండాలని కోరుకున్నారు.

## పగలూ వెలుగుతున్న వీధి దీపాలు!

**పటాన్‌చెరు (వుదయం):**



పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం రాయల్ కాలనీలో వీధి దీపాల నిర్వహణపై నిర్లక్ష్యం కనిపిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ప్రజలకు వెలుతురు అందించాల్సిన వీధి దీపాలు మధ్యాహ్నం వరకు కూడా వెలుగుతుండటంతో విలువైన విద్యుత్ వృథా అవుతోందని వారు పేర్కొంటున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.రాయల్ కాలనీలో వీధి దీపాలు రాత్రి వేళల్లో మాత్రమే కాకుండా, పగటిపూట కూడా వెలుగుతుండటం స్థానికుల దృష్టికి వచ్చింది. సాధారణంగా ఉదయం వెలుతురు వచ్చిన తర్వాత వీధి దీపాలను ఆపివేయాలి. అయితే మధ్యాహ్నం వరకు కూడా అవి ఆన్‌లోనే ఉండటంతో విద్యుత్ వినియోగం అనవసరంగా కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఒక్కరోజుకే పరిమితమైందా, లేక తరచూ జరుగుతోందా అనే విషయాన్ని అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. వీధి దీపాల నిర్వహణకు వినియోగించే విద్యుత్ ప్రజా అవసరాల కోసం ఖర్చు చేస్తున్న ప్రజాధనంతో ముడిపడి ఉంటుంది. అవసరం లేని సమయంలో దీపాలు వెలుగుతుంటే, వినియోగించిన ప్రతి యూనిట్ విద్యుత్‌కు అయ్యే ఖర్చు చివరకు ప్రజా వనరులపైనే భారంగా మారుతుంది. ఒక్కో దీపం వల్ల జరిగే వృథా చిన్నదిగా కనిపించినప్పటికీ, ఒక కాలనీలోని అనేక దీపాలు గంటల తరబడి వెలిగితే మొత్తం విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది.అలాగే విద్యుత్ ఉత్పత్తి, సరఫరా కోసం అవసరమయ్యే వనరులను సమర్థవంతంగా వినియోగించడం కూడా కీలకం. విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రజలకు అవగాహన కల్పించే సమయంలో, ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన వీధి దీపాలే పగటి పూట వెలుగుతుండటం సరైన నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

వీధి దీపాలు పగటిపూట కూడా వెలగడానికి టైమర్ వ్యవస్థలో లోపం, ఆటోమేటిక్ స్విచ్ పనిచేయకపోవడం లేదా సంబంధిత సిబ్బంది పర్యవేక్షణలో లోపం వంటి కారణాలు ఉండవచ్చు. అయితే అసలు కారణం ఏమిటన్నది అధికారులు పరిశీలించిన తర్వాతే స్పష్టమవుతుంది. అందువల్ల సమస్యను కేవలం విద్యుత్ వృథాగా మాత్రమే కాకుండా, వీధి దీపాల నిర్వహణ వ్యవస్థను సమీక్షించాల్సిన అంశంగా కూడా చూడాల్సిన అవసరం ఉంది.

కాలనీలోని వీధి దీపాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం, ఉదయం నిర్ణీత సమయంలో వాటిని ఆపివేయడం, అవసరమైతే ఆటోమేటిక్ టైమర్లు లేదా ఫోటోసెల్ వ్యవస్థలను పరిశీలించడం ద్వారా ఇలాంటి సమస్యలను నివారించవచ్చు. నిర్వహణలో చిన్నపాటి లోపాన్ని సకాలంలో గుర్తించి సరిచేస్తే, నిరంతర విద్యుత్ వృథాను అరికట్టే అవకాశం ఉంటుంది.రాయల్ కాలనీలో నెలకొన్న ఈ పరిస్థితిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. వీధి దీపాలు మధ్యాహ్నం వరకు ఎందుకు వెలుగుతున్నాయో గుర్తించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీలోని అన్ని వీధి దీపాలను పరిశీలించి, పనిచేయని నియంత్రణ వ్యవస్థలను మరమ్మతు చేయడంతో పాటు, వాటి నిర్వహణకు బాధ్యత వహించే సిబ్బంది పర్యవేక్షణను మెరుగుపరచాలని సూచిస్తున్నారు.ప్రజా వనరులను ఆదా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతే అయినప్పటికీ, వాటి నిర్వహణను సమర్థవంతంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై కూడా ఉంది. పగటిపూట వీధి దీపాలు వెలగడం చిన్న సమస్యగా కనిపించినా, ఇలాంటి వృథా నిరంతరం కొనసాగితే ప్రజాధనంపై అనవసర భారం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించి, రాయల్ కాలనీలో విద్యుత్ వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## భార్యపై సుత్తితో దాడి: భర్త అరెస్ట్

**మేడిపల్లి వుదయం ప్రతినిధి అక్టోబర్ 14.**



మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్వతాపూర్, గాంధీనగర్ కాలనీలో భార్యపై సుత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన నిందితుడు ఘౌస్ పాషా ఖురేషీ(42) ని మేడిపల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, ఘౌస్ పాషా ఖురేషీకి 2021లో జైబున్ బేగం (28)తో రెండవ వివాహం జరిగింది. వారు కుటుంబ సమేతంగా పర్వతాపూర్‌లో నివాసం ఉంటున్నారు. నిందితుడు మద్యం సేవించి తరచూ భార్యతో గొడవపడుతూ... మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. ఈ క్రమంలో, ఈనెల 10వ తేదీన రాత్రి నిందితుడు మద్యం సేవించి భార్యతో గొడవపడగా, వారి కుమారులు జోక్యం చేసుకుని గొడవను సద్దుమణిగించారు. అనంతరం మరునాడు తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో భార్య వేరే గదిలో నిద్రిస్తున్న సమయంలో నిందితుడు సుత్తితో ఆమె తలపై పలుమార్లు కొట్టాడు. ఈ దాడిలో ఆమె తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే ఆమె కుమారులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై బాధితురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో వేధింపులు మరియు హత్యాయత్నానికి సంబంధించిన కేసు నమోదు చేశారు, దర్యాప్తులో భాగంగా ఈరోజు నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించినట్లు ఆరోపణ ఉన్న సుత్తిని పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని సి ఐ జలేందర్ రెడ్డి తెలిపారు.

## పండుగ వేళ... భద్రతే ముఖ్యం!

**- బొల్లారం సీఐ సుధీర్ కుమార్**

**జిన్నారం అక్టోబర్ 14(వుదయం ప్రతినిధి)**




దసరా పండుగ వేళ భద్రత విషయంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐడీఏ బొల్లారం పోలీసులు సూచించారు. పండుగల సమయంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు దొంగతనాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ వి. సుధీర్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంట్లో బంగారం, నగదు వంటి విలువైన వస్తువులను ఉంచకుండా సురక్షితంగా భద్రపరచుకోవాలని సూచించారు. ఇంటి తలుపులు, కిటికీలను సరిచూసుకుని దృఢమైన తాళాలు వేయాలని పేర్కొన్నారు. నమ్మకమైన పొరుగువారికి లేదా సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చి, ఇంటి పరిసరాలను గమనిస్తూ ఉండాలని కోరారు. ఇళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవడంతో పాటు, రాత్రివేళ ఇంటి బయట తగినంత వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాము ఊరికి వెళ్తున్నట్లు, ప్రయాణ వివరాలను సోషల్ మీడియాలో బహిరంగంగా పోస్టు చేయవద్దని హెచ్చరించారు. ఇంటి తాళాలను బయట కనిపించే ప్రదేశాల్లో దాచిపెట్టడం వంటి నిర్లక్ష్యపు చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. కాలనీల్లో లేదా ఇళ్ల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్‌హెచ్ఓ కోరారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ తగిన జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ దసరా పండుగను సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు.

## గద్వాల టౌన్ ఎస్ఐగా ఎం. శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

**గద్వాల అక్టోబర్ 14 (వుదయం కరస్పాండెంట్ )**



గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా ఎం. శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు, పట్టణంలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.ప్రజల భాగస్వామ్యంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమని పేర్కొంటూ, పట్టణ ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ ఎం. శ్రీనివాస్ కోరారు.

## నవరాత్రుల నాలుగో రోజు.. శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో అన్నదాన సేవ

**ముషీరాబాద్, అక్టోబర్ 14(వుదయం)**



శ్రీ దేవీ నవరాత్రుల నాలుగో రోజు సందర్భంగా హైదరాబాద్ కోఠిలోని రాణి పార్క్ సమీపంలో ఉన్న శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ, బజరంగ్ సేన తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.భక్తి, సేవాభావం, సామాజిక శ్రేయస్సును ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, సంఘం సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొని అన్నదాన సేవలో భాగస్వాములయ్యారు. “అన్నదానం మహాదానం” అనే భారతీయ సంస్కృతి సంప్రదాయానికి అనుగుణంగా భక్తులకు ఆహారాన్ని అందించి సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు శ్రీ ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు, శ్రీకాంత్, సాయి, హరి, రవి, రామేశ్వరం మిశ్రా, సంతోష్ తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించారు.ఈ సందర్భంగా శ్రీ దుర్గామాత, శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతి, సమృద్ధి కలగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

**నారాయణపేట అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి)**



ఎలక్షన్ కమీషన్ కు,భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా నిరసన తెలిపిన ప్రభుత్వ ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏ బి వి పి నాయకులు డిమాండ్ చేశారు.బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నారాయణపేట నగర శాఖ ఆధ్వర్యంలో డి ఈ ఓ ఆఫీస్ ముందర ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి నారాయణపేట జిల్లా కన్వీనర్ మన్నె సతీష్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ శనివారం అంబేద్కర్ చౌరస్తాలో కొంతమంది ఉపాధ్యాయు లు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని 2024 , ఆ తర్వాత జరిగిన ఎలక్షన్లను రద్దు చేయాలని, ఈ వి ఎం లకు బదులుగా బ్యాలెట్ పేపర్ వాడాలని నిరసనలు చేశారన్నారు. ఈ వి ఎం లు సరిగ్గానే పనిచేస్తున్నాయని మాక్ పోలింగ్ నిర్వహించి సర్టిఫై చేసిన ఉపాధ్యాయులే నిరసనలు తెలపడం పూర్తిగా రాజ్యాంగానికి, చట్టానికి విరుద్ధమైనటువంటి చర్య అని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులై ఉండి రాజ్యాంగం ద్వారా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎలక్షన్ కమిషన్ నే వ్యతిరేకించడం తీవ్రమైన నేరం న్ని విద్యా ర్థులలో దేశ వ్యతిరేక భావజాలాన్ని నూరిపోస్తున్నా రన్నారన్నారు.అంబేద్కర్ ని కించపరిచే విధంగా ఈ యొక్క ఉపాధ్యాయులు ఆ యొక్క అంబేద్కర్ ముంగి టనే నిరసన కార్యక్రమం చేయడం అన్నది చాలా బాధాకర విషయం అన్నా రు.తక్షణమే ఈ ఉపాధ్యా యులు ఎన్నికల సమ యంలో ఎక్కడైతే విధులు కొనసాగించారో అక్కడ వీళ్ళు చెప్పినట్టే బై ఎలక్షన్లు పెట్టేసి నూతన రాజకీయ నాయకులను ఎన్నుకునే విధంగాచర్యలు చేపట్టాలన్నారు.మక్తల్ మండలంలో ఉపాధ్యాయుడు విద్యార్థు లతో ప్లే కార్లు పట్టించి క్యాబినెట్ మినిస్టర్లను రాజీనామా చేయాలని విద్యార్థుల్లో దేశ వ్యతిరేక బావజలాన్ని పెంపొందిం చినప్పటికీ ఆ ఉపాధ్యా యునిపై ఎలాంటి చర్య లేకపోవడంతోనే నేడు ఇంత మంది ఉపాధ్యాయు లు కూడా ఇలాంటి నిరసన కార్యక్రమానికి పాల్పడడం అనేది జరిగిందన్నారు. ఈ దేశద్రోహానికి పాల్పడిన టువంటి ఉపాధ్యాయులు సూర్యచంద్ర,రెడ్డప్ప ,బాలాజీ, హైమావతి,వెంకటప్ప , భీమయ్య, అశోక్, వాలి యా నాయక్, వెంకట్ నాయక్ తదితర ఉపాధ్యా యులపై తక్షణమే చర్యలు తీసుకొని రాజ్యాంగ విలు వలను కాపాడాలని లేదం టే రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమం ఉధృ తంగా చేస్తామని హెచ్చ రించారు.ఈ యొక్క కార్య క్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివ, నగర కార్యదర్శి అరుణ్, నరేష్, ఇంతి యాజ్, తరుణ్ నామాజీ, రోహిత్, సందీప్, రవి, మురళి, అశోక్, భాను ప్రసాద్, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE XI Addl JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT ::AT: SECUNDERABAD**

**O.S. NO. 699 OF 2026**

**Between :**

Gundarapu Ravi Kiran Reddy & other ... **Plaintiffs**

**AND**

Tahsildar Officer, & All Concerned ... **Defendants**

To
TO,
All Concerned,
... **Defendant No.2**

Please take notice that the above O.S. No. 699 2026 filed against you and all concerned for Declaration of legal Heir status,and was pending before the Hon'ble XI Addl Junior Civil Judge CityCivil Court, At, Secunderabad. The above suit was posted to 03-11-2026 and you are hereby called upon to appear in the court on thatday at 10.30 A.M. either in person or through an advocate, if youfailed to attend the court on that day the suit will be disposes Exparty against you the all concerned.

(BY ORDER OF THE COURT)
M.Srinivas Reddy
Advocate
Plot No.37, Visvesvaraya Engineers Society Hastinapuram, Ranga Reddy District,Cell No; 9848159089
mandasrinivas78@gmail.com

**IN THE COURT OF THE XIX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT : AT HYDERABAD.**

**O.S. No. 3149 of 2026**

**Between :**

Iranganti Dharma Vamshi Krishna & another. **Plaintiffs**

**AND**

The Tahsildar, Musheerabad Mandal, Hyderabad and another. **Defendants**

To
1. The Tahsildar, Amberpet Mandal, Musheerabad, Hyderabad – 500 020.
2. The All Concerned. Please take notice that **(1) Iranganti Dharma Vamsi Krishna,** S/o Late Iranganti Srinivasa Chari and **(2) Iranganti Dharma Krishna Chandra,** S/o Late Iranganti Srinivasa Chari, both are residents of H. No. 2-2-1105/5/10/6, Flat No. 6, First Floor, Neeladri Apartments, Tilak Nagar, Opposite to Shivalayam Temple, New Nallakunta, Hyderabad – 500 044 have filed the above numbered suit seeking to declare them as surviving legal heirs of Late Sri Iranganti Srinivasa Chari, S/o Late Iranganti Dharma Charyulu and Late Smt. Iranganti Indira, W/o Late Iranganti Srinivasa Chari and the case is posted to **03-11-2026.** If anybody has got any objection, they may appear either in person or through advocate on or before **10-30 AM of 03-11-2026** along with relevant supporting documents and raise their objections if any before the Hon'ble Court, else the matter will be proceeded further and decided as per law.

**(BY ORDER OF THE COURT)**
**Sd/-**
**T.P. ACHARYA**
**advocate**
**Counsel for Plaintiffs, Flat No. 101, SIRI Constructions, H. No. 1-8-677/13, Padma Colony, Nallakunta, Hyderabad – 500 044 9948075567**
**tpacharyaadv@gmail.com**

**IN THE COURT OF THE HON'BLE PRL.DISTRICT AND SESSIONS JUDGE AT: L.B. Nagar**

**CRL.MP. No. 92 OF 2025**

**Between :**

JHOOLA RAJASHREE ...**Appellant/Petitioners**

**AND**

1. PS. Ibrahimpatnam
2. Respondents no. 2,3,5

....**Respondents R2, R3, R5**

1. (Respondentno.2) Pakanti Chandra Shekhar Reddy, S/o. Ram Reddy, Age:35 years, Occ: Bussiness, R/o. Plot no:40, shivasainagar colony, karmanghat, saroornagar mandal, Ranga reddy District.
2. (Respondentno.3) Pakanti Ram Reddy, s/o Narsi Reddy, aged about 66 years, Occ: Bussiness, R/o. Plot no: 40, shivasainagar colony, karmanghat, saroornagar mandal, Ranga reddy District.
3. (Respondentno.5) Pakanti Munvardhan Reddy, S/o. Ram Reddy, Aged 66 years, R/o. plot no:40, shivasainagar colony, karmanghat,saroornagar mandal,ranga reddy District.

Please take notice that the above named petitioners has filed the above crl.mp against you, therefore this Hon'ble court pleased to direct you to appear either in person or through Counsel before this Hon'ble PRL. District and Sessions Judge, At: L.B. Nagar on 23.10.2026 at: 10:30 AM without fail. If not the matter would be proceeded exparte.

**// By order of the court //**
**Sd/-**
**L N Badriraj advocate**
**bhoiguda secunderabad**

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM XI ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT KUKATPALLY**

**O. S. No. 434 OF 2026**

**Between :**

**NAGILLA THIRUPATHI REDDY,** S/o. Late NAGILLA SIDDA REDDY, aged about 55 years, Occ.: Pvt., Employee, R/o. H. No. 14-1-210/1, Parvath Nagar, Mothi Nagar, PJR Hills, Balanagar, Rangareddy District-500 018. After Bifercation H.No. 14-1-210/1, J.P Nagar, Parvath Nagar, Allapur, Kukatpally Mandal, Medchal-Malkajgiri District-500 018. **Plaintiff**

**AND**

**1. The Tahsildar, Kukatpally mandal, Medchal-Malkajgiri District.**
**2. All Concerned** **Defendants**

To,
All concerned
Whereas a suit for declaration for declaring **Plaintiff as second legal heir of Late NAGILLA RAJI REDDY, S/o. NAGILLA SIDDA REDDY** has instituted against all concerned the court hereby summoned **all concerned** to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the **27-10-2026. at 10:30 O' clock** in the forenoon to answer the claim, and further your all are directed to produce on that day all the documents upon which you intend to rely in support of your defence. Take notice that in default of your appearance and to file written statement the suit will be heard and determined in your absence.

**( By order of the Hon'ble court )**
**Sd/-**
**G.HARISH KUMAR,**
**B.BALA KRISHNA,**
**P.SUDHA JYOTHI,**
**ADVOCATES OFF: # 04-42-1069, Opp: HP Petrol Pump Station, Paparayudu Nagar, Kukatpally, Medchal-Malkajgiri District-500 072. Cell No. 9849961795.**

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM XI ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT KUKATPALLY**

**O. S. No. 435 OF 2026**

**Between :**

**1. JASTI SRINIVAS,** S/o. Late JASTI VENKATESWARA RAO, aged about 64 years, Occ.: Pvt., Employee, R/o. H. No. 15-21, 150/114, Flat No. 301, Sai Towers, Balaji Nagar, Kukatpally Post & Mandal, Medchal-Malkajgiri District-500 072.
**2. JASTI AMMAJI,** W/o. Late JASTI VENKATESWARA RAO, aged about 85 years, Occ.: House wife, R/o. H. No. 15-21, 150/114, Flat No. 301, Sai Towers, Balaji Nagar, Kukatpally Post & Mandal, Medchal-Malkajgiri District-500 072.
**3. KOLLI RAGHU KUMARI,** W/o. KOLLI RAMESH BABU, D/o. Late JASTI VENKATESWARA RAO, aged about 65 years, Occ.: House wife, R/o. Villa No. 16, Royal Village, Pragathi Nagar, Bachpalle, Medchal-Malkajgiri District-500 090.
**Plaintiffs No. 1to3**

**AND**

**1. The Tahsildar, Kukatpally mandal, Medchal-Malkajgiri District.**
**2. All Concerned** **Defendants.**

To,
All concerned
Whereas a suit for declaration for declaring **Plaintiffs No. 1 to 3 as legal heirs of Late JASTI VENKATESWARA RAO** has instituted against all concerned the court hereby summoned all concerned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the **27-10-2026. at 10:30 O' clock** in the forenoon to answer the claim, and further your all are directed to produce on that day all the documents upon which you intend to rely in support of your defence. Take notice that in default of your appearance and to file written statement the suit will be heard and determined in your absence.

**( By order of the Hon'ble court )**
**Sd/-**
**G.HARISH KUMAR,**
**B.BALA KRISHNA,**
**P.SUDHA JYOTHI,**
**ADVOCATES OFF: # 04-42-1069, Opp: HP Petrol Pump Station, Paparayudu Nagar, Kukatpally, Medchal-Malkajgiri District-500 072. Cell No. 9849961795.**



"జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సిజెపి నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంగాలను అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య. జాతీయ జెండాను ప్రదర్శిస్తూ శాంతియుతంగా నిరసన తెలపడం నేరం కాదు. అలా చేసిన యువకులపై కేసులు పెట్టి జైలుకు పంపడంఏమిటి? రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడం అందరి బాధ్యత. జంతర్ మంతర్‌ను తిరిగి నిరసన ప్రదేశంగా సాధించుకుంటాం."

*- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత*

## వే'మన' పద్యం

**కొంకణంబుపోవ గుక్క సింహముగాదు**
**కాశికరుగ బంది గజము కాదు**
**వేరు జాతి వాడు విప్రుండు కాలేడు**
**విశ్వదాభిరామ వినురవేమ**



# సంపాదకీయం

## నిర్బంధాలతో ఉద్యమాలను అణచలేరు!

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం, శాంతియుత ఆందోళనలను పోలీసు బలంతో అణచివేయడం నిరంకుశ పాలనకు నిదర్శనం. ప్రజల సమస్యలను వినాల్సిన ప్రభుత్వాలు, తమ విధానాలను ప్రశ్నించే గొంతులను మూయించేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. దేశ రాజధాని ఢిల్లీలో 'చలో జంతర్‌మంతర్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నిర్బంధ పద్ధతులు, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యవాదులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.ముంబై నుంచి ఢిల్లీకి వస్తున్న సీజేపీ నాయకులు అభిజిత్ దీప్కే తదితరులను విమానం రన్‌వేపై ఉండగానే అరెస్టు చేయడం, వామపక్ష పార్టీల కార్యాలయాలను వందలాది మంది పోలీసులతో చుట్టుముట్టడం, నిరసనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకోవడం వంటి ఘటనలు పౌర స్వేచ్ఛలపై జరుగుతున్న దాడికి అద్దం పడుతున్నాయి. పన్నులు, బ్యాంకు రుణాలు ఎగవేసినవారు విదేశాలకు స్వేచ్ఛగా వెళ్లి వస్తున్నప్పటికీ, తమ హక్కుల కోసం నిరసన తెలిపే వారిపై మాత్రం పోలీసులు ఇంతటి కఠిన వైఖరి ప్రదర్శించడం పాలకుల ప్రాధాన్యతలను ప్రశ్నించేలా చేస్తోంది. గతంలో నీట్ ఉద్యమం సందర్భంగా సీపీఐ(ఎం) కార్యాలయంలోకి పోలీసులు చొరబడిన ఘటనను కూడా ఈ సందర్భంగా విస్మరించలేం.మాజీ ముఖ్యమంత్రులు పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌లను సైతం గౌరవప్రదంగా చూడకుండా పోలీసు వాహనాల్లో గంటల తరబడి తిప్పడం, మంచినీరు అందించకపోవడం, మందులు వేసుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడం వంటి ఆరోపణలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకున్నట్లుగా చంద్రబాబు ప్రభుత్వం కూడా శాంతియుత నిరసనలను అడ్డుకునేందుకు నిషేధాజ్ఞలు, పోలీసు ఆంక్షలను విస్తృతంగా వినియోగిస్తోందన్న ఆరోపణలు ప్రజాస్వామ్యవాదులను కలవరపెడుతున్నాయి. సెక్షన్ 144, పోలీసు చట్టంలోని సెక్షన్ 30(ఎ) వంటి నిబంధనల అమలు పేరుతో ధర్నాలు, ప్రదర్శనలకు ఆటంకాలు కలిగించడం, ప్రభుత్వాన్ని విమర్శించే వారిపై కేసులు నమోదు చేయడం, ఆందోళనలకు ముందే నాయకులను గృహనిర్బంధంలో ఉంచడం వంటి చర్యలు పౌరుల హక్కుల పరిమితులను ప్రశ్నించేలా చేస్తున్నాయి.ఈ నెల 10న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమానికి అనుమతి లేదని ముందురోజే ప్రకటించి, రాత్రి నుంచే నాయకులు, కార్యకర్తలను గృహనిర్బంధంలో ఉంచినట్లు వచ్చిన సమాచారం ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతోంది. ధర్నా చౌక్‌కు ఎవరూ చేరుకోకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరిగినప్పటికీ, వందలాది మంది విద్యార్థులు, కార్యకర్తలు అక్కడికి చేరుకోవడం యువతలో పెరుగుతున్న అసంతృప్తికి సంకేతం. ఈ సందర్భంగా పోలీసుల దాడుల్లో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు గాయపడటం, పలువురు ఆసుపత్రి పాలవడం, రాష్ట్ర నాయకుడు రవి చేతికి తీవ్ర గాయమవడం, నాయకురాలు జ్యోతి స్పృహ కోల్పోవడం వంటి ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మహిళలు ఉన్న గదుల్లోకి పురుష పోలీసులు ప్రవేశించారన్న ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరగాలి. కార్యాలయాల్లోకి మాత్రమే కాకుండా ఇళ్లలోకి కూడా వస్తామంటూ నాయకులను హెచ్చరించినట్లు వస్తున్న కథనాలు పోలీసు వ్యవస్థలో పెరుగుతున్న అధికార దుర్వినియోగంపై ఆందోళన కలిగిస్తున్నాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులు చట్టపరమైన పరిమితులను దాటి వ్యవహరిస్తున్నారనే భావన ప్రజల్లో ఏర్పడితే వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటుంది. తిరుపతిలో ధర్నా ముగించుకుని వెళ్తున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నాగరాజును అడ్డుకుని, నోటీసు విషయంలో వాగ్వాదానికి దిగడం, ఆయన మోటార్‌సైకిల్ తాళం తీసుకెళ్లడం వంటి ఘటనలు కూడా పోలీసుల అధికార వినియోగంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని చెప్పుకుంటూనే, బీజేపీతో కలిసి పనిచేస్తూ నిరసనలపై కఠిన వైఖరి అవలంబిస్తోందన్న విమర్శలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని చెప్పే పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు కూడా అదే విలువలను పాటించాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరసన హక్కును సమర్థిస్తూ, అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని అణచివేయడం ద్వంద్వ వైఖరే అవుతుంది.శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, భావప్రకటన స్వేచ్ఛ, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యానికి పునాదులు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించకుండా నిర్బంధాలతో అణచివేయాలని ప్రయత్నిస్తే ఆ అసంతృప్తి మరింత తీవ్రమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు తమ హక్కుల పరిరక్షణ కోసం సంఘటితంగా, శాంతియుతంగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ప్రతి ఆందోళన ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, ప్రజల విస్తృత మద్దతును పొందేలా సాగాలి. ప్రజల గొంతును నొక్కివేయడం ద్వారా ప్రభుత్వాలు తాత్కాలికంగా నిరసనలను నిలువరించగలవేమో గానీ, ప్రజల్లోని అసంతృప్తిని తొలగించలేవు. అడ్డుగోడలు, అరెస్టులు, గృహనిర్బంధాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయవు. ప్రజల హక్కులను గౌరవించడం, విమర్శలను సహించడం, ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం ద్వారానే పాలకులు ప్రజల విశ్వాసాన్ని పొందగలరు. నిర్బంధమే పాలనా విధానంగా మారితే అది ప్రజాస్వామ్యానికి హెచ్చరిక. ఈ ప్రమాదాన్ని గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకోవాలి.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# మీడియా గొంతు నొక్కితే.. ప్రజాస్వామ్యానికి ఊపిరాడదు!

**ఢిల్లీ నుంచి బెంగళూరు వరకు జర్నలిస్టులపై చర్యల ఆరోపణలు.. తెలంగాణలోనూ మీడియా స్వేచ్ఛపై ప్రశ్నలు అధికారాన్ని ప్రశ్నించడం నేరమా? వార్తలు సేకరించడం తప్పా? పాత్రికేయుల భద్రతకు హామీ ఏది?**



ప్రజాస్వామ్యంలో మీడియా అలంకారం కాదు.. అధికారాన్ని ప్రశ్నించే ప్రజాగొంతుక. ఆ గొంతును అణచివేస్తే దెబ్బతినేది జర్నలిస్టుల స్వేచ్ఛ మాత్రమే కాదు, ప్రజల సమాచార హక్కు కూడా. అధికారాన్ని ప్రశ్నించడం మీడియా బాధ్యత. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పడం పాలకుల బాధ్యత.

**ఢిల్లీ నుంచి బెంగళూరు వరకు.. జర్నలిస్టులకు రక్షణ ఎక్కడ?**

2026 అక్టోబర్ 10, 11 తేదీల్లో ఢిల్లీలో నిరసనలను కవర్ చేస్తున్న జర్నలిస్టులను పోలీసులు నిర్బంధించినట్లు కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (CPJ) నివేదించింది. అహ్మదాబాద్, పుణెల్లోనూ పాత్రికేయుల నిర్బంధాలు నమోదయ్యాయని వార్తా కథనాలు పేర్కొన్నాయి. అక్టోబర్ 12న బెంగళూరులో ఫోటో జర్నలిస్టులపై పోలీసుల దాడి జరిగిందనే ఆరోపణలు వెలువడ్డాయి.ఈ ఘటనలపై సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు స్పష్టంగా ఉన్నాయి: జర్నలిస్టులను ఎందుకు నిర్బంధించారు? వార్తా సేకరణకు ఆటంకం కలిగించారా? బలప్రయోగం జరిగిందా? పరికరాలు ధ్వంసమయ్యాయా? ఆరోపణలు నిజమో కాదో నిష్పాక్షిక విచారణ తేల్చాలి. యూనిఫాం చట్టానికి మినహాయింపు కాదు; ప్రెస్ కార్డు కూడా చట్టానికి అతీతమైన హక్కు కాదు. అందరికీ ఒకే చట్టం వర్తించాలి.

**తెలంగాణలోనూ అదే ప్రశ్న.. విమర్శకు సమాధానమా, చర్యలా?**

తెలంగాణలోనూ జర్నలిస్టులపై పోలీసుల చర్యలు, మీడియా సంస్థలపై కేసులు వివాదాలకు దారితీశాయి. హైదరాబాద్‌లో వార్తా సేకరణ సందర్భంగా జర్నలిస్టులను పోలీసులు తోసివేశారనే ఆరోపణలు వచ్చాయి. మరోవైపు, ప్రసారమైన కంటెంట్‌కు సంబంధించిన కేసులో NTV జర్నలిస్టులు దొంతు రమేష్, దాసరి సుధీర్ అరెస్టయ్యారు.

ఈ ఘటనలు వేర్వేరు స్వభావం కలిగినవి. అయినప్పటికీ ప్రతి సందర్భంలోనూ చట్టబద్ధత, పారదర్శకత, బాధితుల హక్కుల పరిరక్షణ ముఖ్యం. తెలంగాణలోని పట్టణాలు, జిల్లా కేంద్రాలు, గ్రామాల్లో పనిచేసే జర్నలిస్టులకూ సమాన రక్షణ ఉండాలి. పెద్ద మీడియా సంస్థలో పనిచేసినా, స్వతంత్ర పాత్రికేయుడైనా వారి వృత్తిపరమైన హక్కులను గౌరవించాలి.

**ప్రశ్నించే మీడియాను భయపెట్టడం పరిష్కారం కాదు**

ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం ప్రభుత్వ వ్యతిరేకత కాదు. అవినీతి ఆరోపణలను వెలుగులోకి తేవడం వ్యక్తిగత శత్రుత్వం కాదు. వార్తలో తప్పులుంటే ఆధారాలతో ఖండించాలి; చట్ట ఉల్లంఘన జరిగితే చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలి. కానీ విమర్శకు బదులుగా బెదిరింపులు లేదా అనవసర నిర్బంధాలు జరిగాయనే ఆరోపణలు వస్తే వాటిని నిర్లక్ష్యం చేయరాదు.విమర్శను ఎదుర్కోలేని అధికారం కంటే, విమర్శకు సమాధానం చెప్పే వ్యవస్థే ప్రజాస్వామ్యానికి బలం.

పోలీసుల విధి శాంతిభద్రతలు.. హక్కులను తొక్కడం కాదునిరసనల సమయంలో శాంతిభద్రతలను కాపాడటం పోలీసుల బాధ్యత. అదే సమయంలో జర్నలిస్టులు తమ విధులు నిర్వర్తించే హక్కును గౌరవించాలి. నిర్బంధాలకు చట్టబద్ధమైన కారణాలు ఉండాలి. బలప్రయోగంపై ఫిర్యాదులు వస్తే ఆధారాలు సేకరించి విచారణ జరపాలి. బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. పోలీసులపై ఆరోపణ వచ్చినంత మాత్రాన వారు దోషులు కారు. అలాగే అధికారంలో ఉన్నారనే కారణంతో వారి చర్యలు ప్రశ్నలకు అతీతం కావు. చట్టాన్ని అమలు చేసే వారూ చట్టానికి జవాబుదారీగా ఉండాలి.

**మీడియా స్వేచ్ఛతో పాటు వాస్తవ నిర్ధారణ కూడా అవసరం**

పత్రికా స్వేచ్ఛ అంటే నిరాధార వార్తలకు అనుమతి కాదు. వాస్తవాలను నిర్ధారించడం, సంబంధిత వర్గాల వివరణ తీసుకోవడం, తప్పులు జరిగితే సవరణలు ఇవ్వడం మీడియా బాధ్యత. అయితే మీడియా తప్పులు చేయవచ్చనే కారణంతో మొత్తం పాత్రికేయ రంగాన్ని అనుమానించడం కూడా సరికాదు.వార్తను ఖండించవచ్చు. ఆధారాలతో సవాలు చేయవచ్చు. చట్టబద్ధంగా ఫిర్యాదు చేయవచ్చు. కానీ జర్నలిస్టును భయపెట్టి వార్తను ఆపాలనుకోవడం ప్రజలకు నిజాలు చేరకుండా చేసే ప్రమాదం ఉంది.

**నష్టపోయేది చివరకు ప్రజలే**

ప్రభుత్వ పథకాల అమలు, ప్రజాధనం వినియోగం, రైతుల సమస్యలు, వైద్య సేవలు, విద్య, అవినీతి ఆరోపణలు వంటి అంశాలు వెలుగులోకి రావాలంటే స్వేచ్ఛగా పనిచేసే మీడియా అవసరం. జర్నలిస్టులు భయంతో వార్తలు సేకరించలేని పరిస్థితి ఏర్పడితే ప్రజా సమస్యలపై చర్చ బలహీనపడుతుంది.అందుకే ప్రభుత్వాలు విమర్శలను సహనంతో ఎదుర్కోవాలి. పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించాలి. మీడియా వాస్తవాల ఆధారంగా వార్తలు ప్రచురించాలి. జర్నలిస్టులపై దాడుల ఆరోపణలు వచ్చినప్పుడు పారదర్శక విచారణ జరగాలి. ఇవి ఎవరికో అనుకూలంగా చేసే చర్యలు కావు; ప్రజాస్వామ్యాన్ని కాపాడే కనీస బాధ్యతలు. ప్రశ్నించే గొంతుకలను కాపాడాలి! ఢిల్లీలో జరిగినా, బెంగళూరులో జరిగినా, తెలంగాణలో జరిగినా జర్నలిస్టులపై వచ్చిన ఆరోపణలను ఒకే ప్రమాణంతో పరిశీలించాలి. వాస్తవాలు బయటపడా చట్టబద్ధమైన విచారణ జరగాలి. తప్పు చేసినవారు ఎవరైనా బాధ్యత వహించాలి.ప్రశ్నించడం నేరం కాదు. విమర్శను అణచివేయడం పాలనకు గౌరవం కాదు. మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు పడితే ప్రజల సమాచార హక్కుకే ముప్పు.జర్నలిస్టుల గొంతు మూగబోతే.. ప్రజల సమస్యలు వినిపించేదెవరు? నిజాలను వెలుగులోకి తెచ్చే మీడియాను కాపాడటం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు—— ప్రజాస్వామ్య మనుగడకు అవసరం.

తెలంగాణలోనూ అదే ప్రశ్న.. విమర్శకు సమాధానమా, చర్యలా? తెలంగాణలోనూ జర్నలిస్టులపై పోలీసుల చర్యలు, మీడియా సంస్థలపై కేసులు వివాదాలకు దారితీశాయి. హైదరాబాద్‌లో వార్తా సేకరణ సందర్భంగా జర్నలిస్టులను పోలీసులు తోసివేశారనే ఆరోపణలు వచ్చాయి. మరోవైపు, ప్రసారమైన కంటెంట్‌కు సంబంధించిన కేసులో NTV జర్నలిస్టులు దొంతు రమేష్, దాసరి సుధీర్ అరెస్టయ్యారు. ఈ ఘటనలు వేర్వేరు స్వభావం కలిగినవి. అయినప్పటికీ ప్రతి సందర్భంలోనూ చట్టబద్ధత, పారదర్శకత, బాధితుల హక్కుల పరిరక్షణ ముఖ్యం. తెలంగాణలోని పట్టణాలు, జిల్లా కేంద్రాలు, గ్రామాల్లో పనిచేసే జర్నలిస్టులకూ సమాన రక్షణ ఉండాలి.



ఎం రవీందర్
7901503777

# యమరాజ సహోదర !!

విక్రాంత్ తీవ్రమైన కడుపు నొప్పి బాధ భరించలేక అర్ధరాత్రి దగ్గర్లోని కార్పొరేట్ ఆసుపత్రిని సంప్రదించాడు . సీరియస్ కేసు అని, ఐసీయూలో అడ్మిట్ చేయాల్సి ఉంటుందని, ఇన్సూరెన్సు ఉందా అంటూ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న డాక్టర్ ప్రశ్నించాడు. విక్రాంత్ భార్య ఉందని సమాధానం చెప్పటంతో లాంచనాలు పూర్తి చేసి విక్రాంత్ ను ఐసీయూ కి తరలించాడు. నాలుగో రోజు డిశ్చార్జ్ సమయంలో ఇన్సూరెన్సు కంపెనీ నుండి ఐదు లక్షల రూపాయలు, విక్రాంత్ భార్య నుండి మరో రెండు లక్షల రూపాయలు వసూలు చేసింది ఆసుపత్రి యాజమాన్యం.

హరీష్ భార్య రోజా తొమ్మిదో నెలలో పురిటి నొప్పులతో బాధ పడుతూ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరింది. ఎటువంటి పరీక్షలు లేకుండానే ఇన్సూరెన్సు ఉందా అని డాక్టర్ మొదటి ప్రశ్న. లేదని హరీష్ సమాధానం చెప్పాడు. రెండో రోజు కేవలం ప్రసూతి చేసినందుకు మూడు లక్షల రూపాయలు వసూలు చేసి హరీష్ భార్యను డిశ్చార్జ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆఫీసులో పని చేసే గోవిందరావు రోడ్డు ప్రమాదానికి గురై కార్పొరేట్ ఆసుపత్రిని సంప్రదించాడు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఇప్పటికే లక్షల రూపాయల బిల్లులు పెండింగులో ఉన్నాయనే కారణం చేత ఉచిత వైద్యం చేయటానికి అతని అధికారిక గుర్తింపు కార్డును ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించలేదు. ఏదైనా ఇన్సూరెన్సు ఉందా అని గోవిందరావు కుటుంబ సభ్యులను అడిగితే లేదని సమాధానమిచ్చారు. ఖర్చు సుమారు మూడు లక్షల రూపాయలు అవుతుందని చెప్పారు. మూడు రోజుల తర్వాత డిశ్చార్జ్ చేస్తూ ఐదు లక్షల రూపాయలు బిల్లును గోవింద రావు చేతిలో పెట్టారు. సుమారు మూడు లక్షలవుతుందని ముందుగా చెప్పి ఐదు లక్షల రూపాయలకు బిల్లు ఎలా వేస్తారని బిల్లింగ్ కౌంటర్లో అడిగితే సరియైన సమాధానం లేదు. గోవిందరావు బిల్లును ఆసాంతం ఒక్కొక్క ఐటమ్ పరీక్షించాడు. సర్జరీ చేసిన డాక్టర్ ఫీజు, షుగర్ డాక్టర్ ఫీజు, మత్తు ఇచ్చిన డాక్టర్ ఫీజుతో పాటు సర్జరీ చేసిన డాక్టర్, షుగర్ డాక్టర్, మత్తు ఇచ్చిన డాక్టర్ల ఆపరేషన్ థియేటర్ విజిటింగ్ చార్జీలు వేలల్లో వేశారు. ఏ ఒక్కటీ వదలకుండా సర్జరీ సమయంలో డాక్టర్లు, నర్సులు ఉపయోగించిన మాస్కులు, గ్లవ్స్, వాడిన ఇంజక్షన్లు, మందుల ధరలు అన్నీ బిల్లులో చూపించారు. వాడిన ఇంజక్షన్లు, మందుల ధరలు గరిష్ట రిటైల్ ధరలకు రెండింతలు అధికంగా చూపించారు. డాక్టర్ల ఫీజులు వసూలు చేస్తున్నప్పుడు తిరిగి విజిటింగ్ చార్జీలు వసూలు చేయడమేమిటని గోవిందరావు బిల్లింగ్ గుమస్తాను ప్రశ్నించాడు. మాకు తెలియదండి, సంబంధిత డాక్టర్లతో విచారించండి అని జవాబిచ్చాడు. ఇంజక్షన్లు, మందులు గరిష్ట రిటైల్ ధరలకు రెండింతలు అధికంగా ఎలా వసూలు చేస్తారని అడిగితే మీరు ఆసుపత్రి ఫార్మసీలో విచారించండి అని ప్రత్యుత్తరమిచ్చాడు. గోవిందరావు బంధువొకరు ఫార్మసీకి వెళ్లి విచారించగా, ఆపరేషన్ థియేటర్ కు మందులు ఎవరు సరఫరా చేస్తారో తమకు తెలియదని చావు కబురు చల్లగా చెప్పారు.

వృద్ధాప్యంలో వివిధ జబ్బులతో బాధ పడుతున్న తన తండ్రిని రాజేష్ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుక వచ్చాడు. అంతకు ముందు వారం రోజుల క్రితమే చేయించిన పరీక్షల రిపోర్టులను ప్రక్కకు పడేసి దాదాపు పదిహేను రకాల పరీక్షలు అదే ఆసుపత్రిలో చేశారు. రక్తపోటు, మధుమేహం అధికంగా ఉన్నాయని ఆసుపత్రిలో చేర్చాలని డాక్టర్ చెప్పాడు. పాత రిపోర్టుల్లో అవి సాధారణంగానే ఉన్నాయని, జాయిన్ చేయటం అవసరం లేదేమో అంటూ రాజేష్‌సందేహం వ్యక్తపరిచాడు. వెంటనే ఆసుపత్రిలో చేర్చకపోతే పరిస్థితులు పక్షవాతానికి దారి తీస్తాయని, డాక్టర్ ఖరాకండిగా చెప్పటంతో విధిలేక ఒప్పుకున్నాడు. తాను చిరు ఉద్యోగినని, ఎన్ని రోజులు ఆసుపత్రిలో ఉండాలి, ఖర్చు ఎంత అవుతుందని ప్రశ్నించాడు. రెండు రోజుల్లో అంతా సర్దుకుంటుందని, సుమారు లక్ష రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పటంతో ఇరవై ఐదు వేల రూపాయలు ముందస్తుగా డిపాజిట్ చేసి తండ్రిని అడ్మిట్ చేశాడు. మూడు రోజులు గడచిపోయాయి. నాలుగో రోజు రాజేష్ తండ్రిని నర్సులకు అప్పచెప్పి గంటలో వస్తానని ఇంటికి వెళ్ళాడు. రెండు రోజుల్లో అంతా సర్దుకుంటుందని చెప్పిన డాక్టర్ రాజేష్ తిరిగి వచ్చేసరికి తండ్రి మంచం మీద నుండి క్రింద పడ్డాడని, తద్వారా ప్రాణం పోయిందని శవాన్ని, ఐదు లక్షలరూపాయల బిల్లును అందించాడు. తాను ఎంతో ప్రేమగా చూసుకున్న తండ్రి ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యానికి గురై అసువులు కోల్పోవటం రాజేష్‌ను బాగా కలచి వేసింది.

అప్పు చేసి బిల్లు కట్టడానికి బిల్లింగ్ కౌంటర్ కు వెళ్లిన రాజేష్ కు నీలమ్మ తారసపడింది. మాటల్లో తన కూతురు చెవి నొప్పితో బాధ పడుతుంటే అదే రోజు ఉదయం తీసుక వచ్చానని, ఒక్క రోజుకే యాభై వేల రూపాయలు వసూలు చేశారని గోడు వెళ్ళబోసుకుంది. అక్కడే ఉన్న మరో బాధితుడు తన అన్నకు పక్షవాతం వచ్చిందని, నాలుగు రోజులకు ఆరు లక్షలు ఖర్చు అవుతుందని చెప్పి పది లక్షల రూపాయల బిల్లు అందించారని, ప్రాధేయపడితే కేవలం ముష్టి పది వేల రూపాయలు తగ్గించారని చెప్పుకొచ్చాడు. ఈ సమస్యలు ఏ ఒకరిద్దరివో కావు. ఒక్కో కార్పొరేట్ ఆసుపత్రిలో రోజుకు వేలల్లో రోగులు. రోగాలు తగ్గటమేమో కానీ, వారి కుటుంబాలు కార్పొరేట్ మోసాలకు గురి అవుతున్నాయి. శవాలకు వైద్యం చేసిన డాక్టర్లు కూడా ఉన్నారు. ముఖ్యంగా ఐసీయూలో ఏమి జరుగుతుందో రోగి బంధువులకు తెలియదు. డాక్టర్లు చెప్పిందే మనం నమ్మాల్సిన పరిస్థితి. స్టెతస్కోప్ ను, థర్మామీటర్ ను డాక్టర్లు ఎప్పుడో మరచిపోయారు. డాక్టర్లు రోగి నాడిని పట్టుకునే రోజులకు, కళ్ళు, నోరు పరీక్షించే రోజులకు ఎప్పుడో కాలం చెల్లింది. డాక్టర్ ను సంప్రదించగానే మొదట ఓ పది రకాల పరీక్షలు రాయటం అలవాటైంది. ఆసుపత్రికి పోతే డాక్టర్ అడిగే మొదటి ప్రశ్న నీకు ఇన్సూరెన్సు ఉందా! ఎందుకంటే ఇన్సూరెన్స్ ఉంటే ఎక్కువ బిల్లు దండుకోవచ్చు.

డాక్టర్లను కొంత మంది ప్రజలు దేవుళ్ళుగా భావిస్తారు. కానీ చాలా ఆసుపత్రులు, వైద్యులు వైద్య వృత్తిని వ్యాపారంగా భావిస్తున్నారనటంలో సందేహం లేదు. అయిననూ డాక్టర్లను, ఆసుపత్రులను తప్పనిసరిగా సంప్రదించాల్సిన పరిస్థితి రోగులది. ప్రైవేటు ఆసుపత్రుల మీద ప్రభుత్వాల సరియైన నియంత్రణ లేకపోతే దాపురించే దుస్థితిని ప్రజలు అనుభవించాల్సిందే.

న్యాయవాదుల వృత్తిపరమైన ప్రచారానికి అడ్డుకట్ట వేస్తూ నియమ నిబంధనలు ఉన్నట్టుగానే, ఆసుపత్రులు, వైద్యుల వింతపోకడల ప్రచారాలను అరికట్టాలనే సదుద్దేశ్యంతో జాతీయ వైద్య కమిషన్ కొన్ని నియమ నిబంధనలు ఈ మధ్య విడుదల చేసింది.

వైద్య వృత్తిలో నైతికతను, నిజాయితీని కాపాడేటందుకు జాతీయ వైద్య కమిషన్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.



తడకమళ్ళ మురళీధర్,
విశ్రాంత జిల్లా జడ్జి,
Ph : 9848545970

# కానరాని విల్లంబుల ధారణలు... కనుమరుగైన సాంప్రదాయాలు

విద్యా భ్యాసానికి చేయూతను ఇచ్చే వారు. ఇప్పట్లా వ్యవస్థీకృత పాఠశాలలు లేని కాలం. జీవితానికి అవసరమైన జ్ఞానం పొందేందుకు నాడు వీధిబడి ఆలంబనగా ఉండేది. అయితే ఇప్పుడు ఉన్నంతగా డబ్బు అప్పట్లో చెలామణిలో లేదు. వస్తుమార్పిడి ఉండేది.

యుగయుగాలుగా, తరతరాలుగా అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తున్న క్షీరధార హైందవ సంస్కృతి. ఆ పాల వెల్లువలో పెల్లుబికిన మీగడ తరగలైన హైందవ సనాతన ప్రాచీన సంప్రదాయాలు క్రమేపీ కనుమరుగు అవుతున్నాయి. పురాణేతిహాస, రుతుపరమైన, మత ప్రమేయ యుక్త, శీతోష్ణస్థితి, స్థానిక పరిస్థితుల సంబంధమైనవిగా పెక్కు సాంప్రదాయాలు అనాదిగా ఆచరించ బడుతున్నాయి. ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతుల ప్రభావం కారణంగా హైందవ సనాతన ఆచారాలు ఒక్కొక్కటిగా అదృశ్యమవుతున్నాయి. అలాంటి వాటిల్లో "ఉపాధ్యాయ వారోత్సవ" సంప్రదాయం ముఖ్యమైనది. బడి పిల్లలు దసరా సెలవులలో విల్లంబులు ధరించి, గిలకలు పట్టి, ఇంటింటికీ తిరిగి గురుదక్షిణ" కోరడమే "ఉపాధ్యాయ వారోత్సవ" కార్యక్రమం. విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు విల్లంబులు ధరించి వెళ్ళడం నేపథ్యంగా తమ గురువును తోడ్కొని విద్యార్థులు చేతుల్లో రంగు బాణాలు ధరించి, దసరా పద్యాలు పాడడం, తమ తమ ఇల్లిల్లు తిరిగి తమ ఆయుధాలకు నివేదన తెమ్మంటూ, పప్పు బెల్లాలిమ్మంటూ తమను విద్యావంతులను చేస్తున్న గురువులకు కట్నకానులకలను ఇమ్మంటూ, అదే పాట, అదే ఆటగా గ్రామమంతా సందడితో ఎక్కడ కన్నా చిన్నారులే, ఎక్కడ విన్నా జయజయ ధ్వనాలే వినిపించేవి. పూర్వం విలువిద్య నేర్చుకొనే పిల్లలు తాము నేర్చిన విద్య దసరా నవరాత్రులలో ప్రదర్శించే వారు. అలనాటి ప్రదర్శనాచారక్రమం రానురాను తొమ్మిది రోజులలో

గిలకలు చేత బట్టుకుని, తమ గురు వులకు బహుమానాలు, తమకు పప్పు బెల్లాలు సంపాదించే అలవాటు ఆచరణలోకి వచ్చినట్లు చెపుతారు. పిల్లల వయస్సు, తరగతిని బట్టి వివిధ కళలను పిల్లకు నేర్పి తమను పోషిస్తున్న పెద్దలతో చెప్పి మెప్పించి పెద్దలు ఆనందంగా ఇచ్చే కానుకలను పొందేవారు. పంతుళ్ళు వెనుక నడుస్తుంటే పిల్లలు వరుసల్లో పాడుతూ ప్రతి వాకిటా ఆగి దసరా మామూళ్ళు స్వీకరించే ఆత్మీయమైన ఆచార మిది. ప్రభుత్వ బడులు లేని ఎన్నో గ్రామాల్లో తమ స్థలాలను బడి పెట్ట డానికి నిస్వార్థంగా దానం ఇచ్చే వారు. ఆ బడి ఇంకా ఇంకా ఎదగాలని తమ ధనాన్ని దసరా కానుకగా అందించే వారు. విద్యా భ్యాసానికి చేయూతను ఇచ్చే వారు. ఇప్పట్లా వ్యవస్థీకృత పాఠశాలలు లేని కాలం. జీవితానికి అవసరమైన జ్ఞానం పొందేందుకు నాడు వీధిబడి ఆలంబనగా ఉండేది. అయితే ఇప్పుడు ఉన్నంతగా డబ్బు అప్పట్లో చెలామణిలో లేదు. వస్తు మార్పిడి ఉండేది. అదీ ధాన్య రూపంలోనే. అలాంటి పరిస్థితుల్లో వీధిబడి అయ్యవారికి కాస్త ఇబ్బందిగానే గడిచిపోయేవి రోజులు. అందుకే ఆయన బతకలేక బడిపంతులు అయ్యాడు. ఏదైనా పండగ వస్తే ఆయనకు జరుగుబాటు అంతంత మాత్రం. అప్పుడు ఆ ఊరివాళ్లే గౌరవంగా తలా కొంత భత్యం సమకూర్చేవారు. మరి పదిరోజుల పండగ దసరా వేళ ఊరితోపాటు తన ఇల్లూ కళకళలాడాలని గురువు, శిష్యులతో కలసి, గ్రామ పెద్దలు పోషకుల ఇళ్ళకు వెళ్ళి, వారి సాయం పొందేవారు. దసరా వచ్చిందంటే ప్రతీ గ్రామంలోనూ గురువులూ వారివెంట పిల్లలూ ఊరంతా తిరుగుతూ పాడుకునే పాటలు ఆ తరం వారికి గుర్తుకు రావలసినదే... ఆ అలవాటు ఇప్పుడు వెనుకబాటు అయింది. "పర గనాశ్వియుజ శుక్ల పక్ష మందు తెరగొప్ప దీవించ వస్తిమిట మేము శ్రీరస్తు విజయోస్తు దీర్ఘాయురస్తు, ధన కనక వస్తు వాహన సిద్ధిరస్తు. బాలకుల దీవెనలు బ్రహ్మ దీవెనలు, భూమి లోపల లేని భోగములు కల్గి ధనదాన్యములు కల్గి అంటూ శుభాకాంక్షలు తెలపడం... ఘనముగా కట్నములు గ్రక్కున ఇచ్చి, సెలవియ్యుడి మాకు శీఘ్రముగా, పట్టు పచ్చడి మిచ్చి పదిమాడలిచ్చి,

గట్టి శాలువలిచ్చి కడియం లిచ్చి, అయ్యవారికి చాలు ఐదు వరహాలు, పిల్ల వాండ్లకు చాలు పప్పు బెల్లాలు, కొబ్బరి కురిడీలు కుండ బెల్లాలు అంటూ ఈయవలసిన వాటిని ఏకరువు పెడుతారు. ఏదయా మీదయా మామీద లేదా ఇంత సేపుంచుట ఇది మీకు తగునా? దసరాకు వస్తిమని విసవిసలు పడక, రేపురా మాపురాస్ మళ్ళీ రమ్మనక, చేతిలో లేదనక ఇవ్వలేమనక, ఇప్పుడే లేదనక, అప్పివ్వరనక, ఇరుగు పొరుగు వారు ఇస్తారు సుమ్మీ, శీఘ్రు ముగ పంపుడి శ్రీమంతులార అంటూ ఇవ్వడంలో జాప్యం చేయవద్దని, వాయిదా చేయవద్దని మృదువుగా మర్యాదగా వేడుకుంటారు. పలుమార్లు మిమ్మెపుడు అడుగంగ రాము, అల్లుండ్రవలె కాదు అలిగి మిమ్మడుగ, చెల్లెండ్ర వలెగాదు చెలగి మిమ్మడుగ, అల దొమ్మరులము గాము ఆడి మిమ్మడుగ, మంత్ర తంత్రము కాదు మాయచే నడుగ, బలవంతులము కాదు బలముచే నడుగ, నిలువు జీతము కాదు నిలిచి మిమ్మడుగ అంటూ గడుసుగా చెపుతారు. పావలా బాడైతే పట్టేది లేదు, అర్ధరూపాయైతే అంటేది లేదు, ఒక్క రూపాయైతే ఒప్పేది లేదు, అయ్య వారికి చాలు ఐదు వరహాలని, కనీస గురు దక్షిణ పేర్కొంటారు...అలా గురు దక్షిణ రాబట్టి జయ విజయ భవ, దిగ్విజయీభవ అంటూ బాలల దీవెనలు బ్రహ్మ దీవెనలుగా" వర్ణిస్తూ భరతవాక్యం పలుకుతారు.

దేవతా వేషధారులై ఆ చిన్నారులు ఘనమైన పద్యాలు చదువుతూ ఆశీస్సులు అందిస్తే ఊరి పెద్దలు, పోషకులు ముగ్దులైన నేపథ్యం మరిచి పోలేని తీపి గుర్తులు. ఎల్లపుడూ చదువులో నిమగ్నమవు తూండే పిల్లలు శరన్నవ రాత్రులలో ఆటవిడుపుగా, గురుదక్షిణ పొందే సంబరాల కార్యక్రమంగా ఆశ్వయుజ పాడ్యమి మొదలు విజయ దశమి దాకా నాడు కనిపించే పిల్లల విల్లంబులు ధారణలు, వినిపించిన సంప్రదాయ పద్యాలు నేడు ఆధునిక మాటున పూర్తిగా కనుమరుగైనాయి.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్



# జాతీయం-అంతర్జాతీయం



## నిరసనల అణచివేతకు ఎమర్జెన్సీయే మార్గమా?






**న్యూఢిల్లీ:**

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జాతీయ జెండా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన సీజేపీ నేతలు ఆశుతోష్, సౌరవ్‌లకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడంపై అభిజీత్ దీప్కే స్పందించారు. నిరసనలను అణచివేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. జాతీయ జెండాను ఎగురవేసినందుకే ఆశుతోష్, సౌరవ్‌లను జ్యుడీషియల్ కస్టడీకి పంపారని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ప్రజల నిరసనలను అణచివేయాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం భావిస్తే, దాచిపెట్టే చర్యలకు బదులుగా అధికారికంగా అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) ప్రకటించే ధైర్యం సవాల్ విసిరారు.ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జాతీయ జెండా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన ఘటనలో సీజేపీ నేతలు ఆశుతోష్, సౌరవ్‌లకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ఈ చర్యపై సీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వంపై దీప్కే తీవ్ర విమర్శలు చేశారు. జాతీయ జెండాను ఎగురవేసినందుకే ఆశుతోష్, సౌరవ్‌లను జ్యుడీషియల్ కస్టడీకి పంపారని దీప్కే పేర్కొన్నారు.

## గుడిలో బాలికపై లైంగిక దాడి నిందితుడి అరెస్టు

**పుణె:**

మహారాష్ట్రలోని పుణెలో గుడికి వచ్చిన మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి విశాల్ సింగ్ అనే కాంట్రాక్ట్ కార్మికుడిని పోలీసులు అరెస్టు చేశారు. పింప్రిచించ్వాడ్‌లోని నిగ్డి ప్రాంతంలో ఉన్న శివాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 10న ఉదయం 11.07 గంటల సమయంలో బాలిక గుడిలో ప్రార్థనలు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన నిందితుడు బాలిక ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఆమె చేయి పట్టుకుని లైంగిక దాడికి యత్నించినట్లు సమాచారం. బాలిక అతడిని ప్రతిఘటించి అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లిపోయింది. గుడిలోని సీసీటీవీ కెమెరాల్లో ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ ఫుటేజ్ బయటకు వచ్చి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైంది. నిందితుడు మెట్రో నిర్మాణ పనుల్లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేశారు. లైంగిక నేరాలకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలతో పాటు, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో) కింద కేసు నమోదు చేసినట్లు సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహేష్ బన్సోడే వెల్లడించారు.






## గాజాలో మనుషులు బతికే పరిస్థితి లేకుండా పోతోంది !

**కైరో :**

ఇజ్రాయిల్ తీవ్రస్థాయిలో సాగించిన సైనిక దురాగత దాడుల వల్ల గాజా క్రమక్రమంగా మానవులు నివసించడానికి వీల్లేని ప్రాంతంగా మారిపోతోందని పాలస్తీనా శరణార్థులకు ఐక్యరాజ్య సమితి సహాయక, ఉపాధి సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) ఆరోగ్య విభాగ అధ్యక్షులు అకిహిరో సెయిటా అన్నారు. ఇజ్రాయిల్, హమస్ మధ్య కాల్పుల విరమణ జరిగి అక్టోబరు 10కి ఏడాది పూర్తయిన సందర్భంగా అకిహిరో సెయిటా మాట్లాడారు. అంతర్జాతీయ సమాజం దృష్టి ఇప్పుడు ఇరాన్‌పైకి మళ్ళిందని, తమకు సాయం చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని గాజా ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు.2023 అక్టోబరులో గాజాపై ఇజ్రాయిల్ మిలటరీ పెద్ద ఎత్తున సైనిక చర్యలు ప్రారంభించింది. ఈ దాడుల్లో గాజాలో 74 వేల మంది చనిపోయారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇజ్రాయిల్ బలగాలు దాడులు కొనసాగించడం, పైగా గాజాలో చాలా భాగాన్ని ఆక్రమించుకోవడంతో పాలస్తానా ప్రాంతంలో పునర్నిర్మాణ కార్యక్రమాలు మందకొడిగా నడుస్తున్నాయి. గాజాలో దాదాపుగా 70 శాతం ప్రాంతం ఇజ్రాయిల్ మిలటరీ అధీనంలోనే వుంది. ఒప్పందంలో కుదిరిన ప్రాంతాల లక్షల మంది గాజా ప్రజలు మిగిలిన 30 శాతం ప్రాంతంలోనే జీవించాల్సి వస్తోంది. చాలామంది శిబిరాల్లోనే బతుకీడుస్తున్నారు. అక్కడ మందుల సరఫరాలు లేవు, ప్రధానంగా పారిశుధ్యానికి సంబంధించి భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. అనేక రకాల అంటురోగాలు, చర్మవ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సెయిటా పేర్కొన్నారు. ఇక పోషకాహార లోపం అతిపెద్ద సమస్యగా వుందన్నారు. ఇప్పుడు యుద్ధ కార్యకలాపాలు కొంతమేరా తగ్గినా పిల్లల దుస్థితి మారలేదని అన్నారు. గాజాపై నియంత్రణ వున్న హమస్ నిరాయుధీకరణకు సిద్ధంగా వున్నా బలగాల ఉపసంహరణకు ఇజ్రాయిల్ నిరాకరిస్తోంది. దాంతో అమెరికా అధ్యక్షుడు చొరవతో రూపొందిన గాజా మరోవైపు అమెరికా యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎకు నిధులు ఆపేసింది.



## అరామ్‌కోపై హూతీల దాడి: సౌదీకి షాక్

**సౌదీ అరేబియా**

వరుసగా హూతీలు చేస్తున్న దాడులు కలకలం రేపుతున్నాయి. ధహ్రాన్ నగరంలోని చమురు దిగ్గజం అరాంకో ప్రధాన కార్యాలయంపై హూతీలు బాలిస్టిక్ క్షిపణితో దాడి చేశారు. మరోవైపు రాజధాని రియాద్‌లో క్షిపణుల శకలాలు పడటంతో నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు మహిళలు, ఓ పురుషుడు, ఓ చిన్నారి ఉన్నారు. ఈ ఘటనలో 15 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. సౌదీ అరేబియాలోని కీలక ప్రాంతాలపై దాడులు జరగడంతో భద్రతాపరమైన ఆందోళనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు, సౌదీ అరేబియా మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. హూతీలు క్షిపణులు, డ్రోన్లతో దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో సౌదీ బలగాలు వాటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో క్షిపణి ఇంటర్‌సెప్టర్లను ప్రయోగిస్తుండటంతో..వాటి శకలాలు కిందపడి ఇళ్లకు నష్టం వాటిల్లుతోంది. అరాంకో ప్రపంచంలోని అతిపెద్ద చమురు సంస్థల్లో ఒకటి. చమురు ఉత్పత్తి, శుద్ధి, ఎగుమతుల్లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ క్రమంలో దీనిపై దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ దాడి వల్ల సంస్థ కార్యకలాపాలకు ఎంతమేర నష్టం వాటిల్లిందనే వివరాలు వెల్లడికావాల్సి ఉంది.'ఫ్లై దుబాయ్' కూల్చివేత కుట్రలో.. ఇద్దరు మాల్దీవియన్ పైలట్ల అరెస్ట్‌యెమెన్ ఇంధన కేంద్రంపై సౌదీ దాడియెమెన్ అరేబియా దాడి చేసింది. రాజధాని సనా శివార్లలోని అల్‌సబాహా కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని భారీ దాడికి పాల్పడింది. హూతీలు సౌదీలోని విమానాశ్రయాలు, ఇంధన సముదాయాలపై దాడులకు ఈ కేంద్రాన్ని వాడుతున్నట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు తెలిపాయి. ఈ కేంద్రంలో సుమారు 58 వేల టన్నుల ఇంధనాన్ని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ఈ దాడిలో ఇద్దరు పౌరులు మరణించగా, మరో ఇద్దరు గాయపడినట్లు హూతీలు వెల్లడించారు. ఈ వరుస దాడుల నేపథ్యంలో హూతీలు, సౌదీ బలగాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



## పోలీసు యూనిఫాంలతో నిండిన వ్యాన్!

**-న్యూఢిల్లీ :**

రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులపై దాడులు చేస్తున్నది నిజంగా పోలీసులేనా? పోలీసు యూనిఫాంలు ధరించిన వారిలో కొందరి గుర్తింపు ఏమిటి? అనే ప్రశ్నలు తాజాగా వెలుగులోకి వచ్చిన దృశ్యాలతో తలెత్తుతున్నాయి.

**నిరసనకారుల మధ్య నిలిపి ఉంచిన ఓ పోలీసు వ్యాన్‌లో పోలీసు,**

కేంద్ర బలగాల యూనిఫాంలు పెద్ద సంఖ్యలో పేర్చి ఉంచిన దృశ్యాలు బయటకొచ్చాయి. ఎన్నికల సంఘానికి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో విద్యార్థి, యువజన సంఘాలు, సిజెపి, ప్రతిపక్ష పార్టీలు నిర్వహిస్తున్న ఆందోళనలను అణచివేసేందుకు గుర్తుతెలియని వ్యక్తులను ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. పోలీసు యూనిఫాంలు ధరించిన పలువురు తమ నేమ్ ప్లేట్లు కనిపించకుండా విద్యార్థులు, ఇతర నిరసనకారులపై దాడులకు పాల్పడుతున్నారు. వారి గుర్తింపును ప్రశ్నించిన వారిని మరింత తమంది చుట్టుముట్టి బలవంతంగా లాక్కెళ్లి కొడుతున్నారు.నేమ్ ప్లేట్ ఏదని అడిగితే..ఇటీవల ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఐషీ ఘోష్, ఇతర విద్యార్థి నాయకులను

**పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన**

వీడియో వైరల్ అయింది. పోలీసు వ్యాన్‌లో ఉన్న యూనిఫాం ధరించిన ఓ మహిళను ఐషీఘోష్ నేమ్ ప్లేట్ గురించి ప్రశ్నించినట్లు ఆ

**వీడియోలో కనిపించింది. నేమ్ ప్లేట్ ఎక్కడ ఉందని ప్రశ్నించిన అనంతరం**

ఆ మహిళా సిబ్బంది నిరసనకారులను వ్యాన్ నుంచి కిందకు దింపేసింది. ఈ ఘటనను వీడియో తీసేందుకు ప్రయత్నించగా అడ్డంకులు సృష్టించింది. పోలీసు యూనిఫాంలో ఉన్నవారి గుర్తింపు గురించి ప్రశ్నించే హక్కు నిరసనకారులకు లేదా? అనే ప్రశ్నలు ఈ ఘటనతో ముందుకొస్తున్నాయి.ఎక్కడికి తీసుకెళ్తున్నారో చెప్పరా?పోలీసు వ్యాన్లలోకి ఎక్కించి తీసుకెళ్తున్న నిరసనకారులను ఎక్కడికి తరలిస్తున్నారనే విషయం కూడా వారికి తెలియజేయడం లేదు. విద్యార్థులను అదుపులోకి తీసుకెళ్లే చర్యల్లో గుర్తింపు స్పష్టంగా లేని వ్యక్తులు కూడా పాల్గొంటున్నారు. పోలీసు, కేంద్ర బలగాల యూనిఫాంలను ధరించి నిరసనకారులపై దాడులు చేయడానికి కొందరు జంతర్‌మంతర్‌కు వస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. నిరసనలను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం అండదండలతో బయటి వ్యక్తులను ఉపయోగిస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ.

**అయితే, వ్యాన్‌లో కనిపించిన యూనిఫాంలు ఎవరివి? వాటిని ఎవరు ఉపయోగిస్తున్నారు?**

యూనిఫాంలు ధరించిన వ్యక్తుల అధికారిక గుర్తింపు ఏమిటి? అనే అంశాలు బయటకు రావాల్సి ఉంది.ప్రజాస్వామ్య హక్కులపై ప్రశ్నలుఎస్‌ఐఆర్‌ను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ

**విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఢిల్లీలో నిరసనలు నిర్వహిస్తున్నాయి.**

ఈ ఆందోళనల సందర్భంగా పోలీసుల బలప్రయోగం, నిరసనకారులపై దాడులు, మహిళా కార్యకర్తల పట్ల దురుసు ప్రవర్తనకు సంబంధించిన ఆరోపణలు వెలువడ్డాయి.

**నిరసనకారులపై దాడులు చేసిన వ్యక్తుల గుర్తింపును నిర్ధారించాలని,**

నిర్బంధ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును పరిరక్షించడంతోపాటు, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది గుర్తింపు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు ముందుకు తెస్తున్నాయి.



## ప్రపంచం కోసమే డీజిల్ కొనుగోలు

**వాషింగ్టన్**

డీజిల్ కొనుగోళ్ల కోసం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కుదుర్చుకున్న ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సొంత పార్టీ నుంచి కూడా తీవ్ర విమర్శల సెగ ఎదురవుతోందిఈ నేపథ్యంలో ఆయన కాస్త వెనక్కి తగ్గారు. ఈ డీల్ అమెరికా కోసం కాదని.. ప్రపంచ మార్కెట్ల కోసమని చిత్రమైన వివరణ ఇచ్చారు.''అదొక డీజిల్ ఒప్పందం. అది మనకోసం కాదు.. ప్రపంచం కోసం'' అని ట్రంప్ మీడియాతో మాట్లాడారు. అధిక ధరల కారణంగా దెబ్బతిన్న ప్రపంచ మార్కెట్‌ను స్థిరీకరించడానికే రష్యాలోని రిఫైనరీల నుంచి వచ్చిన ఇంధనాన్ని ఉపయోగించనున్నట్లు చెప్పారు. నవంబరులో మధ్యంతర ఎన్నికల వేళ ఇంధన ధరల పెరుగుదల అమెరికా (USA) లో తీవ్ర చర్చనీయాంశంగా మారడంతో ట్రంప్ కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. రష్యా డీజిల్‌పై ఆంక్షలను 2027 ఏప్రిల్ వరకు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రపంచం షాక్‌కు గురైంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఇటీవల ఫోన్‌లో చర్చలు జరిపిన అనంతరం ఆ ప్రకటన చేశారు.సౌదీకి షాక్: అరామ్‌కో ప్రధాన కార్యాలయంపై హూతీల దాడి తొలుత మూడు లక్షల టన్నులకుపైగా డీజిల్‌ను అమెరికాకు, అంతర్జాతీయ విపణికి రష్యా తక్షణమే సరఫరా చేసేలా తమ చర్చల్లో ఒప్పందం కుదిరిందన్నారు. నవంబరులో మరో 5 లక్షల టన్నులు.. ఆ తర్వాత వెంటనే ఇంకో 10 లక్షల టన్నులను మాస్కో సరఫరా చేస్తుందన్నారు. ఆపై ఆ దేశ డీజిల్ రిఫైనరీల పరిస్థితులను బట్టి స్వల్ప కాలంలోనే మరో 30 లక్షల టన్నుల వరకూ అందిస్తుందని తెలిపారు.



## ఓపెన్‌ఏఐ మీటింగ్ హాల్‌లో గూఢచర్య పరికరాలు..!

**శాన్‌ఫ్రాన్సిస్కో**

ఓపెన్‌ఏఐలో ఇంజినీర్‌గా పనిచేస్తూ.. గూఢచర్యం చేస్తోన్న సౌదీ జాతీయుడిని అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. తమ కార్యాలయంలోని మీటింగ్ రూమ్‌లో రహస్య రికార్డింగ్ పరికరం ఉన్నట్లు గుర్తించిన ఈ టెక్ సంస్థ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే..శాన్ ఫ్రాన్సిస్కోలోని ఓపెన్‌ఏఐ ఆఫీసులో గల సమావేశ గదిలో రహస్య పరికరం ఉండడాన్ని సెప్టెంబర్ 30న అక్కడి సిబ్బంది గుర్తించారు. బొటన వేలు పరిమాణంలో ఉన్న ఆ పరికరాన్ని టాయిలెట్ పేపర్‌లో చుట్టి, గదిలోని టీవీ వెనక ఉన్న పోర్ట్‌లో దాచినట్లు సిబ్బంది తెలిపారు. అందులో ఒక మైక్రోఫోన్, కెమెరా సెన్సార్, మైక్రోఎస్‌డీ స్టోరేజ్ ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఇంటర్నల్ ఏఐ సాయంతో ఆ పరికరం ఏంటనేది తెలుసుకున్నారు. కంపెనీలో పనిచేస్తోన్న అబ్దుల్ రహ్మాన్ ఈ రహస్య పరికరాన్ని అమర్చినట్లు తెలిసింది. ఈ విషయంపై వెంటనే ఓపెన్‌ఏఐ సంస్థ ఎఫ్‌బీఐకి ఫిర్యాదు చేయడంతో.. ఇటీవల అధికారులు అతడిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో పలు కీలక విషయాలు బయటికొచ్చాయి.బాలికను అసభ్యంగా తాకిన రోబో.. షాకింగ్ ఘటనసౌదీకి చెందిన అబ్దుల్ రహ్మాన్ ఏఐ చాట్‌బాట్‌ను ఉపయోగించి, ఆ రహస్య పరికరాన్ని తయారు చేసినట్లు ఎఫ్‌బీఐ అధికారులు వెల్లడించారు. మీటింగ్ హాల్‌లో జరిగే ఓపెన్‌ఏఐ ఎగ్జిక్యూటివ్‌ల కీలక సమావేశాల వివరాలను తెలుసుకునేందుకు అతడు ఈ కుట్ర పన్నినట్లు తెలిపారు. నిందితుడు తరచూ ఆ గది బయట తచ్చాడిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి.

ఆ పరికరంలో ఉన్న సమాచారం ఎన్‌క్రిప్ట్ చేసి ఉండడంతో దానిని యాక్సెస్ చేయడం సాధ్యపడలేదని ఎఫ్‌బీఐ అధికారులు పేర్కొన్నారు.అబ్దుల్ రహ్మాన్ 2025 జులైలో చేరాడు. గతంలో మెటా, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల్లోనూ పని చేశాడు. ఈ ఘటన నేపథ్యంలో సంస్థ అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. గూఢచర్యానికి పాల్పడినట్లు నేరం రుజువైతే అతడికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష.. పెద్ద మొత్తంలో జరిమానా పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.



## 'సర్' లేకున్నా ఓటమి ఖాయం!

**దిల్లీ:**

ఓట్ల సవరణకు ఉద్దేశించిన 'సర్' లేనప్పుడు కూడా కాంగ్రెస్ ఓడిపోయిందని... 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆ పార్టీకి ఘోర పరాజయం తప్పదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో ఎన్నికలకు వెళ్లిన ప్రతిసారీ ఆ పార్టీకి ఓటమేనని ఎద్దేవా చేశారు. ఆయన నాయకత్వ ఫలితాల్ని 'సర్'పై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దేశ ప్రజలంతా భాజపా, ఎన్డీయే,

**ప్రధాని నరేంద్ర మోదీలతోనే ఉన్నారని షా ధీమా వ్యక్తంజేశారు.**

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ చేపట్టిన ఆందోళన తర్వాత తొలిసారి మంగళవారం అమిత్ షా స్పందించారు. ''ప్రజలతో సంబంధం లేకుండా కాంగ్రెస్ అనుసరిస్తూ వస్తున్న ప్రతికూల రాజకీయాలు ఆ పార్టీకి ప్రయోజనం కలిగించవు. అనేక రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికలు, స్థానికసంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పనితీరు పేలవంగా ఉంది. కాంగ్రెస్‌కు ముఖ్య నేతగా, కొన్నాళ్లు అధ్యక్షుడిగా, ప్రస్తుతం లోక్‌సభ విపక్ష నేతగా ఉన్న రాహుల్ హయాంలో వరసగా అన్ని ఎన్నికల్లోనూ ఆ పార్టీ పరాజయం మూటగట్టుకుంటూ వస్తోంది. దానిపై

**మీరు ఆత్మవిమర్శ చేసుకోవాలి. అబద్ధాలు పదేపదే చెప్పి,**

మీడియా దృష్టిలో పడేందుకు కల్పిత ప్రయత్నాలు చేస్తుంటే మీరు ప్రజల విశ్వాసాన్ని పొందలేరు. కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ తన ప్రాభవాన్ని కోల్పోతోంది. అయినా రాహుల్‌ను నేనొకటి సూటిగా అడగాలనుకుంటున్నాను. ఇదంతా 'సర్' ఫలితమేనా? 2024 తర్వాతేగా సర్ మొదలైంది? మరి అంతకుముందు కూడా మీ పార్టీ ఓడింది కదా? చొరబాటుదారుల్ని ఓటర్లుగా చేర్చాలనే రాహుల్ ఆలోచనల గురించి దేశ ప్రజలకు తెలుసు.

**తదుపరి సార్వత్రిక ఎన్నికల్లో బ్రహ్మాండమైన ఆధిక్యంతో ఎన్డీయే గెలవడం,**

వరసగా నాలుగోసారి కాంగ్రెస్ ఓటమిపాలు కావడం ఖాయం'' అని విలేకరుల సమావేశంలో చెప్పారు.

**అది దేశం గొంతు అవుతుందా?**

దిల్లీలో 14 రాజకీయ పార్టీలకు చెందిన 8 వేల మంది కార్యకర్తలు ఒకటిన్నర కి.మీ. మేర గుమిగూడినంత మాత్రాన అది రాహుల్ మన దేశం తరఫున వినిపించిన వాణి అయిపోదని అమిత్ షా ఎద్దేవా చేశారు. ''ప్రజల మనోభావాలు తెలుసుకోవాలంటే పొలాలు, గ్రామాలు, కొండకోనలకు వెళ్లాలి. రాహుల్ అక్కడకు వెళ్లలేరు. బిహార్, యూపీ, తమిళనాడు సహా అనేక రాష్ట్రాల ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారు. ఒకప్పటి కంచుకోటలాంటి గుజరాత్‌లో గత 41 ఏళ్లుగా ఒక్క ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ ఎందుకు గెలవలేకపోతోంది? ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అంశం ఇది'' అని షా తెలిపారు.

**ఓటుచోరీ సహ రూపకర్త రిగ్గింగు ప్రారంభించారు**

కాంగ్రెస్ అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఓటు చోరీ సహ రూపకర్త అప్పుడే రిగ్గింగు ప్రక్రియ ప్రారంభించారని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. నిరంకుశంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాన్ని సాగనంపడానికే దేశ యువత ఇప్పుడు రోడ్లపైకి వస్తోందని చెప్పారు.



## చివరి నిమిషంలో ప్రశ్నాపత్రం రూపొందిస్తే సరి !

**న్యూఢిల్లీ :**

దేశ పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతకు ముప్పుగా మారిన ప్రశ్నా పత్రాల లీకేజీలను నివారించడానికి ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నందన్ నీలేకని ఒక సూచన చేశారు. బృహత్తరమైన రీతిలో ప్రశ్నా పత్రాల బ్యాంక్‌ను రూపొందించాలని, చిట్ట చివరి నిముషంలో మాత్రమే తుది ప్రశ్నా పత్రాన్ని రూపొందించాలని సూచించారు. పరీక్ష జరిగే రోజే ప్రశ్నా పత్రాన్ని రూపొందించేందుకు కృత్రిమ మేథస్సును కూడా ఉపయోగించుకోవచ్చని అన్నారు. ఇవి పని చేయాలంటే, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ మోడ్‌లో పరీక్షలు నిర్వహించాల్సి వుంటుందన్నారు. సాంప్రదాయసిద్ధమైన పెన్ను, పేపర్ పద్ధతిని వదిలిపెట్టాలన్నారు. జులైలో కేంద్ర ప్రభుత్వం పరీక్షల సంస్కరణలపై ఏర్పాటు చేసిన ఆరుగురు సభ్యుల ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్‌కు నీలేకని చైర్మన్‌గా వున్నారు. టాస్క్ ఫోర్స్ గుర్తించిన పరీక్షా వ్యవస్థలోని బలహీనతలు, భద్రతాపరమైన లోపాల గురించి మంగళవారం ఇక్కడ జరుగుతున్న బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరం సమావేశాల్లో అడిగిన ఒక ప్రశ్నకు ఆయన స్పందించారు. ''ఈ కమిటీ ఏర్పడడానికి దారి తీసిన ప్రధాన సమస్య ప్రశ్నా పత్రాల లీకేజీలు. ప్రశ్నా పత్రంగా పిలుస్తున్న దాని అవసరం మనకు ఎందుకు వుంది? అది అమ్ముడవడానికి ఆర్థికపరమైన రాయితీ కల్పిస్తుంది కనుక. దీన్ని పరిష్కరించడానికి పరిశీలిస్తున్న మార్గాల్లో ఒకటి, బృహత్తరమైన ప్రశ్నల బ్యాంక్‌ను చెప్పారు. ఆ రోజునే సిద్ధం చేయాలంటే కృత్రిమ మేథను ఉపయోగిస్తారా అని ప్రశ్నించగా, కచ్చితంగా అని నీలేకని సమాధానమిచ్చారు. ''వ్యవస్థాగతంగా దీన్ని పరిశీలించినట్లైతే, ఎందుకు ఇది జరుగుతోంది అంటూమూల కారణాన్ని పరిశీలించాలి, అవి పరిష్కారమయ్యే అంశాలైతే అందుకు సాంకేతికతను ఉపయోగించాలి.' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ టాస్క్ ఫోర్స్ ఇప్పటివరకు 18 సార్లు సమావేశమైంది. 40 సంప్రదింపుల సమావేశాలు జరిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, డాక్టర్ల సమాఖ్యలతో సహా పలువురు నుండి 50 వేలకు పైగా సూచనలు అందుకుంది. అలాగే నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వేరిక్రూట్‌మెంట్ బోర్డు వంటి పరీక్షలు నిర్వహించే సంస్థల నుండి కూడా సూచనలు తీసుకుంది.



## యూఏఈ పాస్‌పోర్ట్‌కే ప్రథమ స్థానం!

**దుబాయ్:**

ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పాస్‌పోర్ట్ నిలిచింది. గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో యూఏఈ తొలి స్థానాన్ని దక్కించుకుంది. ఈ జాబితాలో భారత్ 72వ స్థానంలో నిలిచింది. యూఏఈ పాస్‌పోర్ట్ ఉన్న వారు ముందస్తు వీసా లేకుండా లేదా సులభమైన ప్రవేశ అనుమతులతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు ప్రయాణించవచ్చు. మొత్తం 182 దేశాలకు సులభంగా వెళ్లే అవకాశం ఉండగా, వీటిలో 138 దేశాలకు పూర్తిగా వీసా లేకుండా ప్రవేశించవచ్చు. మరో 44 దేశాల్లో వీసా ఆన్ అరైవల్, ఈవీసా వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఈ జాబితాలో సింగపూర్, మలేషియా పాస్‌పోర్ట్‌లు రెండో స్థానంలో నిలిచాయి. ఈ దేశాల పాస్‌పోర్ట్ కలిగిన వారు 175 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. 174 దేశాలకు ప్రవేశ సౌకర్యంతో స్పెయిన్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక సలహా సంస్థ ఆర్టన్ క్యాపిటల్ ఈ గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌ను విడుదల చేసింది. ఐక్యరాజ్యసమితికి చెందిన 193 సభ్య దేశాలతో పాటు మరో ఆరు ప్రాంతాలను కలిపి మొత్తం 199 దేశాలు, ప్రాంతాల్లో ప్రయాణ సౌకర్యాలను ఈ సంస్థ విశ్లేషించింది. వీసా లేకుండా ప్రవేశం, అక్కడికి చేరుకున్న తర్వాత వీసా పొందే అవకాశం, ఎలక్ట్రానిక్ ప్రయాణ అనుమతి వంటి అంశాల ఆధారంగా పాస్‌పోర్ట్‌లకు మొబిలిటీ స్కోర్ కేటాయించి ఈ ర్యాంకులను నిర్ణయించారు.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## దీన్ దయాల్ నగర్‌లో వడ్డెర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



హనుమకొండ సిటీ, అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి) :

హనుమకొండ పరిధిలోని 31వ డివిజన్ దీన్ దయాల్ నగర్ కాలనీలో వడ్డెర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో డివిజన్ అభివృద్ధికి సుమారు రూ.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే 85 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయిందని, మిగిలిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. జేపీ నగర్ ఫేజ్ 2 ప్రధాన రహదారి పనులకు వారం రోజుల్లో శంకుస్థాపన చేయనున్నట్లు, అర్హులైన నిరుపేదలకు సుమారు 2,000 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కమ్యూనిటీ హాల్‌తో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్, మాజీ అధ్యక్షుడు అంకేశ్వరపు సురేందర్, 50వ డివిజన్ మాజీ కార్పొరేటర్ నెక్కొండ కవిత కిషన్, వడ్డెర సంఘం పెద్దలు, జేపీ నగర్ ఫేజ్ 2 కాలనీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## వైద్యశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలి



జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి,అక్టోబర్ 14(వుదయం జిల్లా ప్రతినిధి):

ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు వైద్య సేవలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ప్రధాన వైద్యశాలను సందర్శించి ఎక్స్‌రే యూనిట్, ఎం.ఆర్.ఐ. యంత్రం, విద్యుత్ సరఫరా వ్యవస్థ, క్యాజువాలిటీ విభాగం ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం, పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు ,ఎదురవుతున్న సమస్యలపై వైద్యశాల పర్యవేక్షకులను అడిగి తెలుసుకున్నారు.ఎం.ఆర్.ఐ. యంత్రం నిరంతరం పనిచేసేందుకు అవసరమైన సామర్థ్యం కలిగిన స్టెబిలైజర్, ఆర్మర్డ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు చేయాలని, ఎక్స్‌రే యూనిట్‌కు కూడా అవసరమైన విద్యుత్ సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక క్యాజువాలిటీ విభాగం ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని వైద్యశాల పర్యవేక్షకులను ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణంలో వాహనాలు ఎక్కడంటే అక్కడ పార్కింగ్ చేస్తున్నారని క్రమపద్ధతి పాటించేందుకు పార్కింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన వైద్యశాల పర్యవేక్షకులు డా. వెంకటస్వామి, టీజీఎండీసీ ఈఈ నందు పటేల్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

## రీ-సర్వేపై అపోహలు వీడి ప్రజలు సహకరించాలి




భూముల రీ - సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి):

మండలం గోపనపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన భూముల రీసర్వే అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని, రీసర్వేపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల రీసర్వే ప్రక్రియ ద్వారా భూముల సరిహద్దులు, విస్తీర్ణం, భూ రికార్డుల వివరాల్లో స్పష్టత, పారదర్శకత పెరుగుతాయని తెలిపారు. రీసర్వే సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పూర్తి సహకారం అందించాలని అధికారులను సూచించారు. సర్వే పనులను పారదర్శకంగా, సమన్వయంతో నిర్వహించి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వేపై ఎలాంటి అపోహలకు గురికాకుండా రైతులు, భూ యజమానులు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, రికార్డుల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిరణ్ కుమార్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసరావు, వరంగల్ ఆర్డీవో సుమ, తహసిల్దార్ బి.వెంకటస్వామి, గోపనపల్లి సర్పంచ్ నాంపల్లి విజయ అశోక్, ఉపసర్పంచ్ బొట్ల శ్రీలత దేవేందర్ సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నేనెప్పుడూ పాలకుడిని కాదు.. ప్రజా సేవకుడినే



– ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

రూ. 20 లక్షలతో దీన్‌దయాళ్ నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

శాయంపేట డివిజన్ సమగ్రాభివృద్ధే లక్ష్యం

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి చేస్తా

హనుమకొండ, అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి) :

"నేనెప్పుడూ పాలకుడిని కాదు.. నిరంతరం ప్రజల మధ్య ఉండే ప్రజా సేవకుడినే. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాను" అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన క్యాంపు కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఆయన పేర్కొన్నారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31, 50వ డివిజన్ల పరిధిలోని దీన్‌దయాళ్ నగర్‌లో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు.న్యూ శాయంపేట డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..న్యూ శాయంపేట డివిజన్‌లో గత మూడేళ్లుగా అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. పూర్తి స్థాయి గ్రామీణ వాతావరణం కలిగిన శాయంపేటను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే తన ధ్యేయమని అన్నారు. గతంలో ఈ ప్రాంతంలోని కొన్ని కాలనీలకు ప్రజాప్రతినిధులు కూడా రాని పరిస్థితి ఉండేదని, వివరించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన పేదలకు 'ఇందిరమ్మ ఇళ్ల పథకం' ద్వారా రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇంకా లబ్ధి పొందాల్సిన అర్హులు ఉన్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, రాబోయే రోజుల్లో ప్రతి అర్హుడికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అక్కడికక్కడే సమస్యల పరిష్కారం

కార్యక్రమంలో కాలనీ వాసులు పలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వాటిలో కొన్నింటిపై తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్యతా క్రమంలో త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ మార్క విజయ్, మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు, నెక్కొండ కవిత కిషన్, డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్, మాజీ అధ్యక్షుడు సురేందర్, అశోక్, వెంకన్న పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉంచాలి



ప్రధాన కంపెనీల విత్తనాలు, ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువుల విక్రయాలపై ఆరా

మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి పరిశీలన

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, అక్టోబర్14 (వుదయం ప్రతినిధి):

రైతులకు వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం, జిల్లాలోని పాలకుర్తి మండలంలోని ముత్తారం గ్రామంలో గల మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, అక్కడ రైతులకు అందిస్తున్న సేవలు, విక్రయిస్తున్న వ్యవసాయ ఉత్పాదకాలు, అందుబాటులో ఉన్న పరికరాలు, విత్తన సంచులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు అవసరమైన డ్రిప్ పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారా, ఇప్పటివరకు ఎంత మంది రైతులకు డ్రిప్ పరికరాలు అందించారు? అనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్కువ నీటితో పంటలకు సమర్థవంతంగా సాగునీరు అందించేందుకు డ్రిప్ పద్ధతి ఎంతో ఉపయోగకరమని, రైతులకు ఈ పరికరాలపై అవగాహన కల్పిస్తూ వాటి వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.అలాగే, రైతు సేవా కేంద్రంలో ప్రధాన కంపెనీలకు చెందిన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయా? రైతులకు వాటిని విక్రయిస్తున్న విధానం ఎలా ఉందనే అంశాలను పరిశీలించారు. పంటల సాగుకు అవసరమైన ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు, విక్రయాల గురించి ఆరా తీశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల వ్యవసాయ రంగంలో భాగస్వాములవుతూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

ఈ పరిశీలనలో డీఏఓ అంబికా సోనీ, ఎంపీడీవో వేదవతి, ఏడీఏ అపర్ణ, ఎంపీఓ మల్లిఖార్జున, ఎంఏఓ విద్యాసాగర్, ఏఈఓ మహేష్, ఇతర సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి



తక్కువ నీటితో పండే పంటలు, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, అక్టోబర్14 (వుదయం ప్రతినిధి):

ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం, జిల్లాలోని పాలకుర్తి మండలంలోని ముత్తారం గ్రామంలో గల రైతు వేదికలో నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కింద ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదని, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. రానున్న జూన్ నెల వరకు ఈ ప్రభావం కొనసాగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వర్షపాతం తగ్గే అవకాశం..నీటి వినియోగంలో అప్రమత్తత అవసరం

జిల్లాలో సాధారణంగా సంవత్సరానికి సుమారు 900 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందని, ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు సుమారు 529 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైందని తెలిపారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందన్న వాతావరణ అంచనాలను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలి వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కంది, పెసర, వేరుశనగ వంటి పంటలతో పాటు తక్కువ నీటితో సాగు చేయగల ఇతర ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పంటల సాగు విధానాలను రైతులు పాటించాలని, శిక్షణ కార్యక్రమాల్లో అందించిన సూచనలను ఆచరణలో పెట్టాలని కోరారు.

ఉద్యానవన పంటలు, ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యత

నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతులకు దీర్ఘకాలికంగా ఆదాయం అందించే ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపాలని, అయితే ఆయిల్ పామ్ తోటల్లో తప్పనిసరిగా డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.ఉద్యానవన పంటల సాగుకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న రైతులు తమ పేర్లను ఉద్యానవన శాఖ అధికారులకు నమోదు చేసుకోవాలని, సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తారని తెలిపారు.

భూగర్భ జలాల పరిరక్షణ అందరి బాధ్యత

రైతులు నష్టపోకుండా ముందస్తు ప్రణాళికతో సాగు చేయాలి

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు నష్టాల నుంచి బయటపడవచ్చని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సలహాలను రైతులు పాటించాలని సూచించారు.రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత శాఖల అధికారులను సంప్రదించాలని, అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

వీబీ-జీ రామ్ జీ పథకం కింద పనులు చేపట్టాలి

గ్రామాల్లో భూగర్భ జలమట్టాల పెంపు, నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వీబీ-జీ రామ్ జీ పథకం కింద అవసరమైన పనులను గుర్తించి, చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఏఓ అంబికా సోనీ, ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య, ఎంపీడీవో వేదవతి, ఏడీఏ అపర్ణ, ఎంపీఓ మల్లిఖార్జున, ఆత్మా ఛైర్మన్ రాఘవ రెడ్డి, సర్పంచి అనిత, ఎంఏఓ విద్యాసాగర్, ఏఈఓ మహేష్, ఇతర సంబంధిత అధికారులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## జ్ఞానేష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలి



అఖిలపక్ష నాయకుల అక్రమ అరెస్టులు తగవు: సీపీఎం వాణిజ్య భవన్ శాఖ కార్యదర్శి బొమ్మి లక్ష్మీనారాయణ డిమాండ్

సూర్యాపేట, అక్టోబర్ 14: (వుదయం ప్రతినిధి):

ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని, అఖిలపక్ష నాయకుల అక్రమ అరెస్టులను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం వాణిజ్య భవన్ శాఖ కార్యదర్శి బొమ్మి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే జంతర్ మంతర్‌ను మూసివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలే నిరసన తెలిపే నాయకులను అరెస్టు చేయడం, ప్రజలు తమ సమస్యలను వ్యక్తం చేసుకునే వేదికలను మూసివేయడం సరైన పద్ధతి కాదన్నారు. యూపీఐ ద్వారా రూ. 2,000 కంటే ఎక్కువ మొత్తంలో చెల్లింపులు చేసినప్పుడు పన్ను విధించాలనే ప్రతిపాదనను సీపీఎం పోరాట ఫలితంగా తాత్కాలికంగా వాయిదా వేయించుకున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వాణిజ్య భవన్ శాఖ సభ్యులు త్రివేణి, ఆసిఫ్, యమునా, కన్యా నాయక్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సంక్షేమమే ధ్యేయం



– ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఉప ముఖ్య మంత్రి మల్లు బట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయీ దయానంద్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు

సత్తుపల్లి అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి) :

సత్తుపల్లి: సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను స్థానిక ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇచ్చిన మాటకు అనుగుణంగా ఆమె ఈ అంశాలను శాసనసభలో ప్రస్తావించడంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని సింగరేణి కార్మికులకు ప్రకటించిన కీలక ప్రయోజనాలు

1. లాభాల వాటా: సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల వాటా కింద రూ.1,754కోట్ల పంపిణీ, ఒక్కో కార్మికుడికి సగటున సుమారు రూ .1,53,912/లక్షలు దసరా పండుగ బోనస్ ఇస్తున్నారు అని పేర్కొన్నారు.
2. కాంట్రాక్టు కార్మికులకు బోనస్: కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 ఆర్థిక ప్రయోజనం అందించనున్నట్లు తెలిపారు.
3. సొంత ఇంటి కల: ప్రతి కార్మిక కుటుంబానికి ఇంటి స్థలం కల్పించాలన్న డిమాండ్‌పై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.
4. పన్ను మినహాయింపు: అధికారులకు వర్తించే పెర్క్విజిట్స్ పన్ను మినహాయింపు సౌకర్యాన్ని కార్మికులకు కూడా వర్తింపజేసే అంశంపై నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.
5. మారుపేర్ల సమస్య పరిష్కారం: ఏళ్ల తరబడి కార్మికులను ఇబ్బంది పెడుతున్న మారుపేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.
6. డిస్మిస్ అయిన కార్మికులకు ఉపశమనం: ఉద్యోగాల నుంచి తొలగించబడిన కార్మికులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా తిరిగి ఉద్యోగంలోకి వచ్చే అవకాశం కల్పించే అంశంపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.
7. పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాలు: , డిపెండెంట్ ఉద్యోగాల నియామక పత్రాలను 15 రోజుల్లో పంపిణీ చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.
8. వైద్య సేవల మెరుగుదల: కార్మికులను ఇతర ప్రాంతాలకు తిప్పకుండా ఏరియా ఆసుపత్రుల్లోనే మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియ నిర్వహించేలా, ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ స్థాయికి అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.
9. క్వార్టర్లు, కాలనీల అభివృద్ధి: డిటైల్ క్వార్టర్ల ఆధునీకరణతో పాటు నెహ్రూ హౌసింగ్ కాలనీ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

కార్మికుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు

సింగరేణి కార్మికుల సమస్యలను కేవలం సభలో ప్రస్తావించడానికే పరిమితం కాకుండా, వాటి పరిష్కారం కోసం కార్మికుల చెమట బొట్టుకు తగిన విలువ లభించేలా, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేలా, భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సింగరేణి కార్మికులకు ప్రయోజనం చేకూర్చాలని ఆయన ఆకాంక్షించారు.

## బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల జన్మోత్సవం



50 మంది బాలింతలకు బేబీ కిట్ల పంపిణీ

ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్14-(వుదయం) :

జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి పాలేటి ప్రమీలా గారి ఆధ్వర్యంలో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల జన్మోత్సవం (బేటీ జన్మోత్సవం) కార్యక్రమాన్ని బుధవారం ఖమ్మం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతా శిశు కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ శ్రీజా గారు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆడపిల్లలకు జన్మనిచ్చిన 50 మంది బాలింతలకు బేటీ జన్మోత్సవం కిట్లను పంపిణీ చేశారు.ఈ కిట్లలో ఆడపిల్లలకు అవసరమైన దుస్తులు, టవల్స్, ఇతర నిత్యావసర వస్తువులతో పాటు పండ్లను కూడా అందించారు. ఆడపిల్లల జననాన్ని గౌరవిస్తూ, వారి పట్ల సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడం, బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారతపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఆడపిల్లలు కుటుంబానికి, సమాజానికి గర్వకారణమని, బాలికల జననాన్ని ఆనందంగా స్వాగతించాలని, బాలికలకు సమాన అవకాశాలు కల్పిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. బాలికల పట్ల వివక్షను తొలగించి, వారి ఆరోగ్యం, విద్య, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు గారు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ గారు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ ఎస్.డి. సమ్రీన్ (S.D. Samreen), జెండర్ స్పెషలిస్టులు పి. ప్రమీలా, ఆర్. వాసంతి, ఎస్ఎఫ్ఎల్ కె. సతీష్, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ కొమినేని బాబు గారు, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ ఎన్. ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫీడర్ కాలువ పునరుద్ధరణకు రూ.125.45 లక్షలు డిఎంఎఫ్టీ నిధులు మంజూరు చేస్తాం



యాదాద్రి భువనగిరి,అక్టోబర్14 (వుదయం ప్రతినిధి ):

చెరువులకు నీటి సరఫరా పునరుద్ధరించి రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట మండలం, చోళ్లేరు గ్రామ పరిధిలోని కాన్లకుంట చెరువుకు నీటిని అందించే ఫీడర్ కాలువను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫీడర్ కాలువకు గండి పడటంతో చెక్‌డ్యామ్ నుంచి వచ్చే నీరు చెరువులకు చేరకుండా వృథాగా వాగులోకి వెళ్లిపోతున్న పరిస్థితిని పరిశీలించారు. కాలువ పునరుద్ధరణకు అవసరమైన రూ.125.45 లక్షల నిధులను డిఎంఎఫ్టీ కింద మంజూరు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.యాదగిరిగుట్ట నుంచి వాగు ద్వారా ప్రవహించే నీరు చోళ్లేరు గ్రామంలోని చెక్‌డ్యామ్ నుంచి ఫీడర్ కాలువ ద్వారా ఐదు గొలుసుకట్టు చెరువులకు చేరాల్సి ఉంది. చోళ్లేరు గ్రామంలోని కాన్లకుంట, మర్రిగూడెం గ్రామంలోని దేవతల చెరువు, మహబూబపేట గ్రామంలోని పటేల్ చెరువు, మోటకొండూరు గ్రామంలోని ఊర చెరువు, చింతల చెరువులకు ఈ కాలువ ద్వారా నీరు అందాల్సి ఉంది. అయితే, ఫీడర్ కాలువ దెబ్బతినడంతో నీరు చెరువులకు చేరకుండా తిరిగి వాగులో కలుస్తూ వృథా అవుతోంది. ఈ ఫీడర్ కాలువ పునరుద్ధరణ ద్వారా చోళ్లేరు, మర్రిగూడెం, మహబూబపేట, మోటకొండూరు గ్రామాల పరిధిలోని ఐదు గొలుసుకట్టు చెరువులకు నీటి సరఫరా మెరుగుపడటంతో పాటు మొత్తం 292.20 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సౌకర్యం కలగనుంది.

ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన రైతులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి, ఫీడర్ కాలువ పునరుద్ధరణ పనులను త్వరితగతిన చేపట్టాలని కోరారు. రైతుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, కాలువ పునరుద్ధరణకు అవసరమైన నిధులను DMFT కింద మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు ఫీడర్ కాలువ పునరుద్ధరణ పనులు పూర్తయితే ఐదు గొలుసుకట్టు చెరువులకు నీరు చేరి, ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగడంతో పాటు భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్‌కు రైతులు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వెట్టిచాకిరీ బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనకు విస్తృత అవగాహన కల్పించాలి




జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి: అక్టోబర్ 14(వుదయం జిల్లా ప్రతినిధి):

వెట్టిచాకిరీ, బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల పరిరక్షణ, వెట్టిచాకిరీ, బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన స్వేచ్ఛా గమనం ప్రచార రథాన్ని జిల్లా కలెక్టర్ ఐడిఓసి కార్యాలయంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పని చేయు ప్రదేశాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, ముందస్తు రుణాలు, అప్పుల పేరుతో వారిని బలవంతంగా పనిలో కొనసాగిస్తూ వెట్టిచాకిరీ చేయించడం వంటి అమానవీయ విధానాలను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి కార్మికుడికి స్వేచ్ఛగా పనిచేసే హక్కుతో పాటు, తాను చేసిన పనికి సకాలంలో వేతనం పొందే హక్కు ఉందని స్పష్టం చేశారు. మీ పని.మీ జీతం. మీ స్వేచ్ఛ అనే నినాదంతో చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలు, పారిశ్రామిక ప్రాంతాలు, నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు వారి హక్కులు, చట్టపరమైన రక్షణలు, వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు., కార్మికుల గుర్తింపు పత్రాలు, వ్యక్తిగత వస్తువులను బలవంతంగా స్వాధీనం చేసుకున్నా సంబంధిత అధికారులు, హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధిత కార్మికులకు అవసరమైన సహాయం అందించేందుకు 08069434343 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్మికుల స్వేచ్ఛకు, హక్కులకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. వెట్టిచాకిరీ రహిత జిల్లాగా జయశంకర్ భూపాలపల్లిని తీర్చిదిద్దేందుకు అధికారులు, పౌరసమాజ సంస్థలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వెట్టి చాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేపించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కార్మిక శాఖ అధికారి వినోద, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి, వ్యవసాయ అధికారి బాబురావు, ఎఫ్ఎంఎస్సెస్ ఎన్జీవో కో ఆర్డినేటర్ల ఇక్బాల్ పాషా, క్లస్టర్ కో ఆర్డినేటర్లు ప్రసాద్, ప్రదీప్, రాకేష్ పునరావాస కో ఆర్డినేటర్ నరసింహ స్వామి పాల్గొన్నారు

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ ఆక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి):**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 15, 16 తేదీల్లో ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో వివరాలు తప్పుగా ఉన్నవారు సవరణలు చేయించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు (BLOలు) ఈ రెండు రోజులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. కొత్తగా పేరు నమోదు, పేరు తొలగింపు, చిరునామా మార్పు, ఇతర వివరాల సవరణలకు సంబంధించి అవసరమైన దరఖాస్తులను సమర్పించవచ్చని పేర్కొన్నారు.

ప్రత్యేక నమోదు కార్యక్రమంలో భాగంగా సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్లు (BLAలు) కూడా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు.BLOలు, BLAల సమక్షంలో ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి, అవసరమైన సవరణలను గుర్తించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కోరారు. అర్హులైన వారెవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.

## ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు సగటున 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలి

- ఉపాధి పనుల అమలులో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి):-**



కామారెడ్డి జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు ఉపాధి కల్పన, మేట్ ల నియామకం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 90 రోజుల వేతన ఉపాధి కల్పన, రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కొత్త అంచనాల తయారీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉపాధి పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి గ్రామ పంచాయతీలో రోజువారీగా సగటున 60 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీలు, ఆవాసాల్లో ఉపాధి పనులు ప్రారంభించి, పని కోరే కుటుంబాలకు నిరంతరం ఉపాధి కల్పించాలని సూచించారు. అధికారులు సమయపాలన పాటించాలి క్షేత్రస్థాయి సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదనపు కార్యక్రమ అధికారులు, ఇంజినీరింగ్ సలహాదారులు, సాంకేతిక సహాయకులు ప్రతిరోజూ ఉదయం 8 గంటలకల్లా విధులకు హాజరై, గ్రామాల్లో పనులు జరుగుతున్న ప్రదేశాలను సందర్శించి పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్ర సహాయకులు, మేటీలు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకల్లా విధుల్లో చేరి, కూలీలను సమీకరించి ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు.ఉపాధి కల్పనలో వెనుకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి ఉపాధి పనుల్లో కూలీల హాజరు తక్కువగా నమోదవుతున్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో వెనుకబడిన మండలాల పనితీరును సమీక్షించి, అవసరమైన చోట అధికారుల నుంచి వివరణ కోరాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల వేతన ఉపాధి కల్పించే అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉపాధి పనులు కల్పించేందుకు అవసరమైన కొత్త అంచనాలను త్వరితగతిన రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల గుర్తింపు, అంచనాల తయారీ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఉపాధి పనుల అమలును మరింత మెరుగుపరిచి, ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు సగటున 60 మంది కూలీలకు ఉపాధి కల్పించే లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమయపాలన పాటిస్తూ కూలీల సమీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ అధికారి విజయ్ పాల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, సీఈఓ చందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన సాగాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

**నిర్మల్ జిల్లా ఆక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి):**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను బుధవారం కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన కళాశాల పరిసరాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి, కళాశాల ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కళాశాలకు సంబంధించి, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సంఖ్య అడిగి తెలుసుకున్నారు.

ప్రణాళిక ప్రకారం విద్యా సంవత్సర సిలబస్ పూర్తి చేయాలన్నారు. నర్సింగ్ వృత్తి అంటే ప్రజలకు నిస్వార్థ సేవ అందించడమని, విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించాలన్నారు. చదువు పూర్తి కాగానే వారు నర్సింగ్ వృత్తిలో స్థిరపడేలా తీర్చిదిద్దాలన్నారు. ప్రాక్టికల్ విద్యాబోధన మెరుగ్గా అందించేలా దృష్టి సారించాలని సూచించారు.

కళాశాలలో పలు మౌలిక వసతుల అవసరాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తేగా.. స్పందించిన కలెక్టర్ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.

ఈ తనిఖీలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ మంజుల, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డును సందర్శించిన ఆర్డీడీఎం పద్మావతి



- ఘన స్వాగతం పలికి సన్మానించిన చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 14:**

వరంగల్ మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకురాలు (ఆర్డీడీఎం) పద్మావతి బుధవారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఆమెకు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్ కమిటీ సభాభవనంలో శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ పర్యటనలో భాగంగా మార్కెట్ యార్డులో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పంటల కొనుగోలు ప్రక్రియ, మార్కెట్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై పద్మావతి చైర్మన్, సంబంధిత అధికారులతో సమీక్షించారు. యార్డుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## ఈ నెల 15, 16 తేదీల్లో ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమం

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**జగిత్యాల అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి)**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జాబితాలోని వివరాల్లో తప్పులు ఉన్నవారు సవరణలు చేయించుకోవాలని సూచించారు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని అర్హులైన వారెవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు పేరు తొలగింపు చిరునామా మార్పు ఇతర వివరాల సవరణలకు సంబంధించి అవసరమైన దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు ప్రజలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సంప్రదించి ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని అధికారులు సూచించారు జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓఎస్) రెండు రోజులూ తప్పనిసరిగా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లను పరిశీలించుకోవాలని సూచించారు సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్లు ( బి ఎల్ ఏ ఎస్) కూడా ప్రత్యేక ప్రచార రోజుల్లో పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు బిఎల్ఓ



లు బిఎల్ఎ ల సమక్షంలో ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి అవసరమైన సవరణలను గుర్తించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని ఓటర్లు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ కోరారు

## రీ సర్వే ద్వారా భూ సమస్యల శాశ్వత పరిష్కారం

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

**మంచిర్యాల /అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి)**





ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలం చందనాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మండల తహసిల్దార్, బివిభాగం పర్యవేక్షకులు, లక్షెట్టిపేట మండలం లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఎ.డి., మండల తహసిల్దార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ భూ రికార్డుల వివరాలను పరిశీలించడం, సంబంధిత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. భూముల రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, గ్రామస్థుల భాగస్వామ్యంతో సర్వే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పాత భూ రికార్డులలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, భూముల విస్తీర్ణం, హద్దులు, యాజమాన్య వివరాలకు సంబంధించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. రీసర్వే ద్వారా ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో కొలిచి, హద్దులను సాంకేతిక పరికరాల సహాయంతో వాస్తవ విస్తీర్ణాన్ని నిర్ధారించి సంబంధిత రికార్డులు, మ్యాపులను సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల సరిహద్దులలో ప్రభుత్వ భూములు, ఇతర భూముల ఆక్రమణలకు సంబంధించిన సమస్యలను రీసర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రీసర్వే నిర్వహించే తేదీకి సంబంధించి భూయజమానులకు ముందుగానే నోటీసులు అందజేయడం జరుగుతుందని, నోటీసులో పేర్కొన్న తేదీన భూయజమానులు తప్పనిసరిగా తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని, వాస్తవ హద్దులను సర్వే సిబ్బందికి చూపించి, రికార్డులలో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణాన్ని పరిశీలించుకోవాలని తెలిపారు. తద్వారా భూముల హద్దుల విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించడంతో పాటు, భూముల యాజమాన్య వివరాలను స్పష్టంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ప్రయాణం వద్దు ఆర్టీసీ ప్రయాణం ముద్దు

- డిఎం కె. వి. రాజశేఖర్.

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి )**



అసిఫాబాద్ ఆర్‌టీసీ డిపో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ఎంక్వైరీ ఫోన్ నంబర్ ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కె. వి. రాజశేఖర్ తెలిపారు. ఆసిఫాబాద్ డిపో పరిధిలోని ప్రయాణికులకు మరింత మెరుగైన, వేగవంతమైన సమాచారాన్ని అందించడానికి డిపో యాజమాన్యం ప్రత్యేక బస్ స్టేషన్ ఎంక్వైరీ (విచారణ) ఫోన్ నంబర్ 9493282510 ను అందుబాటులోకి తెచ్చినట్లు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు.వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల వేళలు, సర్వీసుల వివరాలు, రిజర్వేషన్ సమాచారం కోసం ప్రయాణికులు ఈ ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.విచారణ ఫోన్ నంబర్ ఉదయం 04:00 గంటల నుండి రాత్రి 11:00 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రమాదాల బారిన పడకుండా, సురక్షితమైన, సౌకర్యవంతమైన ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని డిపో మేనేజర్ కోరారు. "ప్రైవేటు వాహనాల ప్రయాణం వద్దు ఆర్టీసీ బస్సు ప్రయాణం ముద్దు" అన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ధాన్యం కొనుగోళ్లు సజావుగా చేయాలి
- కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి
- గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441
- ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై పీఏసీఎస్ సెక్రటరీలు, ఐకేపీ, మెప్మా కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ శాఖ అధికారులు, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లతో సన్నాహక సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ -14**



రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులు, పీఏసీఎస్ సెక్రటరీలు, ఐకేపీ, మెప్మా కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ శాఖ అధికారులు, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లతో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441గా మద్దతు ధర ఉందని వెల్లడించారు. బీపీటీ 5204, ఆర్ ఎన్ ఆర్ 15408, హెచ్ ఎం టీ సోన, జై శ్రీరామ్, కే ఎన్ ఎం 1638, కే ఎన్ ఎం 7715, డబ్ల్యూ జీ ఎల్ 44 సన్న వడ్ల రకాలకు ప్రభుత్వం క్వింటాలుకు అదనంగా రూ. 500 ఇస్తుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో రేపటి నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగునీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. నిబంధనల మేరకు రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. రైతులకు టోకెన్లు ఇవ్వాలని, దాని ప్రకారం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఈ సారి ధాన్యం తరలించే అన్ని వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ఉంటుందని తెలిపారు. దీంతో వాహనాలు ఎక్కడ ఉన్నా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. యాసంగి సీజన్లో ధాన్యం కొనుగోలు సజావుగా పూర్తి చేసేందుకు సహకరించిన ఆయా శాఖల అధికారులు సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఈ సీజన్లో రైతులకు ఉత్తమ సేవలు అందించి.. కొనుగోళ్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ మేనేజర్ గోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, సహకార అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి

**పెద్దపల్లి, అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి)**



వచ్చే వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వచ్చే వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ వినియోగం, గరిష్ఠ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సంబంధించి భూ కేటాయింపులు, భూసంబంధిత సమస్యలు ఏవైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన భూముల కేటాయింపును త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే కేటాయించిన భూములకు సంబంధించి రికార్డుల సవరణలు అవసరమైతే వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని, సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వచ్చే వేసవిలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, అవసరమైన చోట్ల పాత ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, విద్యుత్ పరికరాలు, ఇతర అవసరమైన సామగ్రిని ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు నిర్వహణ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన సిబ్బంది,

సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

వేసవి ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా అధికారులు కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ ఈ గంగాధర్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాసన వ్యవస్థ మరియు విధి విధానాల మీద శిక్షణ కార్యక్రమాలు చేపట్టండి.

- సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

న్యూఢిల్లీ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ని వారి అధికారిక నివాసంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తో కలిసి సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు సమావేశమయ్యారు.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న చట్టసభ సభ్యులకు శాసన వ్యవస్థపై సరైన అవగాహన కల్పించేందుకు, శాసనసభా విధివిధానాలపై శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ఓం బిర్లా ని కోరారు. తద్వారా శాసన వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని సూచించారు.సానుకూలంగా స్పందించిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా , ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## కలెక్టరేట్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- గౌరీమాతకు పూజలు నిర్వహించిన కలెక్టర్

**నిజామాబాద్, అక్టోబర్ 14 :**

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో టీఎన్జీఓ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఈ ఉత్సవంలో భాగస్వాములయ్యారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని గౌరీమాతకు, రంగురంగుల పూలతో ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసిన బతుకమ్మలకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ ప్రాధాన్యతను చాటాయి. బతుకమ్మ గేయాలను ఆలపిస్తూ మహిళా ఉద్యోగులు, యువతులు, మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆటలాడుతూ ఎంతో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. దాండియా, కోలాటాలతో బతుకమ్మ సంబురానికి వన్నె చేకూర్చారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యాలయ పనివేళలు ముగిసినప్పటికీ ఉద్యోగినులు ఎవరూ ఇళ్లకు వెళ్లకుండా ఎంతో హుషారుగా ఈ ఉత్సవంలో పాల్గొని బతుకమ్మ వేడుక ఔన్నత్యాన్ని చాటారు. ఉత్తమ అలంకరణతో కూడిన బతుకమ్మలను ఎంపిక చేసి, బహుమతులు అందజేశారు.



ఈ ఉత్సవాల్లో టీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

- సర్వసభ్య సమావేశంలో 18 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 14:**



విద్యార్థులు, యువతకు పోటీ పరీక్షల సన్నద్ధతలో గ్రంథాలయాలు ఉపయోగపడేలా మౌలిక వసతులు, పుస్తకాలు, డిజిటల్ సదుపాయాలను మెరుగుపరుస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ మల్లెపూల నర్సయ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 18 అంశాలను చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. జైనథ్, తలమడుగు శాఖా గ్రంథాలయ భవనాల నిర్మాణానికి నిధుల ప్రతిపాదనలను ఆమోదించారు. జైనథ్, గుడిహత్నూర్ గ్రంథాలయాలకు కేటాయించిన స్థలాలకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. పౌర పఠన మందిరాల ఏర్పాటుకు చేసిన రూ.3,83,287 వ్యయాన్ని ఆమోదించడంతోపాటు, సామగ్రి కొనుగోలుకు రూ.8 లక్షలు, వార్షిక నిర్వహణకు రూ.4 లక్షల నిధుల ప్రతిపాదనలకు అనుమతించారు.దాతల విరాళాలతో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇన్వర్టర్లు తదితర పరికరాల కొనుగోలుకు చేసిన రూ.99,921 ఖర్చును ఆమోదించారు.జిల్లాలోని ఏడు పఠనశాలలకు రూ.1,05,000 విలువైన నిధులు, సామగ్రి అందించే అంశాన్ని పరిశీలించారు. బోథ్ శాఖా గ్రంథాలయానికి దాత అందించనున్న 300 గజాల స్థలం రిజిస్ట్రేషన్, ఇతర ఖర్చులను పరిశీలించి, నిబంధనల ప్రకారం చెల్లింపులు చేపట్టేందుకు కార్యదర్శికి అనుమతించారు. గ్రంథాలయాలను కేవలం పుస్తక పఠన కేంద్రాలుగా కాకుండా విద్యార్థులు, యువతకు జ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని చైర్మన్ పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, ప్రశాంతమైన పఠన వాతావరణం, డిజిటల్ వనరులు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

సమావేశంలో డీఈఓ మాధవి, డీపీఓ రమేష్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. సురేష్‌బాబు, డిప్యూటీ లైబ్రేరియన్ కృతిన్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు

- అమ్మవారి సేవలో పాల్గొన్న మంత్రి అడ్లూరి

**ధర్మపురి అక్టోబర్14 (వుదయం ప్రతినిధి):**



ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు 4వ రోజు వైభవంగా సాగుతున్నాయి. అనుబంధ ఆలయమైన శివాలయంలో అమ్మవారు కూష్మాండ శాకాంబరి రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు పాలేపు.ప్రవీణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో సప్తశతీ, చండీ, దేవిభాగవత పారాయణాలు నిర్వహించారు.ఈ వేడుకల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించు కుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో దేవ స్థాన ఈఓ సంకటాల శ్రీనివా స్,సూపరిండెంట్ అల్వాల్. శ్రీనివాస్ పాల్గొన్నారు. సాయంత్రం పురవీధుల్లో శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు సేవ నిర్వహించారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## మక్తల్ నారాయణపేట కొడంగల్
## ఎత్తిపోతల పథకం భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి)**

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక రెవెన్యూ అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి తహసీల్దార్లతో భూసేకరణ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూసేకరణకు సంబంధించి రైతులతో ఉన్న సమస్యలను గుర్తించి, వారితో చర్చించి పరిష్కార మార్గాలను ఖరారు చేయాలని సూచించారు. భూసేకరణకు అనువైన భూములను గుర్తించి, అవసరమైన ప్రతిపాదనలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించే అవకాశం ఉన్నందున, భూములకు సంబంధించిన రికార్డులు, వివరాలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. రేడియల్ రోడ్డు భూసేకరణ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, క్షేత్రస్థాయిలో సంబంధిత బృందాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రహదారి పనులకు ఆటంకం కలగకుండా పెండింగ్ సమస్యలను పరిష్కరించి, పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు.

అలాగే, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అవార్డులు, పరిహారం చెల్లింపులు, సర్వేకు సంబంధించిన అంశాలను సమీక్షించి, అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. భూసేకరణ పనుల పురోగతిపై వచ్చే వారం మరోసారి సమీక్ష నిర్వహిస్తామని, అప్పటిలోగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులకు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆర్డీవో రమేష్, ఏవో అనిల్ కుమార్, ల్యాండ్ సర్వే ఏడీ వేణుగోపాల్ రెడ్డి, నారాయణపేట, ఉట్కూర్, దామరగిద్ద, మద్దూరు, గుండుమల్ , కోస్గి మండలాల తహసీల్దార్లు అమరేంద్ర కృష్ణ, అశోక్ కుమార్, తిరుపతయ్య, మహేష్, భాస్కర స్వామి, కళ్యాణి, సంబంధిత రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### పేదలు, బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు
## పండుగ సాయన్న: మంత్రి వాకిటి శ్రీహరి

- **నవాబుపేటలో పండుగ సాయన్న కాంస్య విగ్రహం ఆవిష్కరణ.**

**మహబూబ్‌నగర్**

అక్టోబర్ 22న హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రభుత్వ పరంగా పండుగ సాయన్న జయంతి ఉత్సవాల నిర్వహణపేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న ఆశయాలను భావితరాలకు అందించాలని రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. పండుగ సాయన్న ఒక కులానికే పరిమితమైన నాయకుడు కాదని, సమాజంలోని అన్యాయాలు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజానాయకుడని పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలో పండుగ సాయన్న కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిజాం పాలనలో ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి భయపడే పరిస్థితుల్లోనూ పండుగ సాయన్న ధైర్యంగా దోపిడీ దొరలను, దేశ్ముక్కులను ఎదిరించి వారు దోచుకున్న సంపదను పేదలకు పంచి అండగా నిలిచారని అన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్దార్ పాపన్న, కొమురం భీమ్ వంటి పోరాట యోధులు కూడా సామాజిక అన్యాయాలు, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. మహనీయులను కులాలకు పరిమితం చేయకుండా, వారి ఆశయాలను సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.పాలమూరు గడ్డపై నవాబుపేట మండలం మెరుగోనిపల్లె లో జన్మించిన పండుగ సాయన్న తెలంగాణ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన సేవలు, త్యాగాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో నవాబుపేటలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణలో పండుగ సాయన్న తొలి కాంస్య విగ్రహాన్ని ఇక్కడ ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రకటించారు.





పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించేందుకు తాను ప్రతిపాదనలు పంపగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు రోజుల్లోనే ఆమోదం తెలిపారని మంత్రి వెల్లడించారు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత ఆయన స్ఫూర్తితో సమాజంలోని అన్యాయాన్ని ధైర్యంగా ఎదిరిస్తూ పేదలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. విగ్రహాలను ఏర్పాటు చేయడంతోపాటు మహనీయుల ఆలోచనలు, త్యాగాలను ఆచరణలో పెట్టినప్పుడే వాటికి నిజమైన సార్థకత చేకూరుతుందని అన్నారు.ముదిరాజ్ సామాజిక వర్గ అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. విద్య ద్వారా ఆర్థికంగా, సామాజికంగా ఎదిగి సమాజంలో తగిన గుర్తింపు సాధించాలని సూచించారు. కులాభిమానం ఇతర వర్గాల పట్ల వివక్షకు దారితీయకూడదని, అన్ని కులాల ప్రజలు పరస్పర సహకారంతో సమాజాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.ముదిరాజ్‌లను బీసీబీ నుంచి బీసీఏలో చేర్చే అంశంపై తన వంతు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఇప్పటికే బీసీఏలో ఉన్న మత్స్యకార వర్గాలకు నష్టం కలగకుండా, ముదిరాజ్‌లకు సముచిత రిజర్వేషన్ ప్రయోజనాలు లభించేలా ప్రయత్నిస్తానని చెప్పారు. ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి మరింత మంది ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలుగా ఎదిగేందుకు సహకరిస్తానన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సహా అన్ని బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి పండుగ సాయన్న స్ఫూర్తితో పనిచేస్తానని పేర్కొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, నవాబుపేటలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జడ్చర్ల, మిడ్జిల్, బాలానగర్ మండలాల్లోనూ పండుగ సాయన్న విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముందుగా, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా నవాబు పేట మండలానికి చేరుకున్న క్రీడలు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మండలి చైర్మన్ బండ ప్రకాష్‌లకు, మొక్కను అందజేసి, పోలీస్ గౌరవ వందనంతో స్వాగతం పలికారు.

కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్, మహబూబ్‌నగర్ నగర మేయర్ జి. మమత, నవాబుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు, జిల్లా డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, మాజీ ఎం.పి శ్రీనివాస్ రెడ్డి, నవాబుపేట మండల ప్రజాప్రతినిధులు, ముదిరాజ్, మత్స్యకార సంఘాల నాయకులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, అక్టోబర్ 14 ,వుదయం.**

ప్రపంచంలో పూలతో జరుపుకునే అరుదైన పండుగ బతుకమ్మ అని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టరేట్ రెవెన్యూ శాఖ, ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీత పాల్గొని బతుకమ్మ పూజా కార్యక్రమాలు నిర్వహించి, బతుకమ్మ ఆడారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. బతుకమ్మను తెలంగాణ ఇంటి మహాలక్ష్మిగా భావిస్తారని పేర్కొన్నారు. పండుగ విశిష్టతను చాటిచెప్పేలా ఆహ్లాదకరమైన వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని,అన్నారు . కలెక్టరేట్ లో ప్రాంగణంలో నేటినుండి అక్టోబర్ 17 వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు, యువత, మహిళా ఉద్యోగులు, మహిళలు , కలెక్టరేట్ చుట్టుపక్కల గల కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు . శాఖల వారీగా బతుకమ్మ సంబురాల నిర్వహణకు రోజువారీ షెడ్యూల్‌ను రూపొందించడం జరిగింది . వివిధశాఖలతో బతుకమ్మ సంబురాలు ఈ నెల 17 వరకు కలెక్టరేట్ ప్రాంగణంలో పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు ,మహిళలా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.



## గద్వాలలో పోలీసుల మెరుపు తనిఖీలు!

- **ఫ్లైఓవర్‌పై వాహనాల పరిశీలన.. స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ**

**గద్వాల, అక్టోబర్ 14 (వుదయం బ్యూరో)**

పట్టణంలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు స్వయంగా రంగంలోకి దిగి ఫ్లైఓవర్‌పై తనిఖీలను పర్యవేక్షించారు. వాహనాల ధ్రువపత్రాలతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణంలోని ఫ్లైఓవర్ 'టీ' జంక్షన్, మేలచెరువు చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ప్రధాన రహదా రులు, రద్దీ కూడళ్లలో నిరంతరం నిఘా కొనసాగించాలని ఎస్పీ పోలీసు అధి కారులకు సూచించారు. తనిఖీలు సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

వాహనదా రులు హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తనిఖీలకు సహకరించాలని ఎస్పీ కోరారు. ప్రజల భద్రతే ప్రాధాన్యంగా పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం చేయాలి

- **కోమటి చెరువు వద్ద పారిశుధ్య లోపాలపై తీవ్ర ఆగ్రహం**
- **టూరిజం అధికారిని కలెక్టరేట్‌కు పిలిపించిన కలెక్టర్**
- **క్షేత్రస్థాయిలో చెరువులు, ఘాట్ల పరిశీలన**

**సిద్దిపేట (బ్యూరో), అక్టోబర్ 14 (వుదయం బ్యూరో)**





తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సిద్దిపేట పట్టణ పరిధిలోని కోమటి చెరువు, ఎర్రచెరువు, మచ్చవానికుంట, నర్సాపురం చెరువు, రంగదాంపల్లి చెరువుల వద్ద సద్దుల బతుకమ్మ వేడుకల ముందస్తు ఏర్పాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో కంటే ఈ ఏడాది బతుకమ్మ వేడుకలను మరింత అంగరంగ వైభవంగా నిర్వహించాలని సూచించారు. కోమటి చెరువు వద్ద పారిశుధ్య నిర్వహణ లోపభూయిష్టంగా ఉండడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులైన టూరిజం డిపార్ట్‌మెంట్, నిర్వహణ ఇన్చార్జులపై మండిపడ్డారు. వెంటనే కలెక్టరేట్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని టూరిజం అధికారిని హెచ్చరించారు. సద్దుల బతుకమ్మ నాటికి పారిశుధ్యంతో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, టూరిజం మరియు మున్సిపల్ అధికారులు సమన్వయంతో పగడ్బందీగా పనిచేయాలని స్పష్టం చేశారు. చెరువుల వద్ద మహిళలు, పిల్లలు ప్రమాదవశాత్తూ లోపలికి వెళ్లకుండా సైన్ బోర్డులు పెట్టాలని, ప్లాస్టిక్ సీసాలు పడేయకుండా డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని, ప్రతిరోజూ మహిళలు వేసే చిన్న బతుకమ్మల వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు.

వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రోడ్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని, నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, లైటింగ్, వైద్య సదుపాయాలు, అత్యవసర సేవలు అందుబాటులో ఉంచాలని పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కలెక్టర్ వెంట మున్సిపల్ డిఈ ప్రేరణ, మున్సిపల్ సిబ్బంది, పోలీసు అధికారులు, స్థానిక వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

### వాసవీ ఆలయంలో అన్నపూర్ణా దేవి అలంకారంలో
## కొలువుదీరిన అమ్మవారు - భక్తులకు అన్నప్రసాద వితరణ

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 14 (వుదయం బ్యూరో)**

జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు బుధవారం నాడు అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అన్నపూర్ణా దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.ఉదయం ఆలయ అర్చకులు జోషి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆర్యవైశ్య దంపతులకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గణపతి పూజతో ప్రారంభించి ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.అనంతరం గణపతి, సుబ్రహ్మణ్య, దుర్గా, సరస్వతి, లక్ష్మీ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి చేపట్టారు. సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణ అనంతరం అమ్మవారికి మహా నీరాజనం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు ,అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నపూర్ణా దేవి అలంకారాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.సాయంకాలం ఆలయం నుండి సద్దుల బతుకమ్మను మహిళలు ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన దాండియా నృత్య కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో దాండియాలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ



ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బిళ్లకంటి హరిబాబు, వాసవీ ఆలయ అధ్యక్షుడు అంజయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తిలో ఐడీఓసీ బతుకమ్మ వేడుకలు

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక: అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్**

**నపర్తి అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి)**

ఐడీఓసీ ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు* వనపర్తి జిల్లా ఐడీఓసీ ప్రాంగణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలకు ప్రాధాన్యతనిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలను భావి



తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఆనందోత్సాహాలను నింపడంతో పాటు కుటుంబాలు, సమాజం మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తుందని అన్నారు. ప్రకృతితో మమేకమై, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను చాటిచెప్పే ఈ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పే ఇలాంటి పండుగలను ప్రభుత్వ శాఖల సిబ్బంది సమష్టిగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న మహిళలు పండుగ సంబరాలను మరింత సందడిగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బహుజన బతుకమ్మను విజయవంతం చేయండి

- **ఈ నెల 17న రాయపోల్‌లో నిర్వహణ.. ముఖ్య అతిథిగా విమలక్క**
- **గ్రామీణ ఉపాధి, స్వయం సమృద్ధి.. జెన్ జీ ఆకాంక్షలే ఈసారి బహుజన బతుకమ్మ ఇతివృత్తం**

**దౌల్తాబాద్ అక్టోబర్ 14 (వుదయం):**



ఈ నెల 17న సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో నిర్వహించనున్న బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బోనాల స్వామి, కార్యదర్శి సూరంపల్లి మహేందర్ మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రజల ఆత్మగౌరవంతో ముడిపడిన పండుగ అని పేర్కొన్నారు. పంటల సమృద్ధిని ప్రతిబింబించే పండుగగా కూడా బతుకమ్మకు ప్రత్యేకత ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రజల ఆకాంక్షలను చాటిన బతుకమ్మ.. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం కూడా ప్రజా సమస్యలను ప్రతిబింబిస్తూ సాంస్కృతిక ఉద్యమంగా కొనసాగుతోందని వివరించారు.ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగత పదిహేనేళ్లుగా బహుజన బతుకమ్మ వివిధ సామాజిక, పర్యావరణ, ప్రజా సమస్యలను తన వేదికగా చేసుకుందని నాయకులు తెలిపారు. నల్లమలలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా, దామగుండం అడవుల పరిరక్షణ కోసం, వెలివాడలు కూడా గ్రామాల్లోని ప్రధాన వాడలతో సమానంగా గౌరవం పొందాలనే లక్ష్యంతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ వచ్చిందన్నారు. పదహారో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న బహుజన బతుకమ్మ ఈసారి 'గ్రామీణ ఉపాధి - స్వయం సమృద్ధి - జెన్ జీ ఆకాంక్షలు' అనే ఇతివృత్తంతో రాష్ట్రవ్యాప్తంగా సాంస్కృతిక, ప్రజా ఉద్యమానికి పిలుపునిస్తోందని పేర్కొన్నారు.ఉపాధి కల్పన.. ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యంఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు చెరువులు, కుంటల పునరుద్ధరణ చేపట్టి శాశ్వత నీటి వనరులను అభివృద్ధి చేయాలని నాయకులు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించడంతో పాటు అవినీతి, నిరుద్యోగం, అధిక ధరలకు వ్యతిరేకంగా ప్రజలు గొంతెత్తాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్య రంగాలు ప్రభుత్వ నిర్వహణలో ఉండాలనే డిమాండ్‌తో ముందుకు సాగుతున్న యువతకు, ముఖ్యంగా జెన్ జీ తరానికి సంఘీభావంగా నిలవాలని అన్నారు. 'వెలివాడలు కాదు.. తొలివాడలు' అనే నినాదంతో కుల, సామాజిక వివక్షలకు తావులేకుండా గ్రామీణ ప్రజలంతా ఐక్యంగా బతుకమ్మ ఆడాలని, పాడాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వనరులను కాపాడే బహుజనుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, వాటిని కొల్లగొట్టే బహుళజాతి సంస్థల విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నెల 17న రాయపోల్‌లో జరిగే బహుజన బతుకమ్మ కార్యక్రమానికి ప్రముఖ ప్రజా గాయని విమలక్క ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుడుం స్వామి, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టీయూఎఫ్) నాయకుడు మేకల రాములు, వివిధ సంఘాల నాయకులు కె. మహేందర్, బాలన్న, కుమార్, యాదగిరి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాగ్న నది జలాలను ఉద్దండరావ్ చెరువు లోకి వదలాలి

- **ఎమ్మెల్యేను కోరిన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు భీమప్ప**
- **యాలాల అక్టోబర్ 14 వుదయం ప్రతినిధి :-**

కాగ్న నది జలాలను జుంటుపల్లి వద్దం టారావు చెరువులోకి వదిలే విధంగా చర్యలు తీసుకోవాలని యాలాల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు భీమయ్య ఎమ్మెల్యే మనో రెడ్డిని కోరారు. బుధవారం యాలా ల మండల పరిధి లోని జుంటుపల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సమావేశంలో భీమయ్య వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమావేశంలో మాట్లాడుతూ కాగ్న నది నీరు కొడంగల్ వెళుతుంది అని తెలిపారు. ఆ పంపుల ద్వారా వచ్చే నీటిని యాలాల మండలం బండమీదిపల్లి వద్ద పైపుల ద్వారా నీటిని ఉద్దండరావు చెరువు నింపాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు.

ఉద్దడారా వు చెరువు నింపితే రైతులకు పంట సాగు చేసుకోవడానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే నీటిని వదిలే విధంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో రైతులందరూ సంతోషం వ్యక్తం చేశారు.

## హక్కులు మిమ్మల్ని కాపాడే కవచం లాంటిది

- **లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్**

**నారాయణపేట అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి)**



నారాయణపేట పట్టణం భారం భావి దగ్గర చిల్డ్రన్స్ హోమ్ లో జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ సీనియర్ సివిల్ జడ్జి ఆధ్యక్షన అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిచారు .ఈ కార్యక్రమంలో న్యామూర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పాటిస్తున్నాము . బాలికల శక్తిని గుర్తించడానికి, వారి హక్కుల కోసం వాదించడానికి, ప్రతి ఒక్క బాలిక ఎదగడానికి, నేర్చుకోవడానికి,సురక్షితమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి అవకాశం ఉండేలా చూసుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. మీరు బలవంతులు, మీరు విలువైన వారు, మీ భవిష్యత్తు అపరిమితమైనది ఎందుకంటే, అబ్బాయిలు, అమ్మాయిలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసి సరైన దాని కోసం నిలబడినప్పుడే అమ్మాయిలకు సురక్షితమైన ప్రపంచం నిర్మించబడుతుంది. విద్యార్థుల హక్కులను తెలిపారు.చట్టం మీకు ప్రత్యేక రక్షణ కల్పిస్తుందని మీకు తెలుసా? హక్కులు మిమ్మల్ని కాపాడే ఒక అదృశ్య కవచం లాంటివి అన్నారు.మీలో ప్రతి ఒక్కరికీ పాఠశాలకు వెళ్ళడానికి, పుస్తకాలు చదవడానికి, ప్రశ్నలు అడగడానికి నేర్చుకోవడానికి హక్కు ఉంది. విద్య మీ అద్భుత శక్తి. దానిని మీ నుండి ఎవరూ తీసివేయలేరు.అమ్మాయిలకు అబ్బాయిలతో సమానమైన హక్కులు ఉన్నాయి. డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, క్రీడా ఛాంపియన్లు లేదా శాస్త్రవేత్తలు కావాలని కలలు కనే హక్కు మీకు ఉంది, ఆ కలలను సాకారం చేసుకునే హక్కు కూడా మీకు ఉంది. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్ , లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె. లక్ష్మిపతి గౌడ్, మీనాక్షి, హసీనా బేగం సిడిపిఓ, శివలీల చిల్డ్రన్స్ హోమ్ సూపర్డెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది రాజవర్ధన్ రెడ్డి మృతికి పేట
## బార్ అసోసియేషన్ సంతాపం



**నారాయణపేట టౌన్ అక్టోబర్ 14 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట కోర్టులో సీనియర్ న్యాయవాది కోట్ల రాజవర్ధన్ రెడ్డి అకాల మృతి పట్ల బుధవారం నారాయణపేట కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

తోటి న్యాయవాది అకాల మరణం ఎంతో భాదను కల్గించింది అని పేర్కొన్నారు.ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ,ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి,న్యాయవాదులు రఘువీర్ యాదవ్,సలీం,నారాయణ,అమిరొద్దిన్,విజయ భాస్కర్, నర్సింలు ,సతీష్,కుర్మన్న,భింరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పసివాడి కడియాలకూ కన్నేసిన కేటుగాడు!

- చిన్నారి కాలి నుంచి వెండి కడియం చోరీకి తెగింపు
- అడ్డంగా దొరికిన దొంగకు చెప్పుదెబ్బలు
- గద్వాల బస్టాండ్‌లో పట్టుకున్న మహిళ.. ప్రయాణికుల మధ్య కలకలం

**గద్వాల అక్టోబర్ 14 (వుదయం కరస్పాండెంట్ )**

పసిపిల్లల కాళ్లకు ఉన్న వెండి కడియాలనూ వదల్లేదు ఆ కేటుగాడు! బస్సు ఎక్కేందుకు సిద్ధమవుతున్న కుటుంబంలోని చిన్నారిని లక్ష్యంగా చేసుకుని చోరీకి తెగబడ్డాడు. చిన్నారి కాలి నుంచి ఓ వెండి కడియాన్ని తీసి, మరో కడియాన్ని కాజేసేందుకు యత్నించాడు. అతడి కదలికలను పసిగట్టిన మహిళ వెంటనే అప్రమత్తమై పట్టుకుంది. అనంతరం చెప్పుతో చితకబాదింది. ఈ ఘటన గద్వాల బస్టాండ్‌లో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. అదను చూసి.. కడియం తీసి! బస్సు ఎక్కే హడావుడిలో కుటుంబ సభ్యులు ఉండగా.. ఇదే అదనుగా భావించిన వ్యక్తి చిన్నారి కాళ్లపై దృష్టి సారించాడు. చడీచప్పుడు కాకుండా ఓ కడియాన్ని తొలగించాడు. మరో కడియాన్ని సైతం తీసేందుకు ప్రయత్నిస్తుండగా కుటుంబ సభ్యురాలు గమనించింది. వెంటనే అతడిని పట్టుకుని నిలదీసింది. చెప్పుతో కొడుతూ ప్రతిఘటించడంతో అక్కడున్న ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. దీంతో అతడు తప్పించుకోలేక పోయాడు. కడియం తిరిగి స్వాధీనంచిన్నారి కాలి నుంచి తీసిన వెండి కడియాన్ని మహిళ తిరిగి స్వాధీనం చేసుకుంది. ఈ పరిణామంతో బస్టాండ్‌లో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. రద్దీ ప్రాంతాల్లో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది.

## తెల్లాపూర్ సమీపంలో కిలో హాష్ ఆయిల్ పట్టివేత: ఇద్దరి అరెస్ట్

- మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (అక్టోబర్ 14)**



తెల్లాపూర్ సమీపంలోని ORR ఎగ్జిట్-2 సర్కిల్ న్యూ సర్వీస్ రోడ్డుపై హాష్ ఆయిల్ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులను కొల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఒక కిలో హాష్ ఆయిల్‌తో పాటు మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో ఒడిశాకు చెందిన మరో వ్యక్తి వద్ద హాష్ ఆయిల్ కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో కూలీలకు విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**నారాయణఖేడ్: అక్టోబర్ 14(వుదయం)**





నారాయణఖేడ్ మండల పరిధిలోని మద్వార్ గ్రామంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా మహిళా సమైక్య భవనాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ ను ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన కోఫూరి సునీత, కోఫూరి లక్ష్మి ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, మహిళల సాధికారత, పేద కుటుంబ బాలల మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు.మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. మహిళా సమైక్య భవనాలు మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఉపయోగపడతాయన్నారు.పేద కుటుంబాలకు సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. డబ్బులు కూడా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. మద్వార్ గ్రామంలో ఇళ్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను అభినందించారు. వరి కోతలు ప్రారంభం కాకముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు,రైతులకు ధాన్యం విక్రయంలో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే వరి కోతలు ప్రారంభం కాకముందే ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు.రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల ద్వారానే విక్రయించుకోవాలని సూచించారు.సన్నబియ్యం పంపిణీ పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు,సంబంధిత అధికారులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గాజులపల్లిలో ఘనంగా పౌష్టికాహార పంపిణీ

- గాజులపల్లిలో అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పౌష్టికాహార పంపిణీ
- గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ చిన్నారులకు తొమ్మిది రోజుల ప్రత్యేక ఆహారం అందజేత
- పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం

**దౌల్తాబాద్ అక్టోబర్ 14(వుదయం)**



చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం ఎంతో కీలకమని, పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది పడుతుందని గ్రామ సర్పంచ్ పంజ స్వామి పేర్కొన్నారు. దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం నంబర్ 1 వద్ద పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ చిన్నారులకు తొమ్మిది రోజుల ప్రత్యేక ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పంజ స్వామి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ఆహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భధారణ సమయంలో మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల తల్లితో పాటు శిశువు ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలిపారు. బాలింతలు కూడా పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అందించడం తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు.అంగన్వాడీ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో తల్లులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులకు చిన్న వయసు నుంచే మంచి ఆహారపు అలవాట్లు నేర్పించాలని, వారి ఆరోగ్యం, ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణంగా ఉపయోగించుకోవాలని, సంబంధిత సిబ్బంది గ్రామస్తులకు ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ సేవలను మరింత విస్తృతంగా అందించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నర్సింలు, అంగన్వాడీ టీచర్ పి. సరోజన, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా తల్లులు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యాన్ని వివరించారు.

## ఖానాపూర్‌లో భూ రీసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ

**మహబూబ్ నగర్:**



జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు.

జడ్చర్ల మండలం ఖానాపూర్ గ్రామంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన, శిక్షణ పొందిన రెండు రీసర్వే బృందాల సేవలను సమర్థవంతంగా వినియోగించుకొని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, మండల సర్వేయర్‌కు సూచించారు. రీసర్వే పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం గ్రామస్థులు, రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూమార్చండి రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. భూముల కొలతలను కచ్చితత్వంతో చేపట్టి, సరిహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూయజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ (LPMs) అందజేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల భూ సరిహద్దులు, రెవెన్యూ రికార్డులకు సంబంధించి భవిష్యత్తులో తలెత్తే వివాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

భూ రీసర్వే ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తయ్యేలా గ్రామస్థులు, రైతులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఎస్.ఐ.ఆర్–2026 ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

- ఓటరు నమోదు కోసం 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు

**మహబూబ్ నగర్:**



ఎస్.ఐ.ఆర్-2026లో భాగంగా ఓటర్లకు నోటీసుల పంపిణీ, విచారణల ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ), 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి జె.ఎల్.బి. హరిప్రియ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ఈ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.

**98.57 శాతం నోటీసుల పంపిణీ పూర్తి**

అక్టోబర్ 14 నాటికి ఎస్ఐఆర్-2026లో భాగంగా 98.57 శాతం నోటీసుల పంపిణీ, 91.23 శాతం విచారణలు పూర్తయ్యాయని సమావేశంలో వివరించారు. మిగిలిన విచారణలను గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

**15, 16 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు**

ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు, ఇప్పటివరకు ఓటరుగా నమోదు కానివారు, తొలిసారిగా ఓటు హక్కు పొందనున్న యువత కోసం అక్టోబర్ 15, 16 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన పౌరులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ శిబిరాల్లో బూత్ స్థాయి అధికారులు (BLOలు) తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు (BLAలు) కూడా పాల్గొని అర్హులైన ఓటర్ల నమోదుకు సహకరించాలని కోరారు.

**ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి**

ఒకే ఇంటిలో 15 లేదా అంతకంటే ఎక్కువ మంది ఓటర్లు నమోదై ఉన్న కుటుంబాల వివరాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు గుర్తిస్తే వాటిని సరిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. AERO లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను సమీక్షించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సహాయ ఎన్నికల నమోదు అధికారులకు తెలిపారు.నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కరించుకునేలా సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. అర్హులైన ఓటర్లు విచారణలకు హాజరయ్యేలా, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొనేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్-2026 ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హరిప్రియ సూచించారు.ఈ సమావేశంలో జడ్చర్ల, మిడ్జిల్, రాజాపూర్, బాలానగర్, ఊర్కొండ మండలాల తహసీల్దార్లు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు (AEROs),

జడ్చర్ల మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల అదనపు తహసీల్దార్, మండల డిప్యూటీ తహసీల్దార్, 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సదాశివపేటలో దేవి నవరాత్రుల వేడుకలు

### మమత రాజు దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం

**సదాశివపేట అక్టోబర్ 14 (వు దయం):**



సదాశివపేట: దేవి నవరాత్రుల సందర్భంగా సదాశివపేట పట్టణంలోని చాపలకేరి శ్రీ మహంకాళి మందిరంలో 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ మహంకాళి మాత అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమివ్వగా, మమత రాజు దంపతులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు రాకేష్ పంతులు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో కొనసాగాయి. కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఇట్టి సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ దేశంలో ఎలినో ప్రభావం వలన వర్షాలు పడడం లేదని, నీళ్లులేక పాడి పంటలు ఎండిపోతున్నాయని, తాగునీరు రోజు రోజుకు తగ్గిపోతుందని, అమ్మ మా దేశ ప్రజలను సుభిక్షంగా ఉంచమ్మ, వర్షాలు కురిపించమ్మా, ప్రజలను చల్లగా చూడమ్మా, కరువునుండి కాపాడమ్మా అని పులిమామిడి రాజు అమ్మవారిని వేడుకున్నారు. ఇంత భక్తితో కొలిచే నిన్ను నిమజ్జనం చేయాలంటే చెరువుల్లో నీళ్లు లేవమ్మా, కరుణించమ్మ కాపాడమ్మా, నీ యొక్క నిమజ్జనంలోపు వర్షాన్ని కురిపించి నువ్వు ఉన్నావని నిరూపించుకొమ్మని ఆ మహంకాళి మాతను, అన్న పూర్ణమాతను సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు వేడుకున్నారు. సదాశివపేట అంటేనే ఎల్లప్పుడు ఆ సదాశివుడు నివసించే ప్రాంతం అని పులిమామిడి రాజు అన్నారు. ఇక్కడ ఉన్నన్ని దేవాలయాలు ఏ గ్రామంలో లేవని అన్నారు. అనంతరం పులిమామిడి మమత రాజు దంపతుల ఆధ్వర్యంలో ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి నిర్వహించిన



భజన కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ వైద్యం గోపి ప్రియాంక పవన్ మరియు శ్రీ మహంకాళి దేవాలయ అధ్యక్షులు నల్ల సుధాకర్, ప్రధాన కార్యదర్శి నల్ల శంకర్, కార్యవర్గ సభ్యులు చాపల హన్మంతు, జనార్ధన్, బంటు రవి, సాతాని నరేందర్, మహేష్, అఖిల్, నాగరాజు, రాగం అనిల్, తాలెల్మ రాము, సోమ శంకర్ తదితరులతో పాటు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జుంటుపల్లి ఆయకట్టు రైతులకు ఊరట

- జుంటుపల్లి ప్రాజెక్టు కాల్వల ఆధునీకరణకు రూ.5.71 కోట్లు
- చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం..
- రైతుల ముఖాల్లో ఆనందం.. పొలాల్లో పచ్చదనం నింపడమే నా లక్ష్యం!

తాండూరు ఎమ్మెల్యే బుయ్యాన్ని మనోహర్ రెడ్డి

**తాండూరు, అక్టోబర్ 14 ( (వు దయం ప్రతినిధి):**



రైతుల ముఖాల్లో ఆనందం చూడటం.. పొలాల్లో పచ్చదనం నింపడమే తన లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డిఅన్నారు. రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా చేసి, చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. బుధవారం తాండూర్ నియోజకవర్గ యాలాల మండలంలోని జుంటుపల్లి ప్రాజెక్టు ఎడమ, కుడి కాల్వల ఆధునీకరణ పనులకు రూ.5.71 కోట్ల రూపాయల నిధులతో ఆయన శంకుస్థాపన చేశారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. గత పాలకులు జుంటుపల్లి ప్రాజెక్టు కాల్వల పునరుద్ధరణ పనులపై దృష్టి సారించలేదని, రైతులకు సాగునీరు అందించాలనే ఆలోచన కూడా చేయలేదని విమర్శించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా సాగునీటి రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. జుంటుపల్లి ప్రాజెక్టు కాల్వల ఆధునీకరణతో సాగునీటి వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, నీటి వృథా తగ్గి ఆయకట్టు రైతులకు ప్రయోజనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.నియోజకవర్గంలో సాగునీటి వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కోట్పల్లి ప్రాజెక్టు పనులను దాదాపు రూ.100కోట్లతో ప్రారంభించామని, ప్రస్తుతం ఆ పనులు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. తాజాగా జుంటుపల్లి ప్రాజెక్టు కాల్వల ఆధునీకరణకు రూ.5.71 కోట్లతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సాగునీటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జుంటుపల్లి ప్రాజెక్టు పనుల పూర్తి కోసం అవసరమైతే మరిన్ని నిధులు తీసుకొచ్చి, ఆయకట్టు రైతులందరికీ సాగునీరు అందేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మేస్త్రి శ్రీనివాస్ వడ్డే, ఎస్ ఆర్ ఐ నియోజకవర్గ కన్వీనర్ కెపి రావు, యాలాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అనిల్ కుమార్, సురేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాలువ పూడికతీత పనులను పరిశీలించిన నాయకులు

**మాగనూర్ అక్టోబర్ 14 (వుదయం న్యూస్)**



మక్తల్ నియోజకవర్గం క్రిష్ణ మండలం కున్ని హిందుపూర్ సమీపంలోని జైన్ మందిర్ వద్ద ఆనంపల్లి, కొత్తపల్లి వైపు వ్యవసాయ పంట పొలాలకు సాగునీరు అందించే కాలువలలో పూడికతీత పనులను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు వారి సోదరుడు వాకిటి శేషగిరి నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా వాకిటి శేషగిరి మాట్లాడుతూక్రిష్ణ మండలం కున్ని వద్ద జైన్ మందిర్ నుంచి ఆనంపల్లి, కొత్తపల్లి వైపు సాగునీరు అందించే కాలువలలో పూడికతీత పనులను ప్రారంభించామని అన్నారు. నియోజకవర్గంలో దాదాపుగా అన్ని మండలాల్లో కాలువల పూడికతీత పనులు ఒక యజ్ఞంలా కొనసాగుతున్నాయని, గతంలో పూడికతీత లేక కాలువలు నిర్జీవంగా మారాయని, తిరిగి కాలువలకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జీవం పోస్తున్నారని అన్నారు. మంత్రి స్వయంగా రైతు అని, రైతుల కష్టాలపై ఆయనకు పూర్తిగా అవగాహన ఉందని, క్రిష్ణ, భీమా నదులపై కొత్తగా రిజర్వాయర్ల నిర్మాణం కోసం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల స్థాయిలో ఇటీవల చర్చలు జరిపిన సంగతి గుర్తు చేశారు. రైతులపై మంత్రి కి ఉన్న ప్రత్యేక నిబద్ధత ఇందుకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, సీనియర్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వెంకటాపూర్ లో నిర్ణీత గడువులోగా భూ సర్వేపూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్**

**మరికల్ అక్టోబర్ 14 ( వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్ర పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రభుత్వ నిర్దేశించి గడువులోగా భూ సర్వేను పూర్తి చేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు రైతులకు భూ సర్వే చేయడం వల్ల ఎవరి సర్వే నెంబర్ ప్రకారం వాళ్లకు హద్దులు చూపిస్తారని భూ సర్వే పూర్తి అయితే భూమి తగాదాలు ఉండవని ఆమె అన్నారు భూ సర్వే హద్దులను పకడిబందిగా గుర్తింపు చేయాలని ఆమె అన్నారు హద్దులు గ్రామకంతం ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామకోటి ఏడి వేణుగోపాల్ రెడ్డి సిబ్బంది రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## జర్నలిస్టులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

- జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం

**సంగారెడ్డి, అక్టోబర్ 14 :వు దయం.**





విధి నిర్వహణలో నిరంతరం శ్రమించే పాత్రికేయులు తమ ఆరోగ్య పరిరక్షణకు తగిన ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సన్‌రైజ్ ఆసుపత్రి, సహకారంతో, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్‌రైజ్ ఆసుపత్రి లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే పని ఒత్తిడి, సమయాభావం కారణంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. జర్నలిస్టులు,తమతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు.ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు ఉచిత వైద్య సంప్రదింపులు అందించడంతోపాటు అవసరమైన వారికి ఈసీజీ, 2డీ ఎకో, రక్త పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె, ఊపిరితిత్తులు,

ఎముకలు, కీళ్లు, మధుమేహం, నాడీ సంబంధిత సమస్యలతోపాటు మహిళల ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైజల్ అలీ, జిల్లా అధ్యక్షుడు బండారి యాదగిరి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, సన్‌రైజ్





ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ స్వామి గౌడ్, రథసారథి తెలుగు దినపత్రిక సంపాదకుడు సంతోష్ గౌడ్, జర్నలిస్టు సంఘాల నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## తక్కువ కేలరీల స్వీటెనర్లతో గుండెకు ప్రమాదమే..



చక్కెరకు ప్రత్యామ్నాయంగా తక్కువ కేలరీల స్వీటెనర్లను ఉపయోగించడం ఇటీవలి కాలంలో పెరిగింది. వాటిలో జైలిటాల్ కూడా ఒకటి. షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్‌లు, క్యాండీలు, ప్రాసెస్డ్ ఆహారాలు, టూత్‌పేస్ట్ వంటి అనేక ఉత్పత్తుల్లో దీనిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అయితే జైలిటాల్ వల్ల గుండె ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంశంపై తాజాగా వెలువడిన పరిశోధన ఆసక్తికర విషయాలను వెల్లడించింది. యురోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ కాంగ్రెస్ 2026లో సమర్పించిన ఈ అధ్యయనంలో రక్తంలో జైలిటాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నవారికి గుండెపోటు, స్ట్రోక్, గుండె సంబంధిత మరణాలు వంటి తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని గుర్తించారు. ఈ పరిశోధనలో ఉత్తర అమెరికా, యూరప్‌కు చెందిన రెండు పెద్ద అధ్యయనాల నుంచి మొత్తం 17,710 మంది వివరాలను పరిశీలించారు. ఒక అధ్యయనంలో పాల్గొన్నవారిని ఆరు సంవత్సరాల పాటు, మరో అధ్యయనంలో కొందరిని 30 సంవత్సరాల వరకు పరిశీలించారు. వయసు, ధూమపానం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి ఇతర గుండె సంబంధిత ప్రమాద కారకాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఆరు సంవత్సరాల పరిశీలనలో రక్తంలో జైలిటాల్ స్థాయిలు అత్యధికంగా ఉన్నవారికి, తక్కువ స్థాయిలు ఉన్నవారితో పోలిస్తే తీవ్రమైన గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం 57 శాతం ఎక్కువగా కనిపించింది. దీర్ఘకాలిక అధ్యయనంలో ఈ సంబంధం 18 శాతంగా నమోదైంది. జైలిటాల్ స్థాయిలు పెరిగే కొద్దీ గుండె సంబంధిత ప్రమాదం కూడా పెరుగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు.

జైలిటాల్ గుండెపై ప్రభావం చూపడానికి రక్తంలోని ప్లేట్‌లెట్ల కార్యకలాపాలు ఒక కారణం అవుతాయని పరిశోధకులు భావిస్తున్నారు. రక్తస్రావాన్ని ఆపేందుకు ప్లేట్‌లెట్లు రక్తం గడ్డకట్టే ప్రక్రియలో సహాయపడతాయి. అయితే అవి అధికంగా చురుకుగా మారితే అవసరం లేని రక్తం గడ్డలు ఏర్పడే అవకాశం ఉంటుంది. గతంలో నిర్వహించిన ప్రయోగాల్లో జైలిటాల్ తీసుకున్న తర్వాత ప్లేట్‌లెట్ల గడ్డకట్టే సామర్థ్యంలో మార్పులు కనిపించాయి. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే ప్రక్రియను ఇది ప్రోత్సహిస్తుందని కొన్ని ప్రయోగశాల పరిశోధనలు కూడా సూచించాయి. గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ధమనిలో రక్తం గడ్డ ఏర్పడి రక్తప్రసరణకు అడ్డంకి కలిగితే గుండెపోటు వస్తుంది. మెదడుకు రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడితే ఇస్కీమిక్ స్ట్రోక్ సంభవించే అవకాశం ఉంటుంది. అయితే ఈ పరిశోధన ఆధారంగా జైలిటాల్ తీసుకోవడం వల్ల నేరుగా గుండెపోటు లేదా స్ట్రోక్ వస్తుందని చెప్పలేమని పరిశోధకులు స్పష్టం చేశారు. ఇది పరిశీలనా అధ్యయనం కావడంతో జైలిటాల్ స్థాయిలు, గుండె సంబంధిత సమస్యల మధ్య ఉన్న సంబంధాన్ని మాత్రమే గుర్తించింది. కారణం–ఫలిత సంబంధాన్ని నిర్ధారించలేదు. అందువల్ల జైలిటాల్ ఉన్న ప్రతి ఉత్పత్తిని ప్రమాదకరంగా భావించాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా చూయింగ్ గమ్, టూత్‌పేస్ట్ వంటి ఉత్పత్తుల ద్వారా సాధారణంగా జరిగే వినియోగం గుండెపోటు లేదా స్ట్రోక్‌కు కారణమవుతుందని ఈ అధ్యయనం నిరూపించలేదు. అయితే చక్కెరbకు ప్రత్యామ్నాయంగా జైలిటాల్‌ను పెద్ద మొత్తంలో, క్రమం తప్పకుం డా తీసుకునే విషయంలో మరింత పరిశోధన అవసరమని తాజా ఫలితాలు సూచిస్తున్నాయి.

పాల్గొన్నవారిని ఆరు
అధిక
సంవ
బరువు లేదా ఊబకాయం
ఉన్నవారు రోజూ ఎక్కువ ఆహారం,
కేలరీలు తీసుకుంటున్నప్పటికీ వారి శరీరానికి అవస

వేయడం
సరిపోదు. భారత్‌లో అనేక
కుటుంబాల ఆహారంలో అన్నం, చపాతీలు,
ఇతర ధాన్య పదార్థాలదే ప్రధాన భాగం. వీటితోపాటు పప్పులు, పెరుగు, పనీర్, గుడ్లు, చేపలు, చికెన్, సోయా, బీన్స్, శనగలు, గింజలు వంటి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం అవసరం. అయితే వీటిని తీసుకునే పరిమాణం, తరచుదనం ఒక్కొక్కరి ఆహారపు అలవాట్లను బట్టి మారుతుంది. రోజుకు మూడు పూటలా భోజనం చేసి, మధ్యలో చిరుతిళ్లు తింటూ బరువు పెరుగు

## సన్నగా ఉండే వారికే ప్రోటీన్ లోపం ఉంటుందా..



తున్న వ్యక్తి కూడా కండరాల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైనంత ప్రోటీన్ తీసుకోలేరు. కాబట్టి నిండుగా భోజనం చేస్తున్నామనే భావనతో శరీరానికి కావాల్సిన ప్రోటీన్ అందుతోందని అనుకోవద్దు. ప్రోటీన్ కండరాలను కాపాడడంతోపాటు శరీర కణజాలాల మరమ్మత్తు, ఎంజైములు, హార్మోన్ల తయారీ, రోగనిరోధక వ్యవస్థ పనితీరుకు కీలకంగా ఉంటుంది. వయసు పెరిగే కొద్దీ కండరాల పరిమాణం, బలం సహజంగానే తగ్గుతాయి. శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక అనారోగ్యం లేదా సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి మరింత వేగంగా మారుతుంది. అధిక బరువు ఉన్న వృద్ధుల్లో శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉన్నప్పటికీ కండరాల బలం తగ్గే అవకాశం ఉంటుంది. తూకం యంత్రంపై బరువు స్థిరంగా ఉన్నా కండరాల బలం క్రమంగా తగ్గిపోతుంది. దీనివల్ల నడక, సమతుల్యత, రోజువారీ పనులు చేయడం, అనారోగ్యం లేదా గాయం నుంచి కోలుకోవడం కష్టమయ్యే అవకాశం ఉంటుంది.

రమైనంత ప్రోటీన్ అందదు. సాధారణంగా ప్రోటీన్ లోపం అంటే సన్నగా ఉండేవారికే వస్తుందని భావిస్తారు. అయితే ఇది సరైన అవగాహన కాదు. కేలరీలు, ప్రోటీన్ రెండూ వేర్వేరు పోషకాలు. శుద్ధి చేసిన ధాన్యాలు, చక్కెర, వేయించిన పదార్థాలు, ఎక్కువ కేలరీలు ఉండే ఆహారాన్ని అధికంగా తీసుకుంటే బరువు పెరుగుతారు. అదే సమయంలో ప్రోటీన్ తీసుకోవడం మాత్రం తక్కువగా ఉంటుంది. అందువల్ల శరీర బరువును మాత్రమే చూసి పోషకాహార స్థితిని అంచనా

బరువు తగ్గే ప్రయత్నాల్లో కేలరీలను తగ్గించడంపైనే కాకుండా కండరాలను కాపాడుకోవడంపైనా దృష్టి పెట్టాలి. ప్రోటీన్ సరిపడా తీసుకోవడంతోపాటు తగిన శారీరక శ్రమ కూడా అవసరం. ప్రోటీన్ అంటే కేవలం వ్యాయామం చేసే వారికి లేదా కండరాలు పెంచుకోవాలనుకునే వారికి మాత్రమే అవసరమైన పోషకం కాదు. పిల్లలకు ఎదుగుదలకు, పెద్దలకు శరీర కణజాలాల నిర్వహణకు, వృద్ధులకు కండరాల బలం, శారీరక సామర్థ్యాన్ని కాపాడుకోవడానికి ఇది అవసరం.

వయసు, శరీర పరిమాణం, శారీరక శ్రమ, ఆరోగ్య పరిస్థితులను బట్టి అవసరమైన ప్రోటీన్ పరిమాణం మారుతుంది. అందువల్ల ప్రతి ప్రధాన భోజనంలో ప్రోటీన్ ఉండేలా చూసుకోవడం మంచిది. గుడ్లు, పెరుగు, పప్పులు, పనీర్, సోయా, బీన్స్, శనగలు, చేపలు, మాంసం, గింజలు వంటి ఆహారాలను ఆహారపు అలవాట్లకు అనుగుణంగా చేర్చుకోవచ్చు. ప్రోటీన్ లోపం శరీర ఆకారంతో సంబంధం లేకుండా ఎవరికైనా వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

## శరీరంలో ఇన్ఫెక్షన్లు తీవ్రమైతే కనిపించే లక్షణాలు ఇవే..

చాలా వరకు ఇన్ఫెక్షన్లు సరైన చికిత్స, తగిన విశ్రాంతితో తగ్గిపోతాయి. అయితే జ్వరం తగ్గకుండా కొనసాగడం, లక్షణాలు మరింత తీవ్రమవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గందరగోళం లేదా మూత్ర విసర్జన తగ్గడం వంటి కొత్త సమస్యలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. ఇవి ఇన్ఫెక్షన్ తీవ్రమవుతోందని లేదా సెప్సిస్ అనే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతోందని సూచించే హెచ్చరికలు అవుతాయి. సాధారణంగా ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు జ్వరం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మందులు వాడుతూ విశ్రాంతి తీసుకుంటే క్రమంగా కోలుకుంటారు. కానీ కొందరిలో పరిస్థితి మెరుగుపడాల్సిన సమయంలో మరింత దిగజారుతుంది. జ్వరం కొనసాగడం, నీరసం పెరగడం, శ్వాస తీసుకోవడం కష్టమవడం, మొదట అప్రమత్తంగా ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా అయోమయానికి గురవడం లేదా అసాధారణంగా మగతగా ఉండడం వంటివి ముఖ్యమైన హెచ్చరికలు. ఇన్ఫెక్షన్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, లక్షణాలు తగ్గకుండా వేగంగా పెరుగుతున్నప్పుడు లేదా శరీరంలోని ముఖ్యమైన అవయవాలకు సంబంధించిన కొత్త సమస్యలు కనిపించినప్పుడు తీవ్రమైన ఇన్ఫెక్షన్ ఉందేమోనని వైద్యులు పరిశీలించాలి. సెప్సిస్ అనేది ఇన్ఫెక్షన్‌కు శరీరం స్పందించే విధానం అదుపు తప్పడం వల్ల కణజాలాలు, అవయవాలు దెబ్బతినే ప్రాణాపాయ పరిస్థితి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, 2020లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 4.89 కోట్ల సెప్సిస్ కేసులు నమోదయ్యాయి. ఈ పరిస్థితికి సంబంధించిన కారణాలతో దాదాపు 1.1 కోట్ల మంది మరణించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా నమోదైన మొత్తం మరణాల్లో సుమారు 20 శాతం. ఊపిరితిత్తులు, మూత్రనాళాలు, జీర్ణవ్యవస్థ, చర్మానికి సంబంధించిన ఇన్ఫెక్షన్లు సెప్సిస్‌కు దారితీసే అవకాశాలు ఉంటాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వేగంగా శ్వాసించడం, గందరగోళం, ప్రవర్తనలో మార్పులు, తీవ్రమైన మగత, రక్తపోటు తగ్గడం, మూత్రం తక్కువగా రావడం, పదేపదే వాంతులు కావడం, విపరీతమైన నీరసం వంటి లక్షణాలను గమనించాలి. కొందరిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్ ఉన్నప్పటికీ జ్వరం ఉండదు. ప్రతి ఒక్కరిలోనూ అన్ని లక్షణాలు కనిపించవు. పరిస్థితి మరింత దిగజారుతున్నప్పుడు ఇంట్లోనే వేచి చూడకుండా వెంటనే వైద్య సహాయం పొందాలి. సకాలంలో గుర్తించి చికిత్స చేయకపోతే సెప్సిస్ మరింత తీవ్రమై, రక్తపోటు ప్రమాదకరంగా పడిపోవడం, అనేక అవయవాలు పనిచేయకపోవడం, చివరకు మరణం సంభవించే ప్రమాదం ఉంటుంది. ఇన్ఫెక్షన్ తగ్గకపోవడానికి అనేక కారణాలు ఉంటాయి. వాటిలో ముఖ్యమైనది యాంటీబయాటిక్ మందులకు బ్యాక్టీరియా లొంగకపోవడం. దీనినే యాంటీమైక్రోబియల్ నిరోధకత అంటారు. ఇలాంటి సందర్భాల్లో సాధారణంగా పనిచేసే మందులు ప్రభావం చూపవు. ఏ మందు పనిచేస్తుందో తెలుసుకోవడానికి రక్తం లేదా ఇతర నమూనాల పరీక్షలు, సూక్ష్మజీవుల పెరుగుదలను గుర్తించే పరీక్షలు అవసరమవుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, 2019లో బ్యాక్టీరియా యాంటీమైక్రోబియల్ నిరోధకత ప్రపంచవ్యాప్తంగా సుమారు 12.7 లక్షల మరణాలకు ప్రత్యక్షంగా కారణమైంది. దాదాపు 50 లక్షల మరణాలతో దీనికి సంబంధం ఉంది. కొన్నిసార్లు ఇన్ఫెక్షన్ ఏర్పడిన మూల సమస్యను పూర్తిగా తొలగించకపోవడం కూడా కారణం అవుతుంది. ఉదాహరణకు, చీముతో నిండిన గడ్డను తొలగించడం లేదా ఇన్ఫెక్షన్ సోకిన పదార్థాన్ని బయటకు తీయడం వంటి చికిత్సలు అవసరమవుతాయి. రోగనిరోధక శక్తి తగ్గినవారు, వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలున్నవారికి తీవ్రమైన ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువగా ఉంటుంది. జ్వరం తగ్గడం లేదని సొంతంగా యాంటీబయాటిక్ మార్చడం, మందును మధ్యలో ఆపేయడం లేదా ఇతరుల మందులు వాడడం ప్రమాదకరం. యాంటీబయాటిక్స్ వైరల్ ఇన్ఫెక్షన్లపై పనిచేయవు. ఏ మందు అవసరమో ఇన్ఫెక్షన్ రకం, అది సోకిన ప్రాంతం, తీవ్రత, గతంలో వాడిన మందులు, పరీక్షల ఫలితాలను బట్టి వైద్యులు నిర్ణయిస్తారు.



## ప్లాంక్ వ్యాయామాన్ని అసలు ఎలా చేయాలి..

అమెరికాకు చెందిన 61 ఏళ్ల డోన్నాజీన్ వైల్డ్ ఐదు గంటల పాటు ప్లాంక్ వ్యాయామం చేసి ప్రపంచ రికార్డు సృష్టించారు. హంట్స్‌మన్ వరల్డ్ సీనియర్ గేమ్స్‌లో భాగంగా ఆమె ఈ ఘనత సాధించారు. మహిళల విభాగంలో అత్యధిక సమయం పాటు అబ్డామినల్ ప్లాంక్ చేసిన వ్యక్తిగా ఆమె గుర్తింపు పొందారు. ఈ రికార్డుకు సంబంధించిన వీడియోను నిర్వాహకులు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సాధారణంగా కొన్ని నిమిషాల పాటు ప్లాంక్ చేయడమే చాలామందికి కష్టంగా ఉంటుంది. అలాంటిది ఐదు గంటల పాటు ఒకే భంగిమలో ఉండడం అసాధారణమైన కండరాల ఓర్పుకు నిదర్శనం. అయితే ఈ రికార్డును చూసి ప్రతి ఒక్కరూ అంతసేపు ప్లాంక్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాల్సిన అవసరం లేదని నిపుణులు సూచిస్తున్నారు. ప్లాంక్ వ్యాయామం చూడడానికి సులభంగా కనిపించినప్పటికీ, శరీరంలోని అనేక కండ రాలు ఒకేసారి పనిచేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా పొత్తికడుపు కండరాలు, వెన్ను కింది భాగం, పిరుదులు, నడుము చుట్టూ ఉండే కండరాలు శరీరాన్ని స్థిరంగా ఉంచ డంలో కీలక పాత్ర పోషిస్తాయి. భుజాలు, చేతులు, తొడల కండరాలు కూడా శరీర బరువును సమతుల్యం చేయడానికి సహాయపడతాయి. ఈ వ్యాయామం సమయంలో శరీరాన్ని కదపకుండా ఒకే స్థితిలో ఉంచేందుకు కండరాలు నిరంతరం పనిచేస్తాయి. దీనివల్ల శరీర మధ్యభాగంలోని కండరాల బలం, ఓర్పు పెరుగుతాయి. వెన్నెముక, నడుమును స్థిరంగా ఉంచడంలోనూ ప్లాంక్ ఉపయోగపడుతుంది. అయితే ప్లాంక్ చేయడం వల్ల మాత్రమే శరీర భంగిమ పూర్తిగా మెరుగుపడుతుందని చెప్పలేం. కండరాల బలంతో పాటు శరీర కదలికలు, రోజువారీ అలవాట్లు కూడా భంగిమపై ప్రభావం చూపుతాయి. ప్లాంక్ ప్రధానంగా కండరాల బలం, ఓర్పును పెంచే వ్యాయామం. పరుగు, సైక్లింగ్ వంటి గుండెకు సంబంధించిన వ్యాయామాలతో పోలిస్తే ఇందులో కేలరీల ఖర్చు తక్కువగా ఉంటుంది. అందువల్ల బరువు తగ్గడానికి గంటల తరబడి ప్లాంక్ చేయాల్సిన అవసరం లేదు. బరువు తగ్గాలనుకునేవారు ఆహారపు అలవాట్లు, రోజువారీ శారీరక శ్రమ, కేలరీల సమతుల్యతతోపాటు బలాన్ని పెంచే వ్యాయామాలు, గుండెకు మేలు చేసే వ్యాయామాలపై దృష్టి పెట్టాలి. ప్లాంక్ చేసే సమయంలో అలసట పెరిగేకొద్దీ సరైన భంగిమను కొనసాగించడం కష్టమవుతుంది. నడుము కిందకు వంగడం, వెన్నును అతిగా వంచడం లేదా శరీరం పక్కకు తిరగడం వంటి తప్పులు జరుగుతాయి. ఇలా సరైన పద్ధతి లేకుండా ఎక్కువసేపు కొనసాగిస్తే వెన్ను కింది భాగం, భుజాలు, మణికట్టుపై అనవసర ఒత్తిడి పడుతుంది. కండరాల్లో సాధారణంగా కలిగే అలసటకు, తీవ్రమైన నొప్పికి మధ్య తేడాను గుర్తించాలి. తీవ్రమైన నొప్పి, తల తిరగడం లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగితే వెంటనే వ్యాయామాన్ని ఆపాలి.



ప్లాంక్ ఎంతసేపు చేయాలనే దానికి అందరికీ వర్తించే ఒకే సమయం లేదు. ప్రారంభంలో ఉన్నవారు 20 నుంచి 30 సెకన్ల పాటు సరైన భంగిమలో ప్లాంక్ చేసి, క్రమంగా తమ శక్తికి అనుగుణంగా సమయాన్ని పెంచుకోవాలి. వ్యాయామం చేసేటప్పుడు మోచేతులను భుజాల కింద ఉంచి, కాళ్లను వెనక్కి చాపి, తల నుంచి మడమల వరకు శరీరం సాధ్యమైనంత నిటారుగా ఉండేలా చూసుకోవాలి. పొత్తికడుపు కండరాలను బిగించి, శ్వాసను ఆపకుండా సహజంగా తీసుకోవాలి.

## ఉదయం ఖాళీ కడుపుతో వ్యాయామం చేస్తే కొవ్వు ఎక్కువగా కరుగుతుందా..

ఉదయం నిద్రలేచిన వెంటనే ఏమీ తినకుండా వ్యాయామం చేయడం వల్ల శరీరంలో నిల్వ ఉన్న కొవ్వు ఎక్కువగా వినియోగమవుతుందని చాలామంది నమ్ముతారు. అందుకే బరువు తగ్గాలని కోరుకునేవారు ఖాళీ కడుపుతో నడక, జాగింగ్ లేదా ఇతర వ్యాయామాలు చేస్తుంటారు. అయితే ఖాళీ కడుపుతో వ్యాయామం చేయడం ప్రతి ఒక్కరికీ, ప్రతి రకమైన వ్యాయామానికీ సరిపోదు. వ్యాయామం చేసే తీవ్రత, శరీరంలోని శక్తి నిల్వలు, ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా ఎక్కువ తీవ్రతతో చేసే వ్యాయామాల విషయంలో సరైన శక్తి లేకపోవడం వల్ల అలసట, తల తిరగడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. రాత్రి 8 నుంచి మరుసటి రోజు ఉదయం వరకు సుమారుగా 10 గంటల పాటు ఆహారం తీసుకోకుండా ఉన్న తర్వాత ఉదయం శరీరంలో కాలేయంలోని నిల్వ కార్బోహైడ్రేట్లు కొంతవరకు తగ్గిపోతాయి. ఇన్సులిన్ స్థాయిలు కూడా తక్కువగా ఉంటాయి. దీంతో శరీరం శక్తి కోసం నిల్వ ఉన్న కొవ్వు ఆమ్లాలను ఎక్కువగా ఉపయోగించుకునే పరిస్థితి ఏర్పడుతుంది. తక్కువ నుంచి మితమైన తీవ్రతతో చేసే నడక, తేలికపాటి జాగింగ్, సున్నితమైన యోగా వంటి వ్యాయామాల్లో ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు కొవ్వును ఇంధనంగా ఉపయోగించే శాతం పెరుగుతుంది. అయితే వ్యాయామం చేసే సమయంలో కొవ్వు ఎక్కువగా ఖర్చవడం, దీర్ఘకాలంలో శరీరంలోని కొవ్వు తగ్గడం రెండూ ఒకటే కాదు. దీర్ఘకాలిక బరువు తగ్గుదలలో రోజంతా తీసుకునే, ఖర్చు చేసే కేలరీల సమతుల్యత కీలకంగా ఉంటుంది.



ఖాళీ కడుపుతో చేసే వ్యాయామం కొన్ని సందర్భాల్లో ప్రతికూల ప్రభావాలను కలిగించే అవకాశాలు ఉంటాయి. కాలేయంలోని శక్తి నిల్వలు తక్కువగా ఉన్న సమయంలో అధిక తీవ్రతతో బరువులు ఎత్తడం లేదా వేగంగా వ్యాయామం చేయడం వల్ల శరీరం శక్తి కోసం కండరాల్లోని భాగాలను ఉపయోగించే పరిస్థితి ఏర్పడుతుంది. ఖాళీ కడుపుతో వ్యాయామం చేయడం వల్ల ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ పెరుగుతుంది. దీర్ఘకాలిక ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు ఉన్నవారిలో ఇది మరింత అలసటకు దారితీస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గితే తల తిరగడం, వికారం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కూడా కనిపించే అవకాశం ఉంటుంది.

అందువల్ల వ్యాయామం చేసే విధానాన్ని దానికి తగిన ఆహారంతో సమన్వయం చేసుకోవడం ముఖ్యం. వేగంగా నడవడం, తేలికపాటి సైక్లింగ్, తక్కువ తీవ్రతతో చేసే కదలికలు వంటి వ్యాయామాలను ఆరోగ్యంగా ఉన్న కొందరు వ్యక్తులు ఖాళీ కడుపుతో చేయవచ్చు. అయితే బరువులు ఎత్తడం, అధిక తీవ్రతతో చేసే వ్యాయామాలు, వేగవంతమైన విరామ వ్యాయామాలు లేదా గంటకు పైగా సాగే పరుగులు వంటి వాటికి శరీరానికి తగిన శక్తి అవసరం. ఇలాంటి సందర్భాల్లో వ్యాయామానికి 30 నుంచి 45 నిమిషాల ముందు తేలికపాటి కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## డిటాక్స్ డ్రింక్స్ నిజంగానే శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతాయా..



ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడం, శరీరంలోని విషపదార్థాలను తొలగించడం, బరువు తగ్గడం వంటి ప్రయోజనాలు కలుగుతాయనే ప్రచారంతో హెర్బల్ డిటాక్స్ డ్రింక్స్, డిటాక్స్ టీలు, గ్రీన్ జ్యూస్‌లు ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యం పొందాయి. అయితే వీటిని తరచూ తీసుకోవడం వల్ల శరీరానికి మేలు కంటే కొన్ని సందర్భాల్లో హాని కలిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన శరీరంలోనే కాలేయం, మూత్రపిండాలు సహజమైన డిటాక్స్ వ్యవస్థగా పనిచేస్తాయి. కాలేయం రసాయనాలు, మందులు, వ్యర్థ పదార్థాలను విచ్ఛిన్నం చేస్తుండగా, మూత్రపిండాలు ప్రతిరోజూ పెద్ద మొత్తంలో రక్తాన్ని వడపోసి వ్యర్థాలను తొలగించడంతోపాటు శరీరంలోని ద్రవాల సమతుల్యతను నియంత్రిస్తాయి. అందువల్ల ప్రత్యేకంగా డిటాక్స్ డ్రింక్స్ తీసుకోవాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. కొన్ని హెర్బల్ డిటాక్స్ పానీయాల్లో డాండెలియన్, జునిపర్, హార్స్‌టెయిల్ వంటి సహజ మూత్రవిసర్జక పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరం నుంచి నీటిని వేగంగా బయటకు పంపుతాయి. దీంతో కొంతకాలం బరువు తగ్గినట్లు కనిపించినా అది కొవ్వు తగ్గడం కాదని శరీరంలోని నీరు తగ్గడం మాత్రమే అవుతుందని నిపుణులు చెబుతున్నారు. అధికంగా నీరు కోల్పోవడం వల్ల డీహైడ్రేషన్ ఏర్పడి రక్త పరిమాణం తగ్గుతుంది. ఇది మూత్రపిండాల పనితీరుపై ఒత్తిడిని పెంచుతుంది. అలాగే కొన్ని గ్రీన్ జ్యూస్‌లు, సాంద్రీకృత మొక్కల సారాల్లో ఆక్సలేట్లు అధికంగా ఉంటాయి. ఇవి కాల్షియంతో కలిసి మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని పెంచడంతోపాటు కొన్ని సందర్భాల్లో మూత్రపిండాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది.

డిటాక్స్ టీలలో ఉండే సెన్నా, కాస్కారా వంటి సహజ విరేచన పదార్థాలను ఎక్కువకాలం తీసుకోవడం వల్ల విరేచనాలు, జీర్ణ సమస్యలు ఏర్పడి శరీరంలోని పొటాషియం, సోడియం వంటి ముఖ్యమైన ఖనిజాలు తగ్గిపోతాయి. ఎలక్ట్రోలైట్ల సమతుల్యత మూత్రపిండాల సాధారణ పనితీరుకు ఎంతో అవసరం. మరోవైపు, సరైన నియంత్రణ లేని కొన్ని హెర్బల్ ఉత్పత్తుల్లో వాటి పదార్థాల పూర్తి వివరాలు స్పష్టంగా ఉండవు. లికోరైస్ రూట్ వంటి కొన్ని మూలికలు రక్తపోటును పెంచి మూత్రపిండాల పనితీరుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు, ప్రతిరోజూ మందులు వాడేవారు, వృద్ధులు ఇటువంటి ఉత్పత్తులతో మరింత జాగ్రత్తగా ఉండాలి.

మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రత్యేకమైన డిటాక్స్ పానీయాలపై ఆధారపడాల్సిన అవసరం లేదు. రోజంతా తగినంత నీరు తాగడం, ఉప్పు తీసుకునే పరిమాణాన్ని నియంత్రించడం, సమతుల్యమైన పోషకాహారం తీసుకోవడం వంటి సాధారణ అలవాట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఇబుప్రోఫెన్ వంటి నొప్పి నివారణ మందులను వైద్యుల సూచన లేకుండా తరచూ ఉపయోగించకుండా జాగ్రత్తపడాలి. అధిక శక్తి కలిగిన హెర్బల్ సప్లిమెంట్లు లేదా డిటాక్స్ ఉత్పత్తులను ఉపయోగించే ముందు వైద్యులను సంప్రదించడం మంచిది. శరీరంలోని సహజమైన డిటాక్స్ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడమే మూత్రపిండాల సంరక్షణకు ముఖ్యమైన మార్గమని వారు సూచిస్తున్నారు.




### జేఎస్‌డబ్ల్యూ ఎంజీ విండ్సర్ ఇండల్జ్

ఎంజీ విండ్సర్ ఇండల్జ్ కారును మంగళవారం జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ విడుదల చేసింది. దీని ధర రూ.17.89 లక్షలు (ఎక్స్–షోరూమ్). 38 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్ కలిగిన ఈ కారు, పూర్తి ఛార్జింగ్‌తో 332 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. పెట్రోల్, డీజిల్ ధర బాగా పెరగడానికి తోడు, మెరుగుపడుతున్న ఛార్జింగ్ మౌలిక సదుపాయాల వంటివి ఈవీల (విద్యుత్తుకార్ల)కు గిరాకీ పెంచుతున్నాయని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ డైరెక్టర్ లక్ష్మీ రామ్ కుమార్ సుబ్బరాజ్ తెలిపారు. డిసెంబరు చివరకు దేశ ప్యాసింజర్ వాహన విభాగంలో విద్యుత్ వాహనాల వాటా రెండంకెల స్థాయికి చేరుకుంటుందని అంచనా వేశారు.

# ముదురుతున్న టాటాల వివాదం..



టాటా ట్రస్ట్స్, టాటా సన్స్ మధ్య నాయకత్వం, పాలనాపరమైన వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ (SDTT)లోని ట్రస్టీలపై నోయెల్ టాటా, ఆయన కుమారుడు నెవిల్లె టాటా కేవియట్ పిటిషన్ వేశారు. ముంబయి సిటీ సివిల్ కోర్టులో దానిని దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో పేర్కొన్న ట్రస్టీల్లో వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్, డారియస్ ఖంబటా, భాస్కర్ భట్ పేర్లు ఉన్నాయని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

చంద్రశేఖరన్ పదవీకాలాన్ని పొడిగించే అంశంలో టాటా సంస్థలో బోర్డ్ రూమ్ వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. ఇలాంటి సమయంలో తమ వాదనను వినకుండా తమకు వ్యతిరేకంగా కోర్టు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకుండా ఉండేందుకే నోయెల్ ఈ కేవియట్ పిటిషన్ వేశారు. టాటా ట్రస్ట్ ఛైర్మన్‌గా నోయెల్ నియామకం, ఆయన శాశ్వత ట్రస్టీగా కొనసాగుతోన్న తీరుపై ట్రస్టీల్లో ఒకరైన ప్రముఖ పారిశ్రామికవేత్త వేణు శ్రీనివాసన్ ఇటీవల మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. టాటా సన్స్ నామినీలు, ప్రతినిధుల నియామకం వంటివాటికి సంబంధించి ఎస్‌డీటీటీ (SDTT) నిర్ణయాల్లో నోయెల్ టాటా పాలుపంచుకోకుండా, ఓటు వేయకుండా ఆంక్షలు విధించాలని కోరారు. ట్రస్ట్, దాని నిర్వహణ బృందం, ఛైర్మన్ నోయెల్ టాటా.. టాటా సన్స్ వాణిజ్య వ్యవహారాలు, షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ ఈక్విటీ లిక్విడిటీ చర్చల్లో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం ట్రస్ట్ ప్రాథమిక లక్ష్యాలకు విరుద్ధమని అన్నారు. వాణిజ్య లావాదేవీల్లో నమోదిత ఎన్‌పీఓ (లాభాపేక్ష రహిత సంస్థ)లు నేరుగా పాల్గొనడం, ఆదాయపు పన్ను నిబంధనలు ఉల్లంఘించడమేనని తెలిపారు. అలా జరిగితే ట్రస్ట్‌కు భారీగా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. టాటాల ఆధ్వర్యంలోని ట్రస్ట్‌లు చట్టబద్ధంగా నడుస్తున్నాయా లేదా..? అని మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ పర్యవేక్షిస్తుంటారు. తాజాగా వేణు శ్రీనివాసన్ ఫిర్యాదు నేపథ్యంలో అక్టోబర్ 19లోగా నోయెల్ సమాధానం చెప్పాల్సి ఉంది. దీంతో ఆయన కెవియట్ పిటిషన్ దాఖలు చేశారు. టాటా ట్రస్ట్స్‌కు నోయెల్ టాటా ఛైర్మన్. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో ఈ ట్రస్ట్స్‌కు 66 శాతం వాటా ఉంది. టాటా ట్రస్ట్స్ ఆధ్వర్యంలో 15 దాతృత్వ సంస్థలు ఉండగా.. అందులో సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్ కీలకమైనవి. టాటా సన్స్‌లో ఆ రెండింటి వాటానే 51.54 శాతంగా ఉంది. అందుకే ఈ ట్రస్ట్‌ల ట్రస్టీల అభిప్రాయాలు టాటా సన్స్ పాలనా విధానాలపై ప్రభావం చూపుతుంటాయి.

# మళ్లీ నష్టాలతో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. గత సెషన్‌లో భారీ లాభాలు చూసిన మదుపర్లకు ఒక్కరోజులోనే ఆనందం ఆవిరైంది. ముఖ్యంగా ఫైనాన్షియల్, హెల్త్‌కేర్, మెటల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, విదేశీ మదుపర్లు ఈక్విటీ షేర్ల విక్రయాలు జరపడంతో సూచీలపై ప్రభావం పడింది.

సెన్సెక్స్ ఉదయం 73,049.76 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,033.78) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. రోజంతా లాభనష్టాల మధ్య ఊగిసలాడింది. ఇంట్రాడేలో 72,578.75 – 73,195.26 పాయింట్ల మధ్య చలించింది. చివరికి 251.89 పాయింట్లు పతనమై 72,781.89 వద్ద ముగిసింది. నిఫ్టీ 99.25 పాయింట్లు కోల్పోయి 22,622.70 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.15గా ఉంది. సెన్సెక్స్ 30లో బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండిగో షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హిందుస్థాన్ యునిలీవర్, ఎన్‌టీపీసీ, రిలయన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ 106.38 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,143.48 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఎల్ఐసీ నుంచి కొత్తగా 3 పాలసీలు




బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) మూడు కొత్త బీమా పథకాలను ప్రవేశపెట్టింది. పదవీ విరమణ తర్వాత స్థిరమైన ఆదాయం, కుటుంబ ఆరోగ్య రక్షణ, క్యాన్సర్ చికిత్స సమయంలో ఆర్థిక భరోసా కల్పించడం ఈ పథకాల ప్రధాన లక్ష్యం. ఈనెల 19 నుంచి ఈ పాలసీల విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

న్యూ జీవన్ ధారా–2: వ్యక్తిగత పొదుపు, డిఫర్డ్ యాన్యుటీ (పింఛను) పథకం ఇది. పదవీ విరమణ తర్వాత హామీతో కూడిన ఆదాయం పొందాలనుకునే వారికి ఉపయోగపడుతుంది. మార్కెట్ హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా, భవిష్యత్తు ఆదాయానికి ప్రణాళిక వేసుకోవడానికి ఈ పథకం తోడ్పడుతుంది.

హెల్త్ షీల్డ్: కుటుంబ ఆరోగ్య సంరక్షణ అవసరాలు దృష్టిలో పెట్టుకుని ఈ పాలసీని తీసుకొచ్చింది. పాలసీ కాల వ్యవధి, మొత్తం ప్రీమియాలు స్థిరంగా ఉంటాయి. ఆసుపత్రిలో చేరినప్పుడు రోజువారీ నగదు ప్రయోజనం లభిస్తుంది.

న్యూ క్యాన్సర్ కవర్: నిర్ణీత క్యాన్సర్లు నిర్ధారణ అయినప్పుడు.. వాస్తవ చికిత్స ఖర్చుతో సంబంధం లేకుండా పాలసీ విలువను చెల్లిస్తుంది. ఈ పథకంలో రూ.15–35 లక్షల వరకు పాలసీ తీసుకోవచ్చు. ఇప్పటికే ఉన్న క్యాన్సర్ పాలసీలతో కలిపి, గరిష్ఠ బీమా మొత్తం రూ.50 లక్షల పరిమితి ఉంది.

# రూ.2,000 మించిన యూపీఐ వాణిజ్య లావాదేవీలపై ఎండీఆర్ వాయిదా




రూ.2,000కు మించిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వాణిజ్య లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపు నిర్ణయాన్ని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వాయిదా వేసింది. కొన్ని యూపీఐ చెల్లింపులపై 0.4% ఎండీఆర్‌ను ఈనెల 15 నుంచి వసూలు చేయాలని తొలుత నిర్ణయించగా, దీపావళి తర్వాత అమలు చేయనున్నట్లు ఎన్‌పీసీఐ మంగళవారం ప్రకటించింది. పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని, ఎప్పటి నుంచి వసూలు చేస్తామనే కొత్త తేదీని తదుపరి వెల్లడిస్తామని ఎన్‌పీసీఐ తెలిపింది.

ఎంపిక చేసిన వ్యాపారులకు (పర్సన్ టు మర్చంట్ – పీ2ఎం) చేసే చెల్లింపు రూ.2,000 మించినప్పుడే ఎండీఆర్ వర్తించనుంది. ఈ ఛార్జీని వ్యాపారులే భరించాలి. వినియోగదారుల నుంచి వసూలు చేయకూడదు. రూ.75,000 లేదా అంతకంటే విలువైన లావాదేవీలపై ఎండీఆర్ గరిష్ఠంగా రూ.300కే పరిమితం చేసింది.

ఎన్‌పీసీఐ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం.. వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలకు ఈ ఛార్జీలు వర్తించవు. సాధారణంగా దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల వద్ద జరిగే రోజువారీ చెల్లింపుల్లో అత్యధిక భాగం ఉచితంగానే కొనసాగనున్నాయి. రైల్వేలు, టెలికాం, ఇంధనం, బీమా వంటి అత్యవసర సేవలకు సంబంధించి రూ.2,000కు మించిన లావాదేవీపై రూ.5 ఎండీఆర్‌ను ఎన్‌పీసీఐ ప్రతిపాదించింది. మ్యూచువల్ ఫండ్లు, స్టాక్ బ్రోకింగ్ వంటి మార్కెట్ ఆధారిత లావాదేవీలకు 0.02% చొప్పున ఎండీఆర్ వర్తిస్తుందని పేర్కొంది. ఈ విభాగంలోనూ ఒక్కో లావాదేవీపై ఛార్జీ గరిష్ఠంగా రూ.300గా ఉండనుంది. ఎండీఆర్ వసూలును వాయిదా వేయడాన్ని అఖిల భారత వర్తకుల సమాఖ్య (సీఏఐటీ) స్వాగతించింది. పండగలు, వివాహాల సీజన్‌లో వ్యాపార లావాదేవీలు అధికంగా జరుగుతాయని.. తాజా నిర్ణయం వల్ల లక్షల మంది వ్యాపారులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ(ఎంఎస్ఎంఈ)లకు మేలు జరుగుతుందని పేర్కొంది. తక్కువ మార్జిన్లతో లావాదేవీలు నిర్వహించే వ్యాపారులకు, ఎండీఆర్ అదనపు భారమయ్యేదని, ఫలితంగా డిజిటల్ చెల్లింపుల విధానానికీ అడ్డంకిగా మారే అవకాశం ఉందని అభిప్రాయపడింది.




## ఐసీసీ ఉత్తమ ప్లేయర్లుగా శుభ్‌మన్, షెఫాలి



భారత వన్డే, టెస్టు సారథి శుభ్‌మన్ గిల్.. భారత మహిళల జట్టు ఓపెనర్ షెఫాలి వర్మ ఐసీసీ 'ఉత్తమ ప్లేయర్' అవార్డు (సెప్టెంబర్ నెల) సాధించారు. ఈ పురస్కారాన్ని పొందడం రికార్డు స్థాయిలో శుభ్‌మన్‌కు ఇది అయిదోసారి. హేలీ మాథ్యూస్ (వెస్టిండీస్) తర్వాత అయిదు పర్యాయాలు ఈ అవార్డుకు ఎంపికైన ఘనత అతడిదే. మహిళల ఆసియా కప్‌లో 360 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన 22 ఏళ్ల షెఫాలి వర్మ.. ఆరు వికెట్లు కూడా తీసింది. గతేడాది నవంబర్‌లోనూ ఆమె 'ఉత్తమ ప్లేయర్' పురస్కారం అందుకుంది. పురుషులు, మహిళల విభాగాల్లో ఒకే దేశానికి చెందిన ప్లేయర్లు ఒకేసారి అవార్డు అందుకోవడం ఇది అయిదోసారి మాత్రమే. భారత్ తరఫున మూడోసారి. గతంలో బుమ్రా, స్మృతి మంధాన (2024), అభిషేక్ శర్మ, స్మృతి (2025) ఇలా ఒకేసారి అవార్డు సాధించారు.

# పారా ఏషియాడ్‌కు 166 మంది భారత అథ్లెట్లు

పారా ఆసియా క్రీడలకు 166 మంది అథ్లెట్లను పంపించేందుకు కేంద్ర క్రీడల శాఖ ఆమోదం తెలిపింది. ఈనెల 18న జపాన్‌లో ఆరంభమయ్యే ఈ క్రీడల్లో పాల్గొనే 166 మంది అథ్లెట్లలో 111 మంది పురుషులు, 55 మంది మహిళలు ఉన్నారు. 10 క్రీడాంశాల్లో వీళ్లు పోటీపడనున్నారు. శీతల్ దేవి (ఆర్చరీ), అవని లేఖరా (షూటింగ్), ప్రమోద్ భగత్ (బ్యాడ్మింటన్) లాంటి స్టార్లు ఈ జట్టులో ఉన్నారు. టీమ్ అధికారులు, సహాయక సిబ్బంది 94 మందితో కలిసి మొత్తం 275 మందితో కూడిన భారత బృందం జపాన్ విమానం ఎక్కనుంది. మరోవైపు ఈ జట్టులో వివాదాస్పద పారా షూటింగ్ కోచ్ జై ప్రకాశ్ నౌటియల్‌కు చోటు కల్పించలేదు. ఎంపిక కోసం జై ప్రకాశ్ నిర్దేశిత నియమాలు పాటించట్లేదని.. పైగా లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలతో చాలామంది షూటర్లు సాయ్ ప్రధాన కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయాకు వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో జై ప్రకాశ్.. ఈ బృందంలో చోటు కోల్పోయాడు. అతడి స్థానంలో జాతీయ కోచ్ జీవన్ రాయ్ ఎంపికయ్యాడు. ఈ క్రీడలకు భారత సైక్లింగ్ సమాఖ్య, భారత పారాలింపిక్ కమిటీ ఏడుగురిని ప్రతిపాదించగా.. క్రీడల శాఖ ఒకరికే (అర్షద్ షేక్) ఆమోదం తెలిపింది. ప్రమాణాలు అందుకోలేకపోయారనే కారణంతో మిగిలిన వారిని తప్పించింది. దీనిపై సైక్లిస్ట్‌లు నిరసన తెలిపినా.. క్రీడల శాఖ ఎలాంటి మార్పులు చేయలేదు. 2022 పారా ఆసియా క్రీడల్లో భారత్ 108 పతకాలు (27 స్వర్ణాలు, 32 రజతాలు, 49 కాంస్యాలు) సాధించింది.



# ఆ టోర్నమెంట్‌లో అనుమతి లేకుండా నా పేరు వాడారు: శిఖర్ ధావన్



వరల్డ్ టీ20 కాంటినెంట్ కప్ నిర్వాహకులు తన పేరును అనధికారికంగా వాడుకోవడాన్ని భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ఖండించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ''వరల్డ్ టీ20 కాంటినెంట్ కప్‌లో పాల్గొనే వ్యక్తిగా నా పేరు వార్తల్లోకి వచ్చింది. అనుమతి లేకుండా నిర్వాహకులు నా పేరు ఉపయోగించారు. దీనిపై నా లీగల్ టీమ్ తగిన చర్యలు తీసుకుంటుంది. అనధికారిక సమాచారం విషయంలో జాగ్రత్తగా ఉండాలని మీడియా, అభిమానులను కోరుతున్నాను'' అని శిఖర్ ధావన్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్ ఆటగాళ్లు సభ్యులుగా ఉన్న ఆసియా వారియర్స్ జట్టుకు శిఖర్ ధావన్ కూడా ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు నిర్వాహకులు ఇదివరకు సోషల్ మీడియాలో ప్రకటించారు. ఇప్పుడు ధావన్పోస్టుతో నేపథ్యంలో దీనిపై నిర్వాహకులు మరో ప్రకటన చేశారు. షెడ్యూల్ సమస్యలు, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఈ టోర్నమెంట్‌లో ధావన్ ఆడటం లేదని పేర్కొనడం గమనార్హం.

# కోహ్లీ ఛేజ్ మాస్టర్ అయితే..

## రోహిత్ మంచి లీడర్: ఇంగ్లాండ్ మాజీ ఆల్‌రౌండర్



లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీని మించిన ఆటగాడు లేడని ఇంగ్లాండ్ మాజీ ఆల్‌రౌండర్ సమిత్ పటేల్ ప్రశంసించాడు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ వేగాన్ని మార్చుకోవడంలో అతడి నైపుణ్యం అద్భుతమని కొనియాడాడు. మరోవైపు రోహిత్ శర్మ బ్యాటింగ్‌లో దూకుడు చూపిస్తాడని, నాయకుడిగానూ అతడు ఎంతో ప్రతిభావంతుడని పేర్కొన్నాడు. భారత అత్యుత్తమ సారథుల్లో రోహిత్ ఒకడని అభిప్రాయం వ్యక్తం చేశాడు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (wcl) 2026 టోర్నీలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ సమిత్ పటేల్ ఈ వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా జట్లు చేరే అవకాశాలున్నాయని ఈ మాజీ ఆల్‌రౌండర్ అంచనా వేశాడు. భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తగినంత సమయం ఇవ్వాలని అభిప్రాయపడ్డాడు. అతడిలో అపార ప్రతిభ ఉందని, తప్పుల నుంచి నేర్చుకుంటూ ఎదిగేందుకు అవకాశం కల్పించాలని సూచించాడు. ఇంగ్లాండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ బౌలింగ్ లో వైభవ్ తన అంతర్జాతీయ కెరీర్‌లో (టీ20) ఎదుర్కొన్న మొదటి బంతికే సిక్స్ కొట్టి ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యపరిచాడని కొనియాడాడు.

# అభిషేక్ ఎఫెక్ట్.. సంజుపై ఒత్తిడి: పుజారా కీలక వ్యాఖ్యలు

ఇందౌర్ వేదికగా వెస్టిండీస్ తో జరిగిన మూడో టీ20 లో సంజు శాంసన్ తక్కువ పరుగులకే ఔట్ అవడంపై మాజీ క్రికెటర్ పుజారా స్పందించాడు. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు సంజు మరికొంత సమయం తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డాడు. అయితే మరో ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా క్రీజులో కుదురుకునేందుకు సమయం తీసుకోవడంతో శాంసన్‌పై ఒత్తిడి పెరిగిందని అన్నాడు. దీంతో వేగంగా పరుగులు చేయాలనే ప్రయత్నంలో అతడు ఔట్ అయినట్లు వివరించాడు. రెండో టీ20లో 82 పరుగులతో ఆకట్టుకున్న శాంసన్.. ఈ మ్యాచ్‌లో ఆరు బంతులు ఎదుర్కొని మూడు పరుగులకే వెనుదిరిగాడు. ఇక, మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తున్న ఇషాన్ కిషన్ ను పుజారా ప్రశంసించాడు. టాప్ ఆర్డర్‌లో దూకుడుగా ఆడే బ్యాటర్లకు సహకరిస్తూ, పవర్‌ప్లేలో వీలైనన్ని పరుగులు సాధిస్తున్నాడని పేర్కొన్నాడు. ప్రతి మ్యాచ్‌లోనూ భారీ స్కోరు చేయాల్సిన అవసరం లేదని, జట్టు అవసరాలకు తగ్గట్టుగా 30–40 పరుగులు చేసినా సరిపోతుందని పుజారా అభిప్రాయపడ్డాడు. వెస్టిండీస్‌తో సిరీస్‌లో 2–1తో టీమ్ఇండియా ఆధిక్యంలో ఉంది. హైదరాబాద్ వేదికగా బుధవారం నాలుగో టీ20 జరగనుంది.



# వుదయం సినిమా

MOVIE TIME!

# "రణబాలి" ప్రీ రిలీజ్ ఈవెంట్

**వుదయం సినిమా:** విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. రశ్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా "రణబాలి" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోయాక్టర్ మైమ్ మధు మాట్లాడుతూ – ఈ చిత్రంలో ప్రతాపుడు అనే పాత్రలో నటించాను. ఇది చాలా కీలకమైన పాత్ర. జుట్టు గడ్డం పెంచుకుని మీరు గుర్తుపట్టలేనంత కొత్త లుక్ లో నా క్యారెక్టర్ ఉంటుంది. దర్శకుడు రాహుల్ ఈ సినిమాను ఎంతో డీటెయిలింగ్ గా రూపొందించారు. మీరు మా సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా. అన్నారు.యాక్టర్ వినోద్ సాగర్ మాట్లాడుతూ – ఈ సినిమా కోసం మేమంతా ఏడాదిన్నరగా కష్టపడుతున్నాం. ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన మా డైరెక్టర్ రాహుల్ గారికి, మైత్రీ ప్రొడ్యూసర్స్ కు థ్యాంక్స్. అన్నారు. యాక్టర్ కంచెరపాలెం కిషోర్ మాట్లాడుతూ – సినిమాలను మనం వినోదం కోసం చూస్తాం. కానీ రణబాలి సినిమా ఒక పర్పస్ కోసం చేసిన సినిమా. మరుగున పడిన చరిత్రను మనకు తెలియజేసే ప్రయత్నంగా రూపొందిన సినిమా. లక్షల మంది ఆకలి కేకల నుంచి పుట్టిన కథ ఇది. ఈ సినిమాను ప్రేక్షకులంతా పెద్ద సక్సెస్ చేయాలని కోరుతున్నా. అన్నారు.యాక్టర్ వ్లాదిమిర్ మాట్లాడుతూ – రణబాలి సినిమాలో నటించడం బ్యూటిఫుల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. ఈ సినిమాలో నటించే అవకాశం కల్పించిన డైరెక్టర్ రాహుల్, మైత్రీ ప్రొడ్యూసర్స్ కు థ్యాంక్స్. అన్నారు.లిరిసిస్ట్ సరస్వతీపుత్ర రామజోగయ్యశాస్త్రి మాట్లాడుతూ – రణబాలి చిత్రంలో నేను రాసిన ఏందయ్యా సామీ పాట ఇంత ఆదరణ పొందడం సంతోషంగా ఉంది. ఈ పాట రచయితగా నేను గర్వపడేలా చేసింది. ఈ పాటలో రణబాలి, జయమ్మ మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది. మరుగున పడిన చరిత్రను మనకు తెలియజేసేలా దర్శకుడు రాహుల్ సంకృత్యన్ ఎంతో శ్రమించి ఈ సినిమా రూపొందించాడు.





# 'హైందవ' టీజర్

**వుదయం సినిమా:** 'కిష్కింధపురి' బ్లాక్‌బస్టర్ విజయంతో జోరు మీదున్న యాక్షన్ హల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఆకల్ట్ థ్రిల్లర్ 'హైందవ'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. నూతన దర్శకుడు లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో, మూన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ చందు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు చిత్రీకరణ ముగింపు దశకు చేరుకోగా, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో





జరుగుతున్నాయి. ఇందులో భాగంగా చిత్ర ప్రచార కార్యక్రమాలను ప్రారంభించిన మేకర్స్, ఈరోజు పవర్‌ఫుల్ టీజర్‌ను లాంచ్ చేశారు. రంగాపురం అనే గ్రామం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. అక్కడి పురాతన ఆలయంలోని విగ్రహాలన్నీ ఒక్కసారిగా మాయమవడం, అదే సమయంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హత్యకు గురవడంతో కథలో మిస్టరీ మొదలవుతుంది. ఈ రహస్యానికి మరో ఆసక్తికరమైన కోణాన్ని జోడిస్తూ, నిర్ణీత గడువులోగా ఆలయంలోని విగ్రహాలన్నీ తిరిగి వస్తాయని ఆలయ పూజారి నమ్ముతాడు. ఈ వింత ఘటనపై దర్యాప్తు చేసేందుకు దేవుడిపై నమ్మకం లేని ఓ పోలీస్ అధికారిని నియమిస్తారు. దీంతో విశ్వాసం, హేతుబద్ధమైన ఆలోచన, అంతుచిక్కని రహస్యాల మధ్య ఆసక్తికరమైన సంఘర్షణకు తెరలేస్తుంది.మిస్టికల్, భక్తి, యాక్షన్ అంశాలను సమన్వయం చేస్తూ దర్శకుడు లుధీర్ బైరెడ్డి ఆసక్తికరమైన కథనాన్ని రూపొందించారు. ఆద్యంతం ఉత్కంఠభరితమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ, రంగాపురంలో చోటుచేసుకుంటున్న రహస్య ఘటనల వెనుక ఉన్న అసలు నిజాలేమిటనే ఆసక్తిని ప్రేక్షకుల్లో పెంచేలా టీజర్‌ను కట్ చేశారు.దేవుడికంటే మానవత్వంపై నమ్మకం ఉంచే పోలీస్ అధికారిగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రను ఆవిష్కరించిన తీరు కథకు మరింత ఇంటెన్స్ తీసుకొచ్చాయి. యాక్షన్‌తో కూడిన ఆయన నటన ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణల్లో ఒకటిగా నిలవనుంది.

సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, ఆలయ పూజారి పాత్రలో మహేష్ మంజ్రేకర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించారు. ప్రొడక్షన్ డిజైనర్ శివ కామేష్.డి, ఆకల్ట్ నేపథ్యానికి తగిన మిస్టికల్ ప్రపంచాన్ని సృష్టించారు.

# 'అలియాస్ రుక్మిణి' ఫస్ట్ లుక్ రిలీజ్

**వుదయం సినిమా:** బ్లాక్‌బస్టర్ సక్సెస్ 'కోర్ట్ – స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతోంది. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్న 'అలియాస్ రుక్మిణి' ఒక విలక్షణమైన కథనంతో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. తాజాగా ఈ సినిమా లో నితిన్ సరసన కథానాయికగా బాలీవుడ్ నటి ఆఫియా సయ్యద్‌ను మేకర్స్ అధికారికంగా పరిచయం చేశారు. ఈ గ్లింప్స్‌లో రుక్మిణి ఓ స్కూల్ టీచర్‌గా కనిపిస్తుంది. ఆమెను విద్యార్థులు 'డెవిల్', 'హిట్లర్', 'హోంవర్క్ పోలీస్' వంటి పేర్లతో పిలుచుకుంటుంటారు. కోపంగా బోర్డుపై తన పేరు రాస్తూ, ఆ తర్వాత విద్యార్థుల వైపు ఇంటెన్స్ గా చూసే రుక్మిణి పాత్రను ఈ గ్లింప్స్ పరిచయం చేస్తోంది. కమాండింగ్, ఆరోగెంట్ బిహేవియర్ రుక్మిణి పాత్రలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. అందంగా కనిపిస్తూనే, ఆరోగెన్స్ తో కూడిన రుక్మిణి పాత్రకు ఆఫియా సయ్యద్ చక్కగా సరిపోయారు. ఈ గ్లింప్స్‌లో ఆమె లుక్, అభినయం ఆకట్టుకుంటున్నాయి.ఇప్పటికే విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దానికి వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్‌తో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ప్రేమకథా అంశాలతో పాటు ఆసక్తికరమైన ప్రధాన సంఘర్షణతో కూడిన కథలో నితిన్ ను సరికొత్త అవతార్‌లో చూపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు కూడా మంచి స్పందన వచ్చింది.ఈ చిత్రానికి జోమోన్ టీ. జాన్ ఐఎస్‌సీ డీవోపీ అందిస్తుండగా, విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్, సృజన అడుసుమిల్లి ఎడిటింగ్.షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో పాటు, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా కొనసాగుతున్నాయి.



# 'భరతవర్ష' నుంచి సాంగ్

**వుదయం సినిమా:** మాచో స్టార్ టి. గోపీచంద్ ప్రతిష్టాత్మక చారిత్రక యాక్షన్ చిత్రం 'భరతవర్ష'. సంకల్ప్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే అద్భుతమైన విజువల్స్‌తో రూపొందించిన గ్లింప్స్, క్రీ.శ. 642 నాటి నేపథ్యంలో వచ్చిన టైటిల్ టీజర్, పవర్‌ఫుల్ తొలి పాట 'వీర జయధీర' ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో నవరాత్రుల సందర్భంగా 'భరతవర్ష' నుంచి రెండో పాటను ఈరోజు విడుదల చేశారు.'అమ్మ కదిలి వచ్చె' పేరుతో విడుదలైన ఈ పాటకు అనుదీప్ దేవ్ సంగీతం అందించారు. దుర్గాదేవి ఆరాధనలోని వైభవాన్ని, నవరాత్రి ఉత్సవాల చుట్టూ ఉండే ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని ఈ పాట అద్భుతంగా ఆవిష్కరించింది. పాట పేరుకు తగ్గట్టుగానే, ఆ ప్రాంత ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆరాధించే శూలాంభ అమ్మవారి ఉత్సవ ఊరేగింపును ఇందులో చూపించారు. భక్తులు అమ్మవారిని పండుగ వాతావరణంలో ఊరేగింపుగా తీసుకురావడం, విగ్రహ ప్రతిష్ఠాపన కోసం నిర్వహించే పూజా కార్యక్రమాలను దృశ్యరూపంలో అద్భుతంగా తెరకెక్కించారు. ప్రజల భక్తి, ఉత్సాహం, సామూహిక ఆనందం పాటలోని ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంచాయి.దుర్గాదేవి తొమ్మిది దివ్య రూపాలను కూడా ఈ పాటలో వేడుకగా చూపించారు. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదాత్రి రూపాలను ఆవిష్కరించారు. అగ్నిజ్వాలలతో చుట్టుముట్టిన అగ్నిపర్వతంలా, ఉగ్రరూపంలో దర్శనమిచ్చే అమ్మవారి రూపం పాటలోని అత్యంత ఆకట్టుకునే దృశ్యాల్లో ఒకటిగా నిలిచింది.కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని తన శక్తివంతమైన దాలతో అమ్మవారి దివ్య వైభవాన్ని, ఉగ్రశక్తిని అద్భుతంగా ఆవిష్కరించారు. సింగర్ స్కంద వేలువలి బృందంలోని ఇతర గాయకులతో కలిసి తన వాయిస్ గానంతో భక్తిభావాన్ని మరింత పెంచారు. ఈ పాట ప్రేక్షకులకు ఒక గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది.ఉత్సవాల నేపథ్యంలో గోపీచంద్, రీతూ వర్మ అద్భుతంగా కనిపించారు.



# "క్రేజీ కల్యాణం" ఫన్, ఎమోషన్ తో సాగే మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్

**వుదయం సినిమా:** 'నవరసరాయ' డా. నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న "క్రేజీ కల్యాణం" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు 'నవరసరాయ' డా. నరేష్ విజయ కృష్ణ.–



ఈ రోజు మన తెలుగు సినిమా ప్రపంచ సినిమాతో పోటీ పడాల్సివస్తోంది. ప్రేక్షకుల్ని ఒప్పించి థియేటర్స్ దాకా తీసుకురావడం గగనమైపోయింది. సక్సెస్ ఫెయిల్యూర్స్ ఎప్పుడూ ఉంటాయి. మనకున్న సక్సెస్ రేట్ చాలా తక్కువ. బాలీవుడ్ లో రాజేష్ ఖన్నా సినిమా నుంచి అమితాబ్ సినిమాలు...అలా ఒక ట్రెండ్ కొనసాగుతూ వచ్చింది. తెలుగులో కూడా ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణగారు, చిరంజీవి..ఇలా మన దగ్గరా మూవీ జర్నీ మారుతూ వచ్చింది. సర్కిల్ లా సినిమా జానర్స్ మారినట్లు ఇప్పుడు ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్ ట్రెండ్ నడుస్తోంది. జెన్యూన్ గా హానెస్ట్ గా ఒక ఫ్యామిలీ ఎంటర్ టైనర్ చేస్తే తప్పకుండా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. సింగీతం, మా ఇంటి బంగారం లాంటి సినిమాలే ఇందుకు నిదర్శనం. అదే క్రమంలో క్రేజీ కల్యాణం సినిమా మన ముందుకు రాబోతోంది. ఇది హానెస్ట్ ఎంటర్ టైనర్. బద్రప్ప ఈ తరం దర్శకుడు, జగన్ మోహన్ రెడ్డి ఈ తరం నిర్మాత. ఎంతో ప్యాషన్ తో ఈ సినిమాను రూపొందించారు. దసరా పండుగ తెలుగు ప్రజలకు పెద్ద పండుగ.

# 'డోంట్ స్లీప్' ఎడ్జ్ ఆఫ్ ది సీట్ టీజర్



**వుదయం సినిమా:** మలయాళ దర్శకుడు షామ్‌దత్, యంగ్ హీరో ఇంద్ర రామ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'డోంట్ స్లీప్' ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. మమ్ముట్టి నటించిన మలయాళం–తమిళ ద్విభాషా థ్రిల్లర్ 'స్ట్రీట్ లైట్స్'తో దర్శకుడిగా పరిచయమైన సినిమాటోగ్రాఫర్ షామ్‌దత్ .. ఈ చిత్రంతో తెలుగులో దర్శకుడిగా అడుగుపెడుతున్నారు. 'చౌర్య పాఠం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఇంద్ర రామ్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. వీ డ్రీమ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై వీ చుడామణి నిర్మిస్తున్న ఈ చిత్రం ఆ సంస్థకు ప్రొడక్షన్ నంబర్ 2.నాగచైతన్య, విజయ్ సేతుపతి, దుల్కర్ సల్మాన్ కలిసి ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. పెళ్లి తర్వాత సంతోషంగా, ప్రశాంతంగా జీవిస్తున్న కథానాయకుడి జీవితంలోకి ఓ కల రూపంలో అనూహ్యమైన పరిణామం చోటు చేసుకుంటుంది. అతను కన్న కలల్లో ఒకటి నిజం కావడం మొదలైనప్పటి నుంచి అతని జీవితం తలకిందులవుతుంది. అతన్ని చంపాలని ప్రయత్నిస్తున్న ఓ మిస్టరీ వ్యక్తి నిరంతరం వెంటాడుతుంటాడు.

# 'గరివిడి లక్ష్మి' ప్రీ-రిలీజ్

**వుదయం సినిమా:** భారీ స్థాయి సినిమాలతో అలరించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది నటిస్తున్నారు. గౌరి నాయుడు





జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న 'గరివిడి లక్ష్మి' ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అక్టోబర్ 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే నిర్వహించిన ప్రీమియర్స్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రీ–రిలీజ్ ప్రెస్‌మీట్‌లో నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి గరివిడి లక్ష్మి కొత్త రకమైన ప్రయత్నం. మా అమ్మాయి మొదట ప్రారంభించిన సినిమా ఇది. గత పది రోజులుగా ఈ సినిమాకు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటివరకు సినిమా చూసిన అందరూ చాలా మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. ప్రేక్షకులు కూడా 17వ తేదీన ఈ సినిమా చూసి ఆదరిస్తారని కోరుకుంటున్నాను. ఈ సినిమాకు ముందుగానే ప్రీమియర్స్ వేయాలని మొదటే నిర్ణయించుకున్నాం. దసరా పండక్కి ఈ సినిమా కచ్చితంగా నిలబడగలదని నమ్ముతున్నాం. 17న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. సినిమా మీద నమ్మకంతోనే ముందుగానే ప్రీమియర్స్ వేస్తున్నాం. మేము చాలా మంచి సినిమాతో వస్తున్నాం. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. మొదటి నుంచి ఈ సినిమాను చాలా ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాం. సినిమా లాంచింగ్ ఈవెంట్‌ను ఒక ప్రీ–రిలీజ్ ఈవెంట్‌లాగా నిర్వహించాం. ఈ సినిమాలో సగం షూటింగ్ మా స్వస్థలం ఆదోనిలో చేశాం.

# 'ఇట్లు అర్జున' సాంగ్ లాంచ్

**వుదయం సినిమా:** స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మాతగా వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. ఈ సినిమాతో అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, డెబ్యూ దర్శకుడు మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. తమన్ ఎస్ మ్యూజిక్ అందిస్తున్నారు. టైటిల్ గ్లింప్స్, ఇప్పటికే విడుదలైన రెండు పాటలు, ఇతర ఆసక్తికరమైన ప్రమోషనల్



కంటెంట్‌తో సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. ఈ సినిమా అక్టోబర్ 30న థియేటర్లలో విడుదల కానుంది. ఈ రోజు మేకర్స్ వైజాగ్ గీతం యూనివర్సిటీలో యెల్లో చున్ని సాంగ్ లాంచ్ చేశారు.తమన్ ఎస్ బ్యూటిఫుల్ మెలోడీని కంపోజ్ చేశారు. ఈ పాటను తమన్, విశాల్ మిశ్రా కలిసి ఆలపించగా, శ్రీజో లిరిక్స్ ఆకట్టుకున్నాయి. అనీష్, అనస్వర రాజన్ తమ స్క్రీన్ ప్రెజెన్స్‌తో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. అనీష్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రత్యేకంగా అలరించాయి. బ్యూటిఫుల్ మెలోడీ, హీరోహీరోయిన్ల కెమిస్ట్రీతో పాట అదిరిపోయింది. ఇప్పటికే ఈ సాంగ్ సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ సొంతం చేసుకుంటూ ప్రేక్షకుల్లో బజ్ క్రియేట్ చేస్తోంది.సాంగ్ లోంచి ఈవెంట్లో మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ.. 'ఇట్లు అర్జున' లవ్లీ జర్నీ. లవ్ స్టోరీ అంటే చాలా ఇష్టం. సాధారణంగా 'థియేటర్లు, పగిలిపోవాలి, స్పీకర్లు కాలిపోవాలి' అని నాకు మెసేజ్‌లు పెడుతుంటారు.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.